

visit us @ http://epaper.suryaa.com

నేటి దినపత్రిక
# సూర్య
www.suryaa.com

సోమవారం | 20 మే 2024 | హైదరాబాద్




సంపుటి 17 | సంచిక 173
| పేజీలు 10+8 | వెల: రూ. 6.50

Published from Hyderabad, Visakhapatnam, Rajahmundry, Vijayawada, Guntur, Nellore, Tirupati, Kadapa, Kurnool, Anantapuram, Warangal, Karimnagar, Nalgonda, Chennai, Bangalore, Mumbai, New Delhi

అనుగ్రహం
శ్రీ క్రోధి నామ సంవత్సరం ఉత్తరాయణం - శిశిర ఋతువు, వైశాఖ మాసం శుద్ధ. ద్వాదశి మ.3.02, చిత్త తె.5.14, వర్జ్యం ఉ.11.38 నుంచి 1.24 వరకు
రాహుకాలం ఉ.10.30 నుంచి 12.00 వరకు దుర్ముహూర్తం మ.12.22 నుంచి 1.14 వరకు తిరిగి మ.2.56 నుంచి 3.48 వరకు

## నేడే ఐదో విడత
# పోలింగ్



- నగర ఓటర్లలో నిర్లిప్తత కనిపిస్తోందని ఈసీ ఆందోళన
- 379 స్థానాలకు ఓటింగ్ పూర్తయినట్లు వెల్లడి
- నాలుగు దశల్లో ఇప్పటి వరకు 66.95 శాతం ఓటింగ్
- ఓటర్లు భారీగా పోలింగులో పాల్గొనాలి
- ప్రత్యేక విజ్ఞప్తి చేసిన ఎన్నికల కమిషన్

నేడు లోక్ సభ ఎన్నికలకు సంబంధించి పలు రాష్ట్రాల్లో ఐదో దశ ఓటింగ్ జరుగనుంది. అందుకు సంబంధించి ఈసీ అన్ని ఏర్పాట్లు చేసింది. కాగా.. ఐదో విడత పోలింగ్‌కు ముందు ఓటర్లకు ఈసీ ప్రత్యేక విజ్ఞప్తి చేసింది. ఓటర్లు భారీ సంఖ్యలో పాల్గొని ఓటు వేయాలని కోరింది. ముఖ్యంగా పట్టణ ప్రజలకు ఎన్నికల సంఘం ప్రత్యేక అభ్యర్థన చేసింది. ముంబై, థానే, లక్నో వంటి నగరాల్లో గత ఎన్నికల్లో ఓటింగ్ పట్ల తేడా కనిపించిందని కమిషన్ చెబుతోంది. ఇతర నగరాలతో పోలిస్తే మెట్రోపాలిటన్ నగరాల్లో రెండో దశలో కూడా ఓటింగ్ తక్కువగా నమోదైందని కమిషన్ తెలిపింది.

6లో

## నమ్మినోళ్లని వదిలేసే
# గాంధీ కుటుంబం

**జంషెడ్‌పూర్ ఎన్నికల ర్యాలీలో ప్రధాని మోడీ విమర్శలు**

- ఇన్నాళ్లు తనని గెలిపించిన రాయ్‌బరేలిని సోనియా గాంధీ వదిలేసారు
- ఇంతకాలం రాయ్‌బరేలీలో పార్టీ తరుపున పనిచేసిన కార్యకర్తలు కనిపించరా?
- ఇప్పుడు కొడుకు కోసం ఓట్లు అడుగుతున్నారు
- మమతా బెనర్జీ రాక్షస భాష మాట్లాడుతున్నారు



6లో

సోనియాగాంధీ టార్గెట్‌గా ప్రధాని నరేంద్రమోడీ ఆదివారం కీలక వ్యాఖ్యలు చేశారు. రాయ్‌బరేలీని వదిలేసి, తన కొడుకు రాహుల్ గాంధీ కోసం సోనియాగాంధీ ఓట్లు అడుగుతున్నారని అన్నారు. కుటుంబ ఆధారిత పార్టీల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.తన కొడుకును వారికి అప్పగిస్తున్నానని చెబుతున్నారని, రాయ్‌బరేలీలో ఎక్కువ కాలం పార్టీ తరుపున పనిచేసిన ఒక్క కార్యకర్త కనిపించలేదా..? అని ప్రధాని ప్రశ్నించారు.



6లో

## పార్లమెంటుకు భారీ భద్రత

- రంగంలోకి 3300 మంది సీఐఎస్ఎఫ్ సిబ్బంది
- డిసెంబర్‌లో జరిగిన అలజడి ఘటనతో తీవ్ర కలకలం
- అన్ని సెక్యూరిటీ పాయింట్‌లను సీఐఎస్ఎఫ్‌కు అప్పగింత
- విధ్వంసక కార్యకలాపాల కట్టడికి ప్రత్యేక శిక్షణ

సూర్య వెబ్‌సైట్

సూర్య ఈ - పేపర్

## అమెరికాకు
# టీడీపీ అధినేత

- వైద్య పరీక్షల కోసం వెళ్లారంటున్న పార్టీ వర్గాలు
- ఐదారు రోజుల పాటు ఆయన పర్యటన ఉండనున్నట్లు సమాచారం
- చంద్రబాబు వెంట ఆతని సతీమణి భువనేశ్వరి
- ఎన్నికల ఫలితాలు వెలువడే నాటికి తిరిగి రాష్ట్రానికి రాక

ఎన్నికల హడావుడి, పోలింగ్ కూడా ముగియడంతో రాజకీయ పార్టీల అధినేతలు విశ్రాంతి పొందుతున్నారు. కొంత మంది విదేశాలకు వెళ్లి సేద తీరుతుండగా.. మరికొంత మంది దేశీయంగా వేర్వేరు ప్రాంతాలకు వెళ్తున్నారు. నిన్న సీఎం జగన్ లండన్ పర్యటనకు వెళ్లగా.. చంద్రబాబు అమెరికా పర్యటన కొనసాగనుంది. చంద్రబాబు శనివారం అర్ధరాత్రి హైదరాబాద్ నుంచి అమెరికా బయలుదేరి వెళ్లారు.



2లో

కాంగ్రెస్ హామీలను
## నెరవేర్చాలి



6లో

- ఆదాయం కోసం రిజిస్ట్రేషన్‌లో ఛార్జీలు పెంచారు
- బిల్డింగ్ పర్మిషన్‌కి చదరపు అడుగుకి 75 రూపాయలు వసూలు
- అతి తక్కువ కాలంలో ప్రజలచేత వ్యతిరేకత ఎదుర్కొన్న సీఎం రేవంత్ రెడ్డి
- కమీషన్ల దుకాణాలు ఓపెన్
- ఈటల

## మంత్రివర్గ సమావేశానికి
# ఈసీ ఓకే

- అత్యవసర విషయాలు మాత్రమే చర్చించాలని కండీషన్
- జూన్ 4లోపు అమలు చేయాల్సిన అంశాల ఎజెండా మీద మాత్రమే సమావేశం



6లో

## అంతే ఇంతే!




మావోయిస్టుల ఎర్ర జెండా బాష నేర్చుకుంటున్నాడు సార్

## సింగపూర్‌లో కరోనా
# కలకలం



6లో

- మే 5 - 11 మధ్య 25,900 కొత్త కేసులు నమోదు
- అంతకుముందు వారంతో పోలిస్తే గణనీయంగాపెరిగిన కేసుల సంఖ్య
- మరో నాలుగు వారాల్లో కేసుల సంఖ్య గరిష్ట స్థాయికి చేరొచ్చన్న ఆరోగ్య శాఖ మంత్రి

## పంచన్ లామా ఎక్కడ ?

- ఆచూకీని చైనా ప్రకటించాలని అమెరికా మరోసారి డిమాండ్
- తక్షణమే విడుదల చేయాలన్న అమెరికా విదేశాంగశాఖ

అమెరికా-చైనా మధ్య మరోసారి ఉద్రిక్తతలు తలెత్తాయి. టిబెట్ ఆధ్యాత్మిక గురువు కావాల్సిన పంచన్ లామా ఆచూకీని బీజింగ్ ప్రక టించాలని వాషింగ్టన్ డిమాండ్ చేసింది. సురక్షితంగా ఉన్నాడా?లేడా? అన్న విషయాన్ని వెల్లడించాలని కోరింది. హిమాలయాల్లో పంచన్ లామా అదృశ్యమై 29 ఏళ్లు పూర్తన సందర్భంగా జరిగిన కార్యక్రమంలో అమె రికా విదేశాంగశాఖ ప్రతినిధి మాథ్యు మిల్లర్ ఈ వ్యాఖ్యలు చేశారు.



6లో

## గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలుపు మనదే



6లో

- మోడీ దేవుళ్ల పేరుతో ఓట్లు అడగడం దేనికి సంకేతం
- కాంగ్రెస్ ప్రభుత్వానికి ఎన్నికలు వచ్చినప్పుడే రైతు బంధు గుర్తుకొస్తుంది
- అభ్యర్థి గుణగణాలను చూసి ఓటు వేయాలి
- ఆలేరులో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

## స్థానిక సంస్థలకు
# రిజర్వేషన్ల సెగ

- జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు పెంచాలంటున్న బీసీలు
- మొత్తం 50% రిజర్వేషన్లు దాటొద్దని సుప్రీం ఆదేశాలు
- గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పంచాయతీరాజ్ చట్టంలో మార్పులు



6లో

సూర్య
హైదరాబాద్
సోమవారం
20 మే 2024





## సిట్ బృందాన్ని కలిసిన మంత్రి అంబటి రాంబాబు

పల్నాడు, సూర్య బ్యూరో ప్రతినిధి : సిట్ బృందాన్ని మంత్రి అంబటి రాంబాబు కలిశారు. సిట్ బృందానికి కొన్ని విషయాలు నివేదించారు. సత్తెనపల్లి నుంచి తాను మూడుసార్లు ఎన్నికల్లో పోటీ చేశానని, ఎన్నికల్లో ఇప్పుడు జరిగినంత హింస ఎప్పుడు జరగలేదని మంత్రి అంబటి అన్నారు. పోలీసులు టీడీపీ నాయకులతో కుమ్మక్కయ్యారని, దాడులు అదుపు చేయడంలో పోలీసులు పూర్తిగా విఫలమయ్యారని పేర్కొన్నారు. ఎన్నికల రోజు టీడీపీ నాయకులు చేసిన అరాచకాన్ని సిట్ బృందానికి మంత్రి అంబటి రాంబాబు వివరించారు. ఇప్పటికీ తొండపి గ్రామంలో చాలా మంది భయంతో ఊరు వదిలి పెట్టి వెళ్లిపోయారని, వారికి భరోసా కల్పించి ఊరిలోకి తీసుకురావాల్సిన బాధ్యత పోలీసులపై ఉందని అంబటి అన్నారు. తాజాగా పోలీసులు నమోదు చేస్తున్న అక్రమ కేసులపైన కూడా సిట్ బృందానికి మంత్రి వివరించారు. పోలింగ్ రోజు, ఆ తర్వాత చోటు చేసుకున్న హింసాత్మక దాడులు, ఘర్షణలపై పల్నాడు జిల్లాలో సిట్ దర్యాప్తు రెండో రోజు కొనసాగింది. శనివారం అర్ధరాత్రి వరకు నరసరావుపేట రెండో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో విచారణ కొనసాగగా ఆదివారం గ్రామీణ పోలీస్ స్టేషన్‌లో ఏసీబీ అడిషినల్ ఎస్పీ సౌమ్యలత నేతృత్వంలో సిట్ అధికారులు ముమ్మర విచారణ చేశారు. దర్యాప్తులో భాగంగా అల్లర్లు జరిగిన సమయంలో వీడియోలను అధికారులు పరిశీలించారు. ఇదే సమయంలో కారంపూడి పోలీస్‌స్టేషన్‌లోనూ దర్యాప్తు చేశారు. దాడులు, ఘర్షణలకు సంబంధించిన కేసుల రికార్డులను పరిశీలించారు. స్థానిక సీఐ నుంచి సిట్ డీఎస్పీ రామ్మూర్తి వివరాలు సేకరించారు.

# అమెరికాకు వెళ్లిన చంద్రబాబు

• వైద్య పరీక్షల కోసం వెళ్లారంటున్న పార్టీ వర్గాలు • ఐదారు రోజుల పాటు ఆయన పర్యటన ఉండనున్నట్లు సమాచారం • చంద్రబాబు వెంట ఆతని సతీమణి భువనేశ్వరి • ఇప్పటికే కుటుంబంతో కలసి అమెరికాలో ఉన్న లోకేశ్ • ఎన్నికల ఫలితాలు వెలువడే నాటికి తిరిగి రాష్ట్రానికి రాక



అమరావతి... ఎన్నికల హడావుడి, పోలింగ్ కూడా ముగియడంతో రాజకీయ పార్టీల అధినేతలు విశ్రాంతి పొందుతున్నారు. కొంత మంది విదేశాలకు వెళ్లి సేద తీరుతుండగా.. మరికొంత మంది దేశీయంగా వేర్వేరు ప్రాంతాలకు వెళ్తున్నారు. నిన్న సీఎం జగన్ లండన్ పర్యటనకు వెళ్లగా.. చంద్రబాబు అమెరికా పర్యటన కొనసాగనుంది. చంద్రబాబు శనివారం అర్ధరాత్రి హైదరాబాద్ నుంచి అమెరికా బయలుదేరి వెళ్లారు. ఆయనతో పాటు సతీమణి భువనేశ్వరి కూడా చంద్రబాబు వెంట ఉన్నారు.వైద్య పరీక్షల నిమిత్తం ఆయన అమెరికా వెళ్లినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. ఆయన గతంలో కూడా ఒకసారి అమెరికాలో మెడికల్ టెస్టులు చేయించుకున్నారు. ఇప్పుడు మరోసారి వైద్య పరీక్షల కోసం వెళ్లారు. ఐదారు రోజుల్లో ఆయన తిరిగి రానున్నారు. ఆయన కుమారుడు లోకేశ్ కొద్దిరోజుల క్రితం కుటుంబంతో కలసి అమెరికా వెళ్లారు. ఎన్నికల ఫలితాలు వెలువడే నాటికి విడిదిలో ఉన్న వీరంతా తిరిగి రాష్ట్రానికి చేరుకోనున్నారు.



# పలుచోట్ల సిట్ విచారణ

• హింసాత్మక ఘటనల ప్రాంతాలలో పర్యటనలు • పలుచోట్ల కార్డన్ సెర్చ్ - అనేక విషయాలపై ఆరా! • వైకాపా అభ్యర్థి మోహిత్‌రెడ్డి గన్‌మెన్ ఈశ్వర్ విచారించిన అధికారులు • పోలీసు స్టేషన్‌లో నమోదైన కేసులు, ఎఫ్ఐఆర్‌ల పరిశీలన • కీలక అంశాలతో నివేదిక ఈసీకి అందజేయనున్న బృందం

తిరుపతి: ఇటీవల జరిగిన హింసాత్మక ఘటనల నేపథ్యంలో తిరుపతి జిల్లాలో పలుచోట్ల సిట్ బృందం విచారణ చేపట్టింది. జిల్లా కేంద్రంలోని ఎస్వీయూ, పద్మావతి మహిళా యూనివర్సిటీతో పాటు చంద్రగిరి మండలం కూచువారిపల్లె, రామిరెడ్డిపల్లెలో సిట్ అధికారులు పలువురిని విచారించారు. కూచువారిపల్లెలో వైకాపా అభ్యర్థి మోహిత్‌రెడ్డి గన్‌మెన్ ఈశ్వర్, గ్రామస్థులను అధికారులు విచారించి పలు విషయాలపై ఆరా తీశారు. రామిరెడ్డిపల్లె సర్పంచ్ చంద్రశేఖర్‌రెడ్డి ఇంటిని సిట్ అధికారులు పరిశీలించారు. అనంతరం పలువురు గ్రామస్థులను విచారించారు.

తిరుపతి నగరంలోనూ సిట్ బృందం విచారణ కొనసాగింది. ఎన్నికల తర్వాత జరిగిన ఘర్షణపై అధికారులు దర్యాప్తు చేస్తున్నారు. ఎస్వీయూ క్యాంపస్ పోలీసు స్టేషన్‌లో కేసులను పరిశీలించారు. అల్లర్లకు సంబంధించి ఎఫ్ఐఆర్ వివరాలను అధికారులు అడిగి తెలుసుకున్నారు. అనంతరం పద్మావతి మహిళా వర్సిటీలో సిట్ బృందం విచారణ చేపట్టింది. చంద్రగిరి తెదేపా అభ్యర్థి పులివర్తి నానిపై హత్యాయత్నం జరిగిన ప్రాంతాన్ని పరిశీలించింది. క్షేత్ర స్థాయిలో పర్యటించిన బృందం నివేదిక ఈసీకి అందజేయనుంది. పల్నాడు జిల్లా నరసరావుపేట ఒకటో పట్టణ పోలీసు స్టేషన్‌లో సిట్ బృందం దర్యాప్తు చేపట్టింది. ఇందులో భాగంగా ఇటీవల అల్లర్లకు సంబంధించిన వీడియోలను అధికారులు పరిశీలించారు. పోలింగ్ రోజు, తర్వాత హింసాత్మక ఘటనలపై సిట్ బృందం విచారణ జరిపింది. సిట్ అదనపు ఎస్పీ సౌమ్యలత ఆధ్వర్యంలో దర్యాప్తు కొనసాగుతోంది. శనివారం అర్ధరాత్రి వరకు నరసరావుపేట రెండో పట్టణ పోలీసు స్టేషన్‌లో విచారణ చేశారు. ఈసీ ఆదేశాల మేరకు రాష్ట్రంలో ఎన్నికలకు ముందు, తర్వాత జరిగిన హింసాత్మక ఘటనలపై విచారణకు ప్రత్యేక విచారణ బృందం(సిట్) ఏర్పాటు చేస్తూ రాష్ట్ర డీజీపీ హరీష్‌కుమార్ గుప్తా ఉత్తర్వులు జారీ చేశారు. ఐజీ వినీత్ బ్రిజ్‌లాల్ నేతృత్వంలో 13 మంది సభ్యులతో ప్రత్యేక బృందాన్ని నియమించారు. పల్నాడు, అనంతపురం, తిరుపతి జిల్లాల్లో జరిగిన హింసాత్మక ఘటనలపై విచారించి నివేదిక ఇవ్వాలని డీజీపీ ఆదేశించారు. పల్నాడు జిల్లాలోని మాచర్ల, గురజాల నియోజకవర్గాల్లో పోలీసులు కార్డన్ సెర్చ్ చేపట్టారు. పెదకూరపాడు, సత్తెనపల్లి నియోజకవర్గాల్లో కార్డన్ సెర్చ్ చేశారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పలు గ్రామాల్లో పోలీసులు విస్తృత తనిఖీలు నిర్వహించారు.

# మళ్లీ వార్తల్లోకి పద్మావతి యూనివర్సిటీ

### క్యాంపస్ ఆవరణలో మారణాయుధాలు



తిరుపతి... తిరుపతిలోని పద్మావతి యూనివర్సిటీలో మారణాయుధాలు బయటపడటం స్థానికంగా కలకలం రేపుతోంది. యూనివర్సిటీలో ఇటీవల జరిగిన పరిణామాల నేపథ్యంలో.. పోలీసులు తనిఖీలు ఆదివారం నిర్వహించారు. ఈ తనిఖీల్లో యూనివర్సిటీ ప్రాంగణంలో మారణాయుధాలు బయటపడ్డాయి. కాంపౌండ్ వాల్ దగ్గర ఐరన్ రాడ్స్, హాకీ స్టిక్స్, కత్తులను బాంబ్ డిస్పోజల్ టీమ్ గుర్తించింది. డాగ్ స్క్వాడ్‌తో తనిఖీలు చేసిన పోలీసులు.. ఆ మారణాయుధాలను స్వాధీనం చేసుకున్నారు. యూనివర్సిటీ ప్రాంగణంలోకి మారణాయుధాలు ఎక్కడి నుంచి వచ్చాయనే విషయమై ఆరా తీస్తున్నారు.మరోవైపు పద్మావతి యూనివర్సిటీలోని స్ట్రాంగ్ రూమ్‌లో చంద్రగిరి అసెంబ్లీ నియోజకవర్గానికి చెందిన ఈవీఎంలను భద్రపరిచారు. అయితే స్ట్రాంగ్ రూమ్ పరిశీలనకు వచ్చిన చంద్రగిరి టీడీపీ అభ్యర్థి పులివర్తి నానిపై ఇటీవల కొంతమంది దాడి చేశారు. కర్రలు, రాళ్లు, ఐరన్ రాడ్లతో పులివర్తి నాని కారు మీద దాడి చేశారు. ఈ ఘటనలో పులివర్తి నాని భుజానికి గాయంకాగా.. ఆయన గన్‌మెన్ తలకు తీవ్రగాయమైంది.

ఈ ఘటనతో తిరుపతిలో ఉద్రిక్త పరిస్థితులు తలెత్తాయి. పులివర్తి నానికి మద్దతుగా టీడీపీ మహిళా నేతలు నిరసనకు దిగటంతో పద్మావతి యూనివర్సిటీలో ఇటీవల హైటెన్షన్ వాతావరణం నెలకొంది.

ఇక చంద్రగిరితో పాటుగా తాడిపత్రి, పల్నాడు, నర్సరావుపేట ప్రాంతాల్లో కూడా పోలింగ్ అనంతరం ఘర్షణలు చెలరేగాయి.

ఈ ఘటనలపై సీరియస్ అయిన ఎన్నికల సంఘం.. సిట్ ఏర్పాటు చేసి దర్యాప్తు జరిపించాలని ఏపీ సీఎస్‌ను ఆదేశించింది. ప్రత్యేక దర్యాప్తు బృందం ఏర్పాటు ఇప్పటికే పూర్తికాగా.. ఘటనలు జరిగిన ప్రాంతాల్లో సిట్ అధికారులు పర్యటిస్తున్నారు




# నన్ను మానసిక క్షోభకు గురిచేసిన జగన్

• వైసీపీ సర్కారుతో ఉద్యోగ సంఘాలకు చాలా నష్టం • ఉద్యోగుల జీపీఎస్ సొమ్ము రూ. 500 కోట్లు వైసీపీ ప్రభుత్వం దొంగతనం • ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ల సంఘం ఐక్యవేదిక సంఘాల రాష్ట్ర చైర్మన్ కె.ఆర్ సూర్యనారాయణ

పశ్చిమగోదావరి: వైసీపీ ప్రభుత్వం వల్ల ఉద్యోగ సంఘాలు చాలా నష్టపోయాయని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ల సంఘం ఐక్యవేదిక సంఘాల రాష్ట్ర చైర్మన్ కె.ఆర్ సూర్యనారాయణ అన్నారు. ఉద్యోగుల జీపీఎస్ సొమ్మును తమకు తెలియకుండా తమ ఖాతాల నుంచి రూ. 500 కోట్లను వైసీపీ ప్రభుత్వం దొంగతనం చేసిందని ఆరోపించారు. భీమవరంలో ఆదివారం పలు సంఘాల ఐక్యవేదిక సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా కె.ఆర్ సూర్యనారాయణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... . తాను నేరుగా ఆరోపణ చేస్తున్న ఈ ప్రభుత్వం ఇప్పటివరకు ఉద్యోగులకు సమాధానం ఎందుకు చెప్పలేదని ప్రశ్నించారు. గతంలో ఈ ఆర్థికపరమైన చెల్లింపులకు ఒక చట్టాన్ని రూపొందించమని ఏపీ గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ను కలిసి మెమోరాండం ఇచ్చామని తెలిపారు. గవర్నర్‌ను కలిసి మెమోరాండం ఇవ్వడాన్ని నేరంగా భావించిందని చెప్పారు. వ్యక్తిగతంగా తనను, తాను ప్రాతినిధ్యం వహిస్తున్న సంఘాలను చిన్నాభిన్నం చేసి తన కుటుంబాన్ని మానసికక్షోభకు ఈ ప్రభుత్వం గురిచేసిందని విరుచుకుపడ్డారు. ఇది జగన్ ప్రభుత్వ పిరికిపంద చర్య అని చెప్పారు. ప్రభుత్వ స్పాన్సర్ సంఘాలు కూడా కొన్ని ఉన్నాయిని.. ఉద్యోగస్తుల్లో కొన్ని సంఘాలు ఎవరు అధికారంలో ఉంటే వారికి భజన చేస్తున్నాయని విమర్శించారు. ఉద్యోగుల్లో చైతన్య నింపడం కోసమే జిల్లాల వారీగా సమావేశాలు నిర్వహిస్తున్నామని సూర్యనారాయణ పేర్కొన్నారు.

# అండమాన్‌ను తాకిన నైరుతి రుతుపవనాలు

• తెలుగు రాష్ట్రాల్లో భారీ వర్షాలు • 31న కేరళ తీరాన్ని తాకే అవకాశం • కోస్తాంధ్ర, రాయలసీమ ప్రాంతాల్లో రాబోయే 3 రోజులు వర్షాలు • అటు తెలంగాణలోనూ వర్షాలు కురిసే ఛాన్స్



అమరావతి.... నైరుతి రుతుపవనాలపై భారత వాతావరణ శాఖ కీలక అప్‌డేట్ ఇచ్చింది. నైరుతి పవనాలు ఆదివారం మాల్దీవుల్లోని కొంతవరకూ, కోమరిన్ ప్రాంతంలో కొంతమేర, దక్షిణ బంగాళాఖాతం, నికోబార్ దీవులు, దక్షిణ అండమాన్ సముద్రంలోని కొన్ని ప్రాంతాల వరకూ విస్తరించాయని వాతావరణ కేంద్రం అధికారులు వెల్లడించారు. ఈ ఏడాది ప్రీ మాన్ సూన్ సీజన్ లో తొలి అల్పపీడనం ఏర్పడనుందని తెలిపింది. ఈ నెల 22 నాటికి నైరుతి బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని పేర్కొంది. దక్షిణ చత్తీస్ గఢ్, తెలంగాణ, రాయలసీమ మీదుగా సగటున సముద్ర మట్టానికి 3.1 కి.మీల ఎత్తులో కొనసాగిన ద్రోణి ఆవర్తనం ఆదివారం బలహీనపడిందని వెల్లడించింది. ఆంధ్రప్రదేశ్, యానాంలో ఆగ్నేయ/నైరుతి దిశగా గాలులు వీస్తాయని అధికారులు తెలిపారు. సాధారణంగా నైరుతి రుతు పవనాలు దేశంలోకి జూన్ 1న ప్రవేశించి.. కేరళను తాకి ఆ తర్వాత దేశమంతా వ్యాపిస్తాయి. ఐఎండీ తాజా అంచనా ప్రకారం మే 31 నాటికి కేరళలో రుతుపవనాలు ప్రవేశిస్తాయి. జూన్ మొదటి వారంలోనే ఏపీని పలుకరిస్తాయని.. అటు తెలంగాణకు కూడా ముందుగానే రుతుపవనాలు వచ్చే ఛాన్స్ ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు.

**ఏపీలో వర్షాలు**

ద్రోణి ప్రభావంతో తెలుగు రాష్ట్రాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ అధికారులు వెల్లడించారు. ఆదివారం సత్యసాయి, వైఎస్సార్, అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి, శ్రీకాకుళం, అల్లూరి, మన్యం, అనకాపల్లి, కాకినాడ, కోనసీమ, ఏలూరు, కృష్ణా, నంద్యాల, కర్నూలు జిల్లాలో వర్షాలు కురుస్తాయని పేర్కొన్నారు. కొన్ని చోట్ల 30 - 40 కి.మీల ఈదురుగాలల వేగంతో వర్షాలు కురుస్తాయని అధికారులు తెలిపారు. అటు, సోమ, మంగళవారాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు లేదా ఉరుములతో కూడిన జల్లులు కురిసే అవకాశం ఉందని చెప్పారు. ఈ నెల 22 నుంచి 27 వరకూ బలమైన తుపాను ఏర్పడే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని అన్నారు. ఉపరితల ఆవర్తనం ద్రోణి ప్రభావంతో ఈ నెల 22 నాటికి నైరుతి బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడి ఈ నెల 24 నాటికి వాయుగుండంగా మారే అవకాశం ఉందని తెలిపారు.

**తెలంగాణలో రాగల 5 రోజులు**

అటు, తెలంగాణలో రాగల 5 రోజులు వర్షాలు కురిసే ఛాన్స్ ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు తెలిపారు. కొన్నిచోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు.. మరికొన్ని ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో వర్షాలు కురిసే ఛాన్స్ ఉందని పలు జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేశారు. ఆదివారం భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సిద్దిపేట, సూర్యాపేట, సిద్దిపేట, భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్, వికారాబాద్, మెదక్, నాగర్ కర్నూల్ జిల్లాల్లో గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీస్తాయని.. ఉరుములు, మెరుపులతో వర్షాలు కురుస్తాయని వెల్లడించారు. ఈ నెల 20న తేలికపాటి నుంచి మోస్తరు వర్షపాతం నమోదు కావొచ్చని చెప్పారు. 22న భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, వరంగల్, మహబూబాబాద్, రంగారెడ్డి, వికారాబాద్, సంగారెడ్డి, మహబూబ్ నగర్, నాగర్ కర్నూల్ జిల్లా వర్షపాతం నమోదు కావొచ్చని అన్నారు. అలాగే, ఈ నెల 23న ఖమ్మం, సూర్యాపేట, వికారాబాద్, సంగారెడ్డి, మహబూబ్ నగర్, వనపర్తి, నాగర్ కర్నూల్, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో అక్కడక్కడ వర్షాలు పడతాయని పేర్కొన్నారు

## బ్రహ్మోత్సవాల్లో కల్పవృక్ష వాహనంపై ఊరేగిన గోవిందరాజస్వామి



తిరుపతి : తిరుపతి గోవిందరాజస్వామివారి బ్రహ్మోత్సవాల్లో ఆదివారం శ్రీవి, భూదేవి స్మేత గోవిందరాజస్వామివారు కల్పవృక్ష వాహనం పై భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా నిర్వహించిన వాహనసేవ వైభవంగా జరిగింది. వాహనం ముందు గజరాజులు నడుస్తుండగా, భక్తజన బృందాల కోలాటాలు, మంగళవాయిద్యాల నడుమ భక్తులు అడుగడుగునా కర్పూరహారతులు సమర్పించి స్వామివారిని దర్శించుకున్నారు. భక్తుల కోరికలు తీర్చే స్వామివారు ఈ కల్పవృక్షాన్ని అధిరోహించి భక్తులను అనుగ్రహిస్తాడని అర్చకులు తెలిపారు. అనంతరం స్వామివారి ఉత్సవర్లకు స్నపన తిరుమంజనాన్ని నిర్వహించారు. సాయంత్రం 5.30 నుండి 6 గంటల వరకు ఊంజల్‌సేవను నిర్వహించనున్నామని వివరించారు. ఆదివారం రాత్రి 7 నుంచి 9 గంటల వరకు సర్వభూపాల వాహనంపై స్వామివారు భక్తులకు దర్శనమిచ్చారు.తెలిపారు. వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమ్వారం రాత్రి గరుడసేవ కార్యక్రమం జరుగుతుందని టీటీడీ (గ్రా) అధికారులు వివరించారు. వాహ్నపుల్లో తిరుమ్ల పెద్ద జీయర్‌స్వామి, చిన్న జీయర్‌స్వామి, ఆగమ సలహాదారులు సీతారామాచార్యులు, మోహన రంగాచార్యులు, ఆలయ డిప్యూటీ ఈవో శాంతి పాల్గొన్నారు.

## కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్యకు ఘన నివాళులు

విజయవాడ, సూర్య బ్యూరో ప్రతినిధి : పశ్చిమ నియోజకవర్గం లో సిపిఎం పశ్చిమ సిటీ ఆధ్వర్యంలో కామ్రేడ్ పుచ్చలపల్లి సుందర్య 39వ వర్ధంతి కార్యక్రమం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలు డివిజన్లలో సుందరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. మున్సిపల్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో 37వ డివిజన్ కాళేశ్వరరావు మార్కెట్ సెంటర్లో స్వాతంత్ర సమరయోధులు, భారత కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాత కామ్రేడ్ సుందరయ్య 39వ వర్ధంతి సందర్భంగా కార్మికులు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం ఫ్లోర్ లీడర్, 50వ డివిజన్ కార్పొరేటర్ బోయి సత్యబాబు మాట్లాడుతూ ప్రజలందరికీ పని, విద్య, వైద్యం, కష్టానికి తగిన ఫలితం అందించే పాలన వస్తేనే దేశం, రాష్ట్రం, ప్రజల అభివృద్ధి అవుతారని, అందుకు సుందరయ్య చూపిన మార్గమే అనుసరించాలని తెలిపారు. నీతి వంతమైన రాజకీయాల కోసం సుందరయ్య మార్గం, దేశ లౌకిక వ్యవస్థ పరిరక్షణకై, రాష్ట్రాల హక్కుల పరిరక్షణ సుందరయ్య ఆశయ సాధనతో ఘనమైన నివాళులు అర్పించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షులు ఆయ్యాలకొండ, లక్ష్మి, సుబ్బారావు, రవణమ్మ తదితరులు పాల్గొన్నారు. 51వ డివిజన్ అంజనేయవాగు సెంటర్లో మట్టి, లిఫ్ట్, కటింగ్ సిఐటియు ఆధ్వర్యంలో, నెహ్రూ బొమ్మ సెంటర్లో సిపిఎం పశ్చిమ సిటీ కార్యదర్శి వర్గ సభ్యులు కె. సూరిబాబు ఆధ్వర్యంలో సుందరయ్య వర్ధంతి కార్యక్రమం జరిగింది. వాగు సెంటర్లో సిఐటియు నాయకులు ఎ. వెంకటేశ్వరరావు, నెహ్రూ బొమ్మ సెంటర్లో సిపిఎం ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి డి.వి. కృష్ణ పాల్గొని సుందరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం నోటు పుస్తకాలు, మజ్జిగ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో లింగయ్య, గొలుసుల రాజు, వెంకట్రావు, ఏ శ్రీను, జి. వెంకట్రావు, సూరా కనకారావు పాల్గొన్నారు.
50వ డివిజన్ అరుణా కాన్వెంట్ సెంటర్, అలాగే కాదర్ సెంటర్లో సిపిఎం పశ్చిమ సిటీ ఆధ్వర్యంలో జరిగిన సుందరయ్య వర్ధంతి కార్యక్రమంలో 50వ డివిజన్ కార్పొరేటర్ బోయి సత్యబాబు పాల్గొన్నారు. అనంతరం ప్రసంగించారు. ఈ సందర్భంగా మజ్జిగ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు ఎం. కొండా రెడ్డి, గాదె సుబ్బారెడ్డి, రాజు, దుర్గారావు పాల్గొన్నారు.
కేఫ్ సెంటర్లో : శంకర్ కేఫ్ సెంటర్లో పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి కార్యక్రమం సిఐటియు పశ్చిమ సిటీ అధ్యక్షులు జి. వెంకట్రావు అధ్యక్షతన జరిగింది.

## వైకాపా ఆధ్వర్యంలో పోస్టల్ బ్యాలెట్ల తరలింపు



విజయనగరం: పోస్టల్ బ్యాలెట్ వ్యవహారంపై అనుమానాలు కలుగుతున్నాయని, అధికారులు తీరు చూస్తే అర్థమవుతుందని విజయనగరం నియోజకవర్గ కూటమి ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు కలిశెట్టి అప్పలనాయుడు, పూసపాటి అదితి విజయలక్ష్మి గజపతిరాజు ఆరోపించారు. విజయనగరంలో అధికారుల తీరును మీడియాకు వివరించారు. అధికారులు అడ్డంగా దొరికిపోయి పొంతనలేని సమాధానాలు ఇస్తూ గందరగోళానికి గురి చేస్తున్నారని ధ్వజమెత్తారు. ఈనెల 16న ఎమ్మెల్యే కొలగట్ల వీరభద్రస్వామి అల్లుడు ఈశ్వర్ కౌశిక్, ఎంపీపీ మామిడి అప్పల నాయుడు ఆధ్వర్యంలో పోస్టల్ బ్యాలెట్‌లను తరలించడంపై పొంతనలేని సమాధానాలు ఇస్తున్నారని తెలిపారు. పోటీ చేస్తున్న అభ్యర్థులకు కనీస సమాచారం ఇవ్వకుండా, వైకాపా నాయకుల ఆధ్వర్యంలో తరలించడంపై అనుమానాలు పెరుగుతున్నాయన్నారు. జనరల్ ఏజెంట్, అభ్యర్థి కానప్పుడు వారి ఆధ్వర్యంలో బ్యాలెట్‌లను ఎలా తరలిస్తారని మండిపడ్డారు. ఈ ఘటన జరిగిన రెండజుల తర్వాత వైకాపా జనరల్ ఎజెంట్ అని అధికారులు ఉత్తరం పంపించారని తెలిపారు. అధికారుల తీరు చూస్తుంటే వైకాపాకి కొమ్ముకాస్తున్నట్టు ఉందని విమర్శించారు. ఆ రోజే ఈ విషయం మీడియా ముందు ఎందుకు చెప్పలేదని ప్రశ్నించారు. స్థానిక ఎమ్మార్వో, ఎమ్మెల్యేకి ఉన్న వ్యవహారాలు రోజూ మీడియాలో చూస్తున్నామన్నారు. అధికారుల తీరుపై ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేయనున్నట్టు చెప్పారు.

## ఏపీలో కూటమిదే అధికారం

• చంద్రబాబే ఈసారి సీఎం
• వైఎస్సార్‌సీపీ ఏకంగా రూ.5000 కోట్లు ఖర్చు పెట్టింది
• అయినా జగన్ ఓడిపోవటం ఖాయం
• కాంగ్రెస్ నేత చింతా మోహన్ వ్యాఖ్యలు



ఢిల్లీ: ఏపీ ఎన్నికల్లో చంద్రబాబుకు అనుకూల పవనాలు వీచాయని, ఆంధ్రప్రదేశ్‌లో కూటమి అధికారంలోకి రావడం ఖాయం, చంద్రబాబు సీఎం అవుతారని చింతా మోహన్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఆంధ్రప్రదేశ్‌లో ఇటీవల జరిగిన ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ ఏకంగా రూ.4000 కోట్ల నుంచి రూ.5000 కోట్లు ఖర్చు పెట్టిందని కాంగ్రెస్ సీనియర్ నేత, కేంద్ర మాజీ మంత్రి చింతా మోహన్ ఆరోపించారు. ఈ నగదు ఎక్కడ నుంచి వచ్చింది, ఎవరిచ్చారో దర్యాప్తు సంస్థలు చెప్పాలన్నారు. జాతీయ పార్టీ కాంగ్రెస్ పార్టీ దేశవ్యాప్తంగా ఆ మొత్తంలో 5 శాతం కూడా ఖర్చు చేయలేక పోయిందన్నారు. తిరుపతి పార్లమెంట్ నియోజకవర్గంలో ఓ అసెంబ్లీ స్థానానికి అభ్యర్థి రూ.80 కోట్లు ఖర్చు పెట్టారని ఆరోపించారు. రిజర్వ్‌డ్ నియోజకవర్గం గూడురు నుంచి పోటీ చేసిన వైసీపీ అభ్యర్థి రూ.45 కోట్లు ఎన్నికలకు ఖర్చు చేశారని చెప్పారు. ఈ డబ్బును ఓ పోలీస్ అధికారి హోటల్లో పెట్టుకుని డిస్ట్రిబ్యూట్ చేశారని, పోలీస్ వ్యవస్థ ఇలా ఉంటే ప్రజలకు ఏం ప్రయోజనం ఉందని ప్రశ్నించారు. ఏపీ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి తన అధికారం కోసం అద్భుతాలు చేశారని, ఎన్నికల్లో రూ.4 వేల నుంచి రూ.5 వేల కోట్లు ఎలా తీసుకువచ్చి ఖర్చు చేశారో అని చింతా మోహన్ ఆశ్చర్యం వ్యక్తం చేశారు. అధికారంలోకి రావడానికి జగన్, పార్టీ నేతలు అక్రమాలు, అధికార దుర్వినియోగం చేశారని కాంగ్రెస్ సీనియర్ నేత ఆరోపించారు. వారి పేపర్లో ఏపీలో అధికారంలోకి వచ్చేది వైసీపీ అని వార్తలు వచ్చాయన్నారు. కానీ ఏపీలో సీఎం జగన్, ప్రధాని మోదీపై వ్యతిరేకత స్పష్టంగా కనిపించిందన్నారు. ఏపీలో వైసీపీ ఓడిపోవడం ఖాయమని స్పష్టం చేశారు. జగన్ ను పెంచి పోషిస్తున్న ప్రధాని మోదీకి పరాభవం తప్పదన్నారు. బీజేపీకి 150 సీట్లు కూడా రావని జోస్యం చెప్పారు.

## మధ్య మహారాష్ట్ర నుండి దక్షిణ తమిళనాడు వరకు ద్రోణి



అమరావతి నుంచి సూర్య ప్రత్యేక ప్రతినిధి : ఐఎండి సూచనల ప్రకారం దక్షిణ అంతర్గత తమిళనాడు పరిసరాల్లో ఆవర్తనం కొనసాగుతుందని, మధ్య మహారాష్ట్ర నుండి దక్షిణ తమిళనాడు వరకు ద్రోణి విస్తరించి ఉందని విపత్తుల సంస్థ ఎండి రోణంకి కూర్మనాథ్ వెల్లడించారు. బుధవారం నాటికి నైరుతి బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని ఇది ఈశాన్య దిశగా కదులుతూ శుక్రవారం నాటికి వాయుగుండంగా కేంద్రీకృతమై అవకాశం ఉందన్నారు. దీని ప్రభావంతో సోమవారం పార్వతీపురంమన్యం, అల్లూరి సీతారామరాజు, కోనసీమ, తూర్పు గోదావరి, పశ్చిమగోదావరి, ఏలూరు, కృష్ణా, అనంతవరం, శ్రీ సత్యసాయి, వైయస్ఆర్, అన్నమయ్య, చిత్తూరు మరియు తిరుపతి జిల్లాల్లో అక్కడక్కడ పిడుగులతో కూడిన తెలిపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని విపత్తుల సంస్థ ఎండి రోణంకి కూర్మనాథ్ సూచించారు. మరోవైపు రేపు శ్రీకాకుళం 6, విజయనగరం 8, మన్యం 9, అల్లూరి జిల్లా చింతూరు మండలంలో వడగాల్పులు వీచే అవకాశం ఉందన్నారు. ఎల్లుండి శ్రీకాకుళం, పార్వతీపురంమన్యం, అల్లూరి సీతారామరాజు, ఏలూరు, ఎన్టీఆర్, పల్నాడు, అనంతవరం, శ్రీ సత్యసాయి, వైయస్ ఆర్, అన్నమయ్య, చిత్తూరు మరియు తిరుపతి జిల్లాల్లో అక్కడక్కడ పిడుగులతో కూడిన తెలిపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. ఉరుములతో కూడిన వర్షం పడేవుడు ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. పొలాల్లో పనిచేసే రైతులు, వ్యవసాయ కూలీలు, పశు-గొర్రెల కాపరులు చెట్ల క్రింద, బహిరంగ ప్రదేశాల్లో ఉండరాదని సూచించారు. ఆదివారం సాయంత్రం 6 గంటల నాటికి పల్నాడు జిల్లా పెద్దకూరపాడు 55.5మిమీ, ఎన్టీఆర్ జిల్లా వత్సవాయి 40మిమీ, జగ్గయ్యపేట 39.5మిమీ, అల్లూరి జిల్లా అడ్డతీగల 38మిమీ, చింతపల్లి 36మిమీ, తూర్పుగోదావరి జిల్లా అనపర్తి 35.2మిమీ,అనకాపల్లి రావికమతం 35.2మిమీ అల్లూరి జిల్లా రాజవొమ్మంగి 35మిమీ, తూర్పుగోదావరి జిల్లా బిక్కవోలు 31.5మిమీ చొప్పున వర్షపాతం నమోదైందన్నారు.

# రాష్ట్రంలో అల్లర్ల టైంలో లండన్ పర్యటనా?

- హింసాత్మక ఘటనలు, ఘర్షణలు సీఎంకి పట్టదా?
- శాంతి భద్రతలను కాపాడాల్సిన బాధ్యత ముఖ్యమంత్రి కి లేదా?
- పోలింగ్ రోజున 144 సెక్షన్ పెట్టినా ఎక్కడా అమలు కాలేదు
- రోడ్ల మీద రాడ్లు పట్టుకొని దండయాత్రలు దాడులు చేస్తుంటే నియంత్రణ ఎక్కడ?
- జై భారత్ నేషనల్ పార్టీ అధ్యక్షుడు లక్ష్మీ నారాయణ కీలక వ్యాఖ్యలు



విశాఖపట్నం.. ఏపీలో ప్రస్తుతం జరుగుతున్న పరిస్థితుల నడుమ సీఎం జగన్ విదేశీ పర్యటనకు వెళ్లడంపై విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. ముఖ్యమంత్రి రెండు రోజుల క్రితం యూకే పర్యటనకు వెళ్లడంపై జై భారత్ నేషనల్ పార్టీ అధ్యక్షుడు జేడీ లక్ష్మీనారాయణ కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ విషయంపై ఆదివారం (మే 19) లక్ష్మీ నారాయణ విశాఖపట్నంలో మీడియాతో మాట్లాడారు. ఎన్నికల తర్వాత రాష్ట్రంలో వివిధ చోట్ల జరుగుతున్న హింసాత్మక ఘటనలు, ఘర్షణలను తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. ఇలాంటి ఘటనలు జరుగుతుండగా.. ముఖ్యమంత్రి విదేశీ పర్యటనలకు వెళ్లడం ఏంటని లక్ష్మీ నారాయణ నిలదీశారు.
ఇలాంటి ఉద్రిక్తతల సమయంలో ముఖ్యమంత్రి జగన్ రాష్ట్రంలో ఉండాలని.. అన్నారు. శాంతి భద్రతలను కాపాడాల్సిన ముఖ్యమంత్రి విదేశీ పర్యటనకు వెళ్లడం సరికాదని అన్నారు. మంత్రి వర్గంలోని మంత్రులు కూడా ఎక్కడా కనిపించడం లేదని లక్ష్మీ నారాయణ మండిపడ్డారు. ఏపీలో పోలింగ్ ప్రక్రియ ముగిసిన తర్వాత కూడా ఇరు వర్గాలు ఒకరిపై మరొకరు దాడులు చేసుకుంటున్నారని అన్నారు. పగలు, ఫ్యాక్షన్ లు, ప్రతీకారాలతో రాజకీయ పార్టీలు.. పగ తీర్చుకోవడం సిగ్గుతో తలదించుకోవాల్సిన విషయం అని లక్ష్మీ నారాయణ అన్నారు. పోలింగ్ రోజున 144 సెక్షన్ అయితే అమల్లో ఉందని.. కానీ ఎక్కడా అమలు కాలేదని లక్ష్మీ నారాయణ అన్నారు. రోడ్ల మీద రాడ్లు పట్టుకొని దండయాత్రలు చేయడాన్ని ప్రజలు అందరూ టీవీల్లో లైవ్ ద్వారా చూశారని గుర్తు చేశారు. ఆయా పార్టీల నేతలు దాడులను నియంత్రించలేక పోయాయని జేడీ లక్ష్మీనారాయణ విమర్శించారు. దాడులకు పాల్పడిన వారిని పార్టీ నుంచి ఎందుకు సస్పెండ్ చేయలేదని లక్ష్మీ నారాయణ ప్రశ్నించారు.
ఈ ఎన్నికలు డబ్బులే ప్రధానంగా జరిగాయని లక్ష్మీ నారాయణ అన్నారు. డబ్బులను విచ్చలవిడిగా ఖర్చు పెట్టిన రాజకీయ పార్టీలు.. చట్టాన్ని ఎవరూ తమ చేతుల్లోకి తీసుకోవాలని యత్నించాయని విమర్శించారు. వారు అలా చేయకుండా కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. జూన్ 4వ తేదీన ఎన్నికల కౌంటింగ్ ఉన్నందున.. ఆ రోజు కూడా తగిన జాగ్రత్త చర్యలు తీసుకోవాలని సూచించారు. అల్లర్ల ఘటనలపై సిట్ కూడా త్వరగా విచారణ జరిపి ఎలక్షన్ కమిషన్‌కు నివేదిక ఇవ్వాలని... బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని జేడీ లక్ష్మీనారాయణ డిమాండ్ చేశారు.

# ఉద్యోగాల పేరుతో మోసం



- హ్యూమన్ ట్రాఫికింగ్ గుట్టు రట్టు
- నిరుద్యోగులను విదేశాలకు అక్రమంగా తరలిస్తోన్న ముఠా అరెస్ట్
- వివిధ దేశాల్లో 5 వేల మంది యువత వీరి చేతిలో ఉన్నారని నిర్ధారణ
- విశాఖ సీపీ రవిశంకర్ అయ్యన్నార్

విశాఖపట్నం : విదేశాల్లో ఉద్యోగాల ఆశ చూపి మానవ అక్రమ రవాణాకు పాల్పడుతున్న ముగ్గురు నిందితుల ముఠాను విశాఖ పోలీసులు అరెస్ట్ చేశారు. డేటా ఎంట్రీ ఉద్యోగాల పేరుతో ఏపీ , పశ్చిమబెంగాల్ రాష్ట్రాల నుంచి కంబోడియా, మయన్మార్, బ్యాంకాక్ దేశాలకు హ్యూమన్ ట్రాఫికింగ్ చేస్తున్నట్లు గుర్తించారు. ఏపీ నుంచి 150 మందికి పైగా తరలించారని.. దాదాపు 5 వేల మంది యువత వివిధ దేశాల్లో వీరి చేతిలో ఉన్నారని నిర్ధారించినట్లు విశాఖ సీపీ రవిశంకర్ అయ్యన్నార్ తెలిపారు. ఈ కేసులో ముగ్గురిని అరెస్ట్ చేసినట్లు చెప్పారు. నిందితులు ఫెడెక్స్, టాస్క్ గేమ్ పేరిట సైబర్ నేరాలు చేయడంలో అమాయకులను వాడుకుంటున్నారని పేర్కొన్నారు. నిరుద్యోగుల నుంచి రూ.లక్షన్నర వరకూ వసూలు చేసి వీరిని కంబోడియాకు అక్రమ రవాణా చేస్తారని.. అక్కడి ఏజెంట్ కు రూ.80 వేలు ఇస్తారని.. మిగిలినది వీరు తీసుకుంటారని వివరించారు. డేటా ఎంట్రీ ఉద్యోగాలు అని చెప్పి ఆన్ లైన్ స్కాంలు చేయాలని వీరికి ట్రైనింగ్ ఇస్తున్నారని సీపీ తెలిపారు.

**మాట వినకుంటే చిత్రహింసలు**

కంబోడియాకు వెళ్లిన వారు ఒత్తిళ్లకు లొంగి స్కామ్ లు చేసే వారికి 600 డాలర్లు ఇస్తారని.. మాట వినకుంటే వారిని చిత్రహింసలు పెడతారని సీపీ చెప్పారు. ఈ ముఠా ఆగడాలు రెండేళ్లుగా సాగుతున్నాయని.. ఇప్పటికే కేసు గురించి కంబోడియా ఎంబసీ సిబ్బందికి తెలిపినట్లు వెల్లడించారు. శ్రీకాకుళం, విశాఖ, అనకాపల్లి, రాజమండ్రి, అమలాపురం, తుని, పలాస, కలకత్తా నుంచి నిరుద్యోగ యువత వీరి ఉచ్చులో చిక్కుకున్నారని చెప్పారు. ఇక్కడి నుంచి అక్రమంగా తరలించిన యువత అక్కడ తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు.
ఈ కేసుకు సంబంధించి పూర్తి దర్యాప్తునకు కంబోడియాలోని భారత ఎంబసీ సహకారం తీసుకుంటామని వివరించారు. ఈ ముఠా వెనుక ఎవరున్నారో ఆరా తీస్తున్నట్లు చెప్పారు. విదేశాల్లో ఉద్యోగం అనగానే నిరుద్యోగులు ఆలోచించి నిర్ణయం తీసుకోవాలని.. ఏజెంట్ల చేతుల్లో మోసపోకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

# చిరు అంటే ఇప్పటికీ అభిమానమే

- అందుకే మెగా ఫ్యామిలీపై వ్యాఖ్యలు చేయను
- పిఠాపురం వైసీపీ అభ్యర్థి వంగా గీత కీలక వ్యాఖ్యలు



పిఠాపురం: ఏపీ ఎన్నికల్లో అందరి దృష్టిని ఆకర్షించిన నియోజకవర్గం పిఠాపురం అసెంబ్లీ నియోజకవర్గం. ఏపీ ఎన్నికల్లో చాలామంది ప్రముఖులు పోటీచేసినప్పటికీ.. పిఠాపురం సీటు మీద ఉన్నంత ఆసక్తి మరే ఇతర నియోజకవర్గంపైనా లేకపోయింది. మీడియా నుంచి రాజకీయ విశ్లేషకుల వరకూ అందరి చూపూ పిఠాపురంపైనే. జనసేన అధినేత పవన్ కళ్యాణ్ పోటీచేస్తూ ఉండటం ఒకెత్తయితే.. పవన్ కళ్యాణ్‌ను ఓడించేందుకు వైసీపీ వంగా గీతను బరిలోకి నిలపడం మరో ఎత్తు. అందుకే నామినేషన్ వేసిన దగ్గర నుంచి ప్రచారం ముగిసే వరకూ పిఠాపురం పేరు మార్మోగిపోయింది. ఇక ప్రచారంలో చివరి రోజున పిఠాపురంలో వంగా గీత గెలిస్తే డిప్యూటీ సీఎం చేస్తానంటూ వైఎస్ జగన్ హామీ ఇవ్వడం.. పిఠాపురంలో పొలిటికల్ హీట్‌ను మరింత పెంచింది.
అయితే పిఠాపురం ఎన్నికల సందర్భంగా ఇటు జనసేన తరుపున పవన్ కళ్యాణ్, వైసీపీ నుంచి వంగా గీత హోరాహోరీగా తలపడ్డారు. ప్రచారం దగ్గర నుంచి పోల్ మేనేజ్‌మెంట్ వరకూ ఒకరికొకరు ఏమాత్రం తగ్గకుండా చేశారు. దీంతో పిఠాపురంలో రికార్డు స్థాయిలో పోలింగ్ నమోదైంది. అయితే పిఠాపురం ఓటర్లు ఎవరి వైపు మొగ్గు చూపారనేదీ జూన్ నాలుగో తేదీన వెల్లడయ్యే ఫలితాల్లో తేలనుంది. ఇప్పటికే పవన్ కళ్యాణ్‌కు భారీ మెజారిటీ ఖాయమని కూటమి నేతలు ప్రచారం చేస్తుంటే.. వంగా గీతదే విజయమంటూ వైసీపీ కూడా సోషల్ మీడియాలో ప్రచారం షురూ చేసింది.
ఈ పరిణామాల నేపథ్యంలోనే వంగా గీత పవన్ కళ్యాణ్ గురించి కీలక వ్యాఖ్యలు చేశారు. రాజకీయాలకి అతీతంగా తమకు మెగా కుటుంబం అంటే ఎప్పటికీ అభిమానమేనని వంగా గీత చెప్పుకొచ్చారు. పవన్ కళ్యాణ్‌పై వ్యక్తిగత విమర్శలు ఎప్పుడు చేయలేదని., మా నియోజకవర్గంలో ఎవరైనా చేసినా కూడా ఒప్పుకోనని చెప్పుకొచ్చారు. దీనికి సంబంధించి ఆడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. రాజకీయాలకు అతీతంగా అన్నయ్యగారంటే (మెగాస్టార్ చిరంజీవి) మాకు అభిమానం. వాళ్లు ఎవరన్నా మాకు గౌరవం ఎక్కువ. వాళ్లకు కూడా నా గురించి తెలుసు. రాజకీయం వేరు, మిగతావి వేరు. నాకు అన్నయ్యగారంటే చాలా గౌరవం. మెగాస్టార్ ఫ్యామిలీ అందరి మీద కూడా అంతే గౌరవం. నాగబాబు గారైనా, ఎవరైనా సరే. ఎన్నికలప్పుడు కూడా మా నియోజకవర్గంలో వ్యక్తిగత విమర్శలు లేవు. మేము వ్యక్తిగత విమర్శలు చేయం, చేస్తే ఒప్పుకోం అని వంగా గీత చెప్పారు.

# చింతమనేని, అచ్చెన్నాయుడును వెంటనే అరెస్ట్ చేయాలి



వెలగపూడి, సూర్య ప్రధాన ప్రతినిధి : తెలుగుదేశం పార్టీ పోలింగ్ రోజున,ఆ తర్వాత రాష్ట్రంలోని పలు ప్రాంతాలలో హింసకు,దౌర్జన్యాలకు పాల్పడిన దృష్ట్యా కౌంటింగ్ కేంద్రాల వద్ద పకడ్బంధి భద్రతా చర్యలు చేపట్టాలని వైయస్సార్ సిపి ఎంఎల్ఏ మల్లాది విష్ణు, గ్రీవెన్స్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు నారాయణ మూర్తిలు ఎన్నికల కమీషన్ నుకోరారు. కౌంటింగ్ కేంద్రాలలో వీడియో రికార్డింగ్ సిసిటివి కెమెరాలను తప్పనిసరిగా ఏర్పాటుచేయాలని కోరారు. టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు కింజారపు అచ్చెన్నాయుడు టిడిపి వర్కర్స్ తో దాడి చేయించారు. వైయస్సార్సిపి కి చెందిన నిమ్మాడ పంచాయితీ చినవెంకటాపురంకు చెందిన తోటమల్లేష్ పై దాడిచేశారు. మల్లేష్ చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఆ సంఘటన టిడిపి రిగ్గింగ్ ను అడ్డుకున్నందుకు అతనిపై దాడి చేయించారు, కాబట్టి ఎన్నికల నియమనిభందనలను అనుసరించి అచ్చెన్నాయుడు, హరివరప్రసాద్, ఎంపీ అభ్యర్థి రామ్మోహన్ నాయుడుపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. దెందులూరు టిడిపి అభ్యర్థి చింతమనేని ప్రభాకర్ ఎన్నికల సందర్భంగా వైయస్సార్ సిపి కార్యకర్తలపై దాడులకు పాల్పడ్డారు. దళితులకు సంబంధించి దూషణలు చేశారు. ఈ నేపథ్యంలో పెదగిరి మండలం కొప్పుల వారి గూడెంకు చెందిన రాజశేఖర్ ను అరెస్ట్ చేశారు.పోలీసులపై దాడి చేసి అతనిని విడిపించుకుని వెళ్లారు. కాబట్టి అతని పై కఠిన చర్యలు తీసుకోవాలి. పోస్టల్ బ్యాలెట్ కుసంబంధించి రిటర్నింగ్ అధికారులకు అందిన వాటిలో కవర్లపై పేర్లు లేకపోవడం, ఇతరత్రా సంతకాలు లేకపోవడం వంటివి ఉన్నాయి. వాటికి సంబంధించి ఎన్నికల కమీషన్ నియమ నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుని సరైన పద్ధతిలో కౌంటింగ్ చేయాలని కోరుతున్నామన్నారు.

# ఆళ్లగడ్డలో ఆగని ఫ్యాక్షన్

- భూమా వర్సెస్ ఏవీ సుబ్బారెడ్డి
- బాడీగార్డుపై హత్యాయత్నంలో నిందితుడిగా ఏవీ
- ఈ ఘటనపై కనీసం స్పందించని అఖిలప్రియ



ఆళ్లగడ్డ ... ఆళ్లగడ్డలో భూమా వర్సెస్ ఏవీ సుబ్బారెడ్డిల మధ్య కొన్నేళ్లుగా రాజకీయకక్షలు కొనసాగుతున్నాయి. టీడీపీకి చెందిన ఈ రెండు కుటుంబాల మధ్య ఉన్న వార్ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. పట్టు కోసం ఇరువర్గాలు సమయం కోసం ఎదురుచూస్తుంటాయి.
పోలింగ్ తర్వాత ఆళ్లగడ్డలో మరోసారి ఏవీ, భూమాకుటుంబాల మధ్య ఫ్యాక్షన్ కక్షలు భగ్గుమన్నాయి. భూమా అఖిలప్రియ బాడీగార్డ్ నిఖిల్ ని చంపేందుకు ప్రయత్నాలు జరగడం, అతడు త్రుటిలో తప్పించుకోవడంతో మరోసారి ఆళ్లగడ్డ ఉద్రిక్తంగా మారింది. ఈ మర్డర్ ప్లాన్ వెనుక టీడీపీ నేత ఏవీ సుబ్బారెడ్డి హస్తం ఉందని పోలీసుల ప్రాథమిక విచారణలో తేలింది. నంద్యాలజిల్లాలో లోకేష్ యువగళం పాదయాత్రలో ఏవీ సుబ్బారెడ్డిపై దాడి జరిగింది. ఈ దాడి వెనుక మాజీ మంత్రి టీడీపీ నేత భూమా అఖిలప్రియ ఉందన్న వాదన ఉంది. దానికి ప్రతికారం తీర్చుకునేందుకే భూమా అఖిలప్రియ బాడీగార్డ్ నిఖిల్‌ని చంపేందుకు ఏవీ సుబ్బారెడ్డి ప్లాన్ వేశారని పోలీసుల ప్రాథమిక విచారణలో తేలినట్టుగా చెబుతున్నారు. భూమా అఖిల ప్రియ మాత్రం ఈ వ్యవహారంపై పెద్దగా స్పందించడంలేదు. బాడీగార్డ్‌పై జరిగిన హత్యాయత్నం విషయాన్ని చూసీ చూడనట్లు వ్యవహరిస్తోందన్న టాక్ వినిపిస్తోంది. అటు ఏవీ సుబ్బారెడ్డి తరవు నుంచి కూడా ఎవరూ పెద్దగా ఈ విషయంపై స్పందించకపోవడంతో పోలీసులు ఈ కేసుని తమదైన శైలిలో ముగించే పనిలో ఉన్నారని సమాచారం. ఇంకోవైపు ఆళ్లగడ్డలో 144 సెక్షన్ కొనసాగిస్తున్నా ప్రజలు మాత్రం ఏ క్షణాన ఏం జరుగుతుందోనన్న భయంలో ఉన్నారు.

## టీడీపీ నేతలు నోరు అదుపులో పెట్టుకుని మాట్లాడాలి : మంత్రి పెద్దిరెడ్డి



చిత్తూరు, సూర్య బ్యూరో ప్రతినిధి : టీడీపీ నేతలు నోరు అదుపులో పెట్టుకుని మాట్లాడాలని ఏపీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రరెడ్డి అన్నారు. పెద్దిరెడ్డి కంపెనీకి చెందిన వాహనాలను విదేశాలకు పంపించేస్తున్నారని, సీఎం జగన్ విదేశాలకు చెక్కేశాడని టీడీపీ నేతలు చేస్తున్న వ్యాఖ్యల పట్ల ఆయన మండిపడ్డారు. టీడీపీ నేతలు నోరు అదుపులో పెట్టుకుని మాట్లాడాలని, లేకపోతే తాము కూడా వీధుల్లోకి వచ్చి మాట్లాడాల్సి ఉంటుందని హెచ్చరించారు. ఈ సందర్భంగా మంత్రి పెద్దిరెడ్డి టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ పై ధ్వజమెత్తారు. ఈ లోకేశ్ మాట్లాడితే చాలు 'పాపాల పెద్దిరెడ్డి' అంటుంటాడని ఆరోపించారు. మీ నాన్నే పాపాల చంద్రబాబు..ఎంతోమందిని చంపించేశాడు.. వంగవీటి రంగా నుంచి పింగళి దశరథ వరకు అందరూ ఆయన బాధితులే. వారందరూ చనిపోయారని పెద్దిరెడ్డి పేర్కొన్నారు. అలాంటప్పుడు మీ నాన్నను పాపాల చంద్రబాబు అని పిలుచుకోవాలే తప్ప, నన్ను మాట్లాడినందువల్ల నీకు వచ్చేదేం లేదు అని స్పష్టం చేశారు. నేను పాపాల పెద్దిరెడ్డినా, మంచి పెద్దిరెడ్డినా అనేది రాష్ట్రంలో కానీ, జిల్లాలో కానీ అందరికీ తెలుసు. రాజకీయ విలువలను దెబ్బతీసే విధంగా మీరు ఇలా దుర్భాషలాడడం తగదు. రాజకీయాల్లో ఉండే వారందరూ ఇలాగే ఉంటారని ప్రజలు అనుకునేలా మీ ప్రవర్తన ఉంది. మీరు ఇదే విధంగా మాట్లాడితే మేం ఇంతకంటే ఎక్కువగా మాట్లాడగలమ ని పెద్దిరెడ్డి హెచ్చరించారు. రాష్ట్రంలో ఎన్నికలు జరిగాయి. జూన్ 4న ఫలితాలు వెలువడుతున్నాయి. ఈ తరుణంలో టీడీపీ లేనిపోని అబద్ధాలు, కుట్రలు, కుతంత్రాలకు తెరలేపింది. పెద్దిరెడ్డి వాహనాల్లో వేల కోట్ల డబ్బు, వజ్రాలను ఇతర దేశాలకు తరలిస్తున్నారని నారా లోకేశ్ ట్వీట్ చేశాడు. ఇలాంటి ఆరోపణలు చేసేముందు లోకేశ్ వాస్తవాలు గమనించాలా, లేదా? లోకేశ్ ను పప్పు అని ప్రజలందరూ ఎందుకు పిలుస్తారో ఈ ట్వీట్ ను చూస్తేనే అర్థమవుతుంది. ఆ వాహనాలు ఆఫ్రికాలో మా ప్రాజెక్టు వద్దకు పంపిస్తున్నాం. ఆఫ్రికాలోని దారుస్సలామ్ పోర్టుకు వద్దకు వెళుతున్నాయి. వాహనాల్లో మేం ఏవైనా పంపిస్తుంటే ఇక్కడ కస్టమ్స్ చెకింగ్ ఉంటుంది, అక్కడ కూడా కస్టమ్స్ తనిఖీలు ఉంటాయి. అలాంటప్పుడు ఆ వాహనాల్లో డబ్బులు పెట్టేందుకు లోకేశ్ వంటి మూర్ఖులు తప్ప ఎవరూ సాహసించరు.

## శాంతి భద్రతలను పరిరక్షిస్తాం



అనంతపురం, సూర్య బ్యూరో ప్రతినిధి : అనంతపురం జిల్లా నూతన ఎస్పీగా నియమితులైన గౌతమిశాలి ఆదివారం తొలిసారిగా స్పందించారు. జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణకు ముందుకు సాగుతామని మీడియా సమావేశంలో ఆమె చెప్పారు. ఎన్నికల కౌటింగ్ రోజున గొడవలు జరగకుండా చూస్తామని, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పటిష్టమైన చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. ఈ మేరకు క్షేత్రస్థాయిలో తమ బృందాలతో చర్చిస్తామని అన్నారు. ఇప్పటికే జిల్లాలో మూడంచెల భద్రత ఏర్పాటు చేశామని, సమస్యాత్మక ప్రాంతాలలో భద్రతను కట్టదిట్టం చేశామని వివరించారు. జిల్లాలో ఉన్న రౌడీ షీటర్లపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా గౌతమిశాలి హెచ్చరించారు. సమస్యలు సృష్టించేవారు, సమస్యాత్మక గ్రామాలను గుర్తించి ప్రత్యేక నిఘా ఏర్పాటు చేస్తామని అన్నారు. కాగా ఎన్నికల సంఘం శనివారం జారీ చేసిన ఆదేశాల మేరకు అనంతపురం జిల్లా నూతన ఎస్పీగా గౌతమిశాలి నియమితులైన విషయం తెలిసిందే. కర్నూలు అడిషనల్ ఎస్పీగా, అనకాపల్లి ఎస్పీగా ఆమె పని చేశారు. కాగా ఈ నెల 13న అసెంబ్లీ ఎన్నికల తర్వాత తాడిపత్రి పట్టణంలో చెలరేగిన హింసాత్మక ఘటనలకు బాధ్యుడిని చేస్తూ జిల్లా ఎస్పీగా ఉన్న అమిత్ బర్దర్‌ను ఎన్నికల సంఘం సస్పెండ్ చేసిన విషయం తెలిసిందే.

## ప్రొద్దుటూరు వైకాపా ఎమ్మెల్యే రాచమల్లుపై కేసు



ప్రొద్దుటూరు: వైఎస్ఆర్ జిల్లా ప్రొద్దుటూరు వైకాపా ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డిపై పోలీసులు కేసు నమోదు చేశారు. రాచమల్లుతో పాటు ఆయన బావమరిది బంగారు మునిరెడ్డిపై కూడా కేసు నమోదైంది. ఎన్నికల ముందు, తర్వాత జరిగిన హింసాత్మక ఘటనల నేపథ్యంలో కొందరు వైకాపా కార్యకర్తలను స్టేషన్‌కు పిలిచి పోలీసులు కౌన్సిలింగ్ ఇచ్చారు. ఈ క్రమంలో వైకాపా కార్యకర్తను స్టేషన్ నుంచి రాచమల్లు బలవంతంగా తీసుకెళ్లారు. సీఐను బెదిరించి, విధులకు ఆటంకం కలిగించారన్న ఫిర్యాదు మేరకు ఎమ్మెల్యేపై కేసు నమోదు చేశారు.

## రాష్ట్రాన్ని గబ్బు చేసిన పార్టీ వైసీపీ

తిరుపతి: సీఎం, వైఎస్సార్సీపీ అధినేత వైఎస్ జగన్ రెడ్డి మేనమామ, వైసీపీ నేత రవీంద్రనాథ్ రెడ్డి నోరు జారారు. ఆదివారం ఆయన తిరుపతిలోని వేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. ఈ సమయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ... రాష్ట్రాన్ని గబ్బు చేసిన పార్టీ వైసీపీ అని నోరుజారారు. అయితే ఆయన వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. దీంతో ఆయన వ్యాఖ్యలు వైసీపీని, కేడర్‌ను ఇబ్బందుల్లో పడేసేలా ఉన్నాయని ఆ పార్టీ నేతలు చెబుతున్నారు. ఏపీ సార్వత్రిక ఎన్నికల్లో వైసీపీ అధికారంలోకి వచ్చి.. జగన్ మళ్లీ ముఖ్యమంత్రి కావాలని దేవుడిని వేడుకున్నానని తెలిపారు. రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని, వర్షాలు సమృద్ధిగా పడాలని కోరుకున్నానని తెలిపారు. రైతులు, కార్మికులు సుఖ సంతోషాలతో ఉండాలని దేవుడిని కోరుకున్నానని అన్నారు. వైసీపీకి 175 సీట్లు వస్తాయని చెప్పారు. జగన్ పార్టీకి సైలెంట్ ఓటింగ్ ఉందని, జూన్ 4 మధ్యాహ్నం నుంచి ఫలితాలు తెలుస్తాయని తెలిపారు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ అంతగా ప్రభావం చూపించకపోవచ్చని అన్నారు. వైసీపీ అధికారంలోకి తప్పకుండా వస్తుందని, అవినాష్‌రెడ్డి ఎంపీగా గెలుస్తారని ధీమా వ్యక్తం చేశారు. కడప ఎంపీగా ఏపీ కాంగ్రెస్ చీఫ్ షర్మిల, ఇంకెవరూ నిలబడ్డ గెలవలేరని చెప్పారు. రాష్ట్రాన్ని కాంగ్రెస్ పార్టీ అధోగతి పాలు చేసిందని రవీంద్రనాథ్ రెడ్డి మండిపడ్డారు.

## కేంద్ర, రాష్ట్రంలో ప్రభుత్వం మారే అవకాశం : సీపీఐ



గుంటూరు : కేంద్రంలో , రాష్ట్రంలో ప్రభుత్వం మారే అవకాశం ఉందని, మోదీ డబుల్ ఇంజన్ అని రాష్ట్రాల్లో ప్రచారం చేస్తున్నారు.. డబుల్ కాదు కదా సింగిల్ ఇంజన్ కూడా వచ్చే అవకాశం లేదని సిపిఐ జాతీయ కార్యదర్శి కె. నారాయణ కామెంట్స్ చేశారు. ఈ సందర్భంగా గుంటూరులో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఎన్డీఏకు 400 సీట్లు వస్తయంటూ ప్రధాని మోదీ మైండ్ గేమ్ ఆడుతున్నారని.. వాస్తవానికి పరిస్థితులు అందుకు పూర్తి భిన్నంగా ఉన్నాయన్నారు. ఉత్తర భారత దేశంలోనూ ఎన్డీ కి భారీగా సీట్లు తగ్గనున్నాయన్నారు. దక్షిణ భారతదేశంలో ఎన్డీఏకు సీట్లు వచ్చే అవకాశమే లేదన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో చంద్రబాబు పుణ్యమా అని ఒకటి రెండు సీట్లు రావచ్చునని, ఢిల్లీ సీఎం కేజ్రీవాల్‌ను కక్షపూరితంగా కేసులు పెట్టి వేధిస్తున్నారని ఆరోపించారు.
సీపీఐ నేత ముప్పాళ్ళ నాగేశ్వరరావు మాట్లాడుతూ.. పల్నాడు జిల్లాలో ఎన్నికల ముందు.. ఎన్నికల అనంతరం గొడవలు, దాడులు జరగడం ప్రభుత్వ వైఫల్యమేనన్నారు. వైసీపీ అధికారంలోకి రాగానే పిన్నెల్లి, కాసు రాజకీయ కక్షలను బయటకు తీసి దాడులు జరిగేందుకు ఆజ్యం పోశారని ఆరోపించారు. ప్రస్తుతం ఉన్న డీజీపీ ఉత్సవ విగ్రహంలా ఉన్నారని.. సీఎస్‌ను ఎప్పుడో మార్చాల్సిందని అన్నారు. రాబోయే ప్రజా తీర్పులో కమ్యూనిస్టుల పాత్ర గణనీయంగా ఉంటుందని ముప్పాళ్ళ నాగేశ్వరరావు అన్నారు.

## తల్లిదండ్రులు ఆందోళన చెందవద్దు : ఏపీఎన్ఆర్టీఎస్

గుంటూరు, సూర్య ప్రధాన ప్రతినిధి : కిర్గిజ్ స్తాన్ దేశంలో, ఒక ప్రాంతంలో ప్రస్తుతం నెలకొన్న పరిస్థితుల దృష్ట్యా భారతీయ పౌరులు,విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని, అత్యవసరమైతే కిర్గిజ్ స్తాన్ లోని భారత రాయబార కార్యాలయం ఏర్పాటు చేసిన హెల్ప్ లైన్ నంబర్ 0555710041 ను సంప్రదించాలని సూచిస్తూ భారత విదేశాంగ శాఖ 18.05.24 తేదీన మార్గదర్శకాలు జారీ చేసింది. భారత ప్రభుత్వం ఎప్పటికప్పుడు పరిస్థితిని పర్యవేక్షిస్తోందని తెలిపింది. విద్యార్థులు వసతి గృహాల్లోనే ఉండాలని, భారత రాయబార కార్యాలయంతో నిత్యం అందుబాటులో ఉండాలని కేంద్ర ప్రభుత్వం సూచించింది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సంస్థ ఏపీఎన్ఆర్టీఎస్ ఈ విషయాన్ని నిన్ననే అధికారిక వెబ్ సైట్, సామాజిక మాధ్యమాలైన ఫేస్ బుక్, ట్విట్టర్, ఇన్స్టాగ్రామ్ లో పోస్ట్ చేసింది. విదేశీ యాత్రలో ఉన్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఆదేశానుసారం ఏపీఎన్ఆర్టీఎస్ ఎప్పటికప్పుడు కేంద్రప్రభుత్వమ్ గైడ్లైన్స్ అనుసరిస్తూ, పరిస్థితిని తెలుసుకుంటోంది. నిన్న (18.05.24) నలుగురు (04) తెలుగు విద్యార్థులు ఏపీఎన్ఆర్టీఎస్ హెల్ప్ లైన్ ను సంప్రదించారు. అల్లర్లు జరుగుతున్న ప్రదేశాల నుండి భారతీయ/తెలుగు విద్యార్థులందరూ సురక్షిత ప్రదేశాలలో ఉన్నారని తెలిపారు. భారతీయ విద్యార్థులు మెడిసిన్ చదవడానికి ఎక్కువ సంఖ్యలో కిర్గిజ్ స్తాన్ వెళ్తారు. అందులో తెలుగు విద్యార్థులు కూడా ఉన్నారు. ఇప్పటివరకు భారతీయ విద్యార్థులపై ఏటువంటి అవాంఛనీయ సంఘటనలు జరిగినట్టు నివేదిక లేదు. ఆంధ్రప్రదేశ్ కు చెందిన ప్రజలు, విద్యార్థులు ఏపీఎన్ఆర్టీఎస్ 24/7 హెల్ప్ లైన్ నంబర్లు +91 863 2340678, +91 8500027678 (), కిర్గిజ్ స్తాన్ లోని భారత రాయబార కార్యాలయం హెల్ప్ లైన్ నంబరు 0555710041 ను సంప్రదించగలరు.

'సూర్య' సాహిత్య సాంస్కృతిక వేదిక

# అక్షరం

4

సోమవారం 20 మే 2024

editpage@suryaa.com

## మార్కాపురం నుంచి డోన్ దాకా



నేను అక్కడ దాచుకున్న
జ్ఞాపకాల చెంత చేరుతున్నవుడు
ఆ సమయం పేరు
కోకిల ప్రవేశించే కాలం ---
ఇవ్వాల్టికి కూడా
రసోత్తర శ్వాసోచ్ఛ్వాసాలు
తొలినాళ్ళ స్మృతుల్ని
వెలిగిస్తున్నాయి
ప్రాణం నిరంతర ఆవాహన ---
స్టేషన్ పొలిమేరల్లో
కొండలున్నాయి గుహలున్నాయి
రైలు ఆగిన చోటల్లా
వూదోటలో నిలుచున్న భావనొకటి
కిటికి లోంచి దూరంయొక్క తీరం
చేరువౌతోంది ---
పట్టాల అవతల నిర్మించబడ్డ పట్టణం
మీద
సాయంత్రవేళ
రూపు దిద్దుకోబడ్డ పొద్దుపేరు
రేపటి స్వర్ణోదయవు వెలుగు ---
గుండెను చెట్టుకొమ్మజేసి
పచ్చని వదనంతో మిత్రుడి పలుకు
తాకినవుడు
వేగంగా తీరిన దాహపు కాంతి
మృదువు గాలి ---
ఎదలోపల వదలని
సొద గాయాలెన్నున్నా
నిరాశా - నిస్పృహ లకు
చరమగీతం పాడాలి
బింబ ప్రతిబింబాలు
తూర్పు పడమరలు ---
నడిరేయిదాకా
వెన్నంటే సాగిన ముచ్చట్ల ప్రయాణం
ఒడిసి పట్టిన అమృతాంజలి .

**మందాది గోపీనాథ్**
**9885045344**

## తూరువు దిక్కు ఫక్కున నవ్వింది



చచ్చీ చెడీ సమాయత్తమైనాను
సత్తువ కూడదీసుకుని
బతుకు పరుగు లో సత్తా చూపాలని
పొరుగు కన్నా పై ఎత్తున నిలవాలని
తూరువు దిక్కు ఫక్కున నవ్వింది
తొలుత హరివిల్లు గాలమేసింది
వానచినుకుల వల విసిరింది
శీతల పవనాలు.. వూల పరిమళాలు
కలగలిపి మత్తు జల్లింది
ఉరుకులు పరుగులు పక్కనబెట్టి
చెట్టునీడ దుప్పటి చుట్టి
కాలాల్ని కలలుగా మార్చి
ప్రకృతి ముచ్చట్లలో మునిగి
తేలాను
పొద్దల్లా ఒకటే రొద...
బద్దకస్తుడా నిద్దుర లెమ్మని.
ఆనాడు అమ్మానాన్నలు
ఆనక భార్యాబిడ్డలు
ఈనాడు మనవళ్లు..
ఒకటే సణుగుళ్లు
గొంతులే మారాయి.. గొణుగుళ్లు
అవే.

**డా.డి.వి.జి.శంకరరావు,మాజీ ఎంపీ.**
**9440836931**

## సిరి వెన్నెల



నా జీవన కలంతో
నా గుండె స్పందన కాగితంపై
కవన సిరివెన్నెల కిరణాలను
కురిపించాను కుండపోతగా..!

అవి అక్షర శిఖరాగ్నిని దాటి
భవిష్యత్ తరాలకు ఓ స్ఫూర్తి పథమై..
అసమానతల మంటలపై చేసే ఓ
యుద్ధమై..
నవ సమాజాన్ని నిర్మించే జగమంత
కుటుంబవు సంచలనగీతమై..
సినీ సాహిత్యంలో నోబెల్ స్థాయి
తెలుగు వచన కవిత్వమై..
ఎవ్వరూ రాయలేని సాహస శబ్దవు
గెలువు వ్యక్తిత్వవు పాఠమై..
అదిగో తెల్లారిందంటూ అభ్యుదయ
ప్రయాణమై
నేటి సమాజవు హృదయాన్ని
మేల్కొలిపింది..!
శాస్త్రి గారి చిత్రపటానికి
అక్షర కుసుమాలతో
విధాత తలవున ప్రభవించిన
అరుణోదయంతో నివాళులర్పిస్తుంది.

(సిరివెన్నెల సీతారామశాస్త్రి గారి జయంతి మే 20 సందర్భంగా)

**ఫిజిక్స్ అరుణ్ కుమార్**
**9394749536**

## చిరువెన్నెల

తెలుగు సినీసాహిత్యాన్ని
కొత్తపుంతలు తొక్కించి,
పాటగా వేలాది గుండెల్లో జీవించి
జన్మసాఫల్యత పొందిన
వుంభావసరస్వతీ సిరివెన్నెలా!
నీ రాగాల తోరణాలను
కట్టుకోని మనోగుమ్మంలేదు,
నీ పాటలపల్లకిలో
ఊరేగని మనిషి లేడు.
నీ ప్రతిరచనా అమృత
ప్రవాహమే!
నీ దేహం భౌతిక
అదృశ్యతెరలచాటుకు వెళ్లినా,
సినీపాటకు
సాహిత్య గౌరవాన్ని తెచ్చిన
నీ బలమైన క్రియలముద్రలు
సాహితీ తరాలను
నడిపిస్తూనే ఉంటాయి.




సినీ నందనవనంలో
సిరివెన్నెలకురిపించి
నేలకొరిగిన మేరుపర్వతమా!
కవితా చంద్రుడా!
ఏమిచ్చి నీ సాహితీరుణం
తీర్చుకోగలం?
నుడినూలుపోగు తప్ప.

**వేమూరి శ్రీనివాస్**
**9912128967**

# ప్రతీహారవంశం, పాలవంశం

## (బ్రాహ్మణ రాజులు-24, 25)



**వనం జ్వాలా నరసింహారావు**
**8008137012**

**ప్రతీహారవంశం** భారత దేశంలోని రాజపుత్ర స్థానాన్ని పాలించిన రాజవంశాలలో ప్రతీహార వంశం ప్రముఖమైనది. హరిశ్చంద్రుడు అనే బ్రాహ్మణుడు ఈ రాజ్యస్థాపకుడు. ఈ వంశంలో చివరివాడు శీలుకుడు. ఇది తరువాత కాలంలో గొప్ప శక్తి సమన్వితమైన రాజ్యంగా రూపుదిద్దుకున్నది. ప్రతీహార వంశానికి చెందిన రాజులు వివిధ ప్రాంతాలలో ముఖ్యంగా ప్రాగ్దక్షిణ ప్రదేశాలలో చిన్న చిన్న రాజ్యాలను స్థాపించుకుని పాలించారు. కొందరేమో లాట దేశంలోని నందివురి రాజధానిగా దక్షిణ భాగాన్ని ఏలారు. ఘూర్జర రాజ్యాన్ని ప్రతీహార వంశానికి చెందిన ప్రధానమైన శాఖ వారు పాలించినట్లు కూడా ఆధారాలున్నాయి. ప్రధాన శాఖకు చెందిన ప్రతీహార ప్రభువులు జోధ్పూర్ రాజధానిగా పాలన చేశారు. ప్రతీహార వంశీయుడైన నాల్గవ వత్సరాజు జాలార్, అవంతీ రాజ్యాలను పాలించినట్లు ఆధారాలున్నాయి. నాల్గవ వత్సరాజు, అతడి పూర్వీకులు ఉజ్జయినీ నగరాన్ని రాజధానిగా చేసుకొని పాలించారు. ప్రతీహార వంశం క్రీస్తుశకం 8 వ శతాబ్ది ప్రథమార్థంలో ప్రాముఖ్యంలోకి వచ్చింది. నాగభట్టు అనే ప్రతీహార ప్రభువు మ్లేచ్ఛరాజును ఎదిరించి ఓడించాడు. ఇతడే మొదటి నాగభట్టు. ఇతడు భారతావని మీద దండెత్తి వచ్చిన అరబ్బు రాజులను కూడా ఓడించాడు. మొదటి నాగభట్టు ప్రాక్ ప్రతీహార శాఖకు చెందినవాడు. మొదటి నాగభట్టు క్రీస్తుశకం 730 నుండి క్రీస్తుశకం 756 వరకు సుమారు 27 సంవత్సరాలు పాలించినట్లు ఆధారాలున్నాయి. మొదటి నాగభట్టు సైన్యాన్ని సమీకరించుకొని, మాళవము, రాజవుత్రస్థానం, ఘూర్జరము లోని కొన్ని ప్రాంతాలను జయించి శక్తి సమన్వితమైన ప్రతీహార రాజ్యాన్ని ఏర్పాటు చేసుకున్నాడు. నాగభట్టు భారత జాతి గర్వించదగ్గ మహారాజు. విదేశీయుల దాడులను అరికట్టి గొప్ప జాతీయ నాయకుడిగా ప్రసిద్ధికెక్కాడు. మొదటి నాగభట్టు అనంతరం అతడి సోదరుడి కుమారులు కక్కుకియా, దేవరాజు అనేవారు ఒకరి తరువాత ఒకరు రాజ్యపాలన చేశారు. దేవరాజు కుమారుడు వత్సరాజు చారిత్రిక వురుషుడు. గొప్ప బలవంతుడు. శక్తిమంతుడైన రాజు. ఇతడు రణహస్తి వత్సరాజుగా ప్రఖ్యాతుడు. వత్సరాజు తన రాజ్యానికి ఉత్తర దిశలో వున్న భూభాగాన్ని, మధ్య రాజవుత్ర స్థానాన్ని పాలించాడు. భండి తెగవారి నుండి వారి రాజ్యాన్ని వత్సరాజు బలవంతంగా గ్రహించాడు. వత్సరాజు గౌడ ప్రభువును కూడా జయించాడు. వత్సరాజు ఉత్తరాపథంలోని అనేక రాజ్యాలను జయించి మహా సామ్రాజ్యాన్ని నెలకొల్పాడు. వత్సరాజు మరణానంతరం అతడి కుమారుడు రెండవ నాగభట్టు ప్రతీహార రాజ్యాదిపత్యాన్ని వహించాడు. ఇతడు అనేక రాజ్యాలను జయించి తన రాజ్యాన్ని వృద్ధి చేసుకున్నాడు. అనేక గిరి దుర్గాలను కూడా స్వాధీన పర్చుకున్నాడు. రెండవ నాగభట్టు అనేక విజయాలను సాధించినప్పటికీ, చివరకు రాష్ట్రకూటాన్వయుల చేతిలో పరాజితుడయ్యాడు. విశాల సామ్రాజ్య నిర్మాణానికి ప్రయత్నించిన ప్రతీహార రెండవ నాగభట్టు కోరిక కలగా మిగిలిపోయింది. రాష్ట్రకూటులతో రెండవ నాగభట్టు యుద్ధంలో ఓడిపోయినప్పటికీ, అతడు అజ్ఞాతవాసిగా జీవిస్తూ, తిరిగి రాజ్యాన్ని సంపాదించి, ప్రతీహార సామ్రాజ్యంలోని కొన్ని భాగాలను పాలించాడు. ఇతడు క్రీస్తుశకం 833 వరకు పాలించాడు. రెండవ నాగభట్టు అనంతరం, అతడి కుమారుడు రామభదదు సింహాసాన్ని అధిష్టించి కేవలం మూడు సంవత్సరాలు మాత్రమే పాలించాడు. ఇతడు పిరికివాడు. యుద్ధంలో వెనుకంజ వేసేవాడు. పరిపాలనా పటిమ లేనివాడు. విశాల ప్రతీహార రాజ్యంలోని అధిక భూభాగాన్ని ఇతడు యుద్ధాలలో కోల్పోవాల్సి వచ్చింది. ఇతడు ఆదరణ కోల్పోయి కేవలం నామ మాత్రవు ప్రభువుగా కొనసాగాడు. రామభదడి పాలనాకాలం క్రీస్తుశకం 833-835. రామభదడి కుమారుడు భోజుడు బాల్యం నుండే సమస్త విద్యలలో ఆరితేరి తండ్రి మరణానంతరం ప్రతీహార సింహాసనం అధిష్టించాడు. శత్రువుల హస్తగతమై వున్న కన్యాకుబ్జాన్ని భోజరాజు జయించి తన రాజధానిగా చేసుకొన్నాడు. శత్రురాజుల వశమై పోయిన రామభదడి కాలంలో దానం ఇచ్చిన అగ్రహారాలను భోజరాజు వునరుద్ధరించాడు. భోజుడు రాజ్యాధికారం వహించిన తరువాత అనేక రాజ్యాలను జయించి పూర్వ ప్రతీహార రాజ్యాన్ని వునరుద్ధరించాడు. అయితే పాల వంశీయుడైన దేవపాలుడు ప్రతీహార రాజ్యం మీద దండెత్తి భోజుడిని ఓడించాడు. భోజుడు పట్టుదల కలవాడు. ప్రతిభావంతుడు. అపజయాలను లెక్కచేయకుండా సైన్యాన్ని సమకూర్చుకుని, క్రీస్తుశకం 9 వ శతాబ్దాంతంలో దండయాత్రలు నిర్వహించి విజయాలు సాధించాడు. ప్రతీహార భోజుడు కడు సమర్థుడు. యుద్ధ విద్యా విశారదుడు. విశాల సామ్రాజ్యాన్ని తన వారసులకు అప్పచెప్పాడు. క్రీస్తుశకం 855 లో ఇతడు మరణించాడు. భోజుడి తరువాత రాజ్యానికి వచ్చిన ప్రతీహార పాలకులు బలహీనులు, భోగాలాలసులు. వారి పాలనా కాలంలో మాళవము రాష్ట్రకూటుల స్వాధీనమైపోయింది. కానిభోజుడి అనంతరం రాజ్యానికి వచ్చిన మొదటి మహేంద్రపాలుడు మాత్రం పూర్వం ప్రతీహార సామ్రాజ్యంలో వున్న మాళవమును తిరిగి జయించగలిగాడు. యుద్ధాలలో కోల్పోయిన రాజ్య భాగాలు పోగా మిగిలిన విశాల ప్రతీహార సామ్రాజ్యాన్ని మొదటి మహేంద్రపాలుడు అవిచ్ఛిన్నంగా పాలించాడు. తండ్రి ఆర్జించి ఇచ్చిన రాజ్యానికి అదనంగా మహేంద్రపాలుడు అనేక ప్రాంతాలను జయించి సామ్రాజ్యాన్ని విస్తృతపరచాడు. యితడు క్రీస్తుశకం 885 నుండి క్రీస్తుశకం 908 వరకు పాలించాడు. మహేంద్రపాలుడు మరణించిన తరువాత అతడి కుమారుడు రెండవ భోజుడు ప్రతీహార సామ్రాజ్యాధినేత అయ్యాడు. ఇతడు రాజ్యానికి వచ్చిన తరువాత సవతి సోదరుడు మహీపాలుడితో యుద్ధాలు చేయాల్సి వచ్చింది. చివరకు మహీపాలుడు సింహాసనాన్ని ఆక్రమించాడు. అంతఃకలహాల్లో కూరుకుని బలహీనపడివున్న ప్రతీహార రాజ్యభాగాలను రాష్ట్రకూటులు ఆక్రమించుకున్నారు. మహీపాలుడు చాళుక్య నరసింహుడి ధాటికి తట్టుకోలేక పారిపోయి, అలహాబాద్ ప్రాంతంలో తలదాచుకున్నాడు. ఆ తరువాత కాలంలో చెల్లాచెదరైన తన సైన్యాన్ని సమీకరించుకొని, సామంతులను కూడగట్టుకొని, మహీపాలుడు, ప్రతీహార సామ్రాజ్యాన్ని వునరుద్ధరించుకున్నాడు. క్రీస్తుశకం 942 వరకు మహీపాలుడు పాలించాడు. మహీపాలుడి కుమారుడు ఆ తరువాత ఒక ఏడాది మాత్రమే పాలించాడు. ఆ తరువాత నలుగురు రాజులు సుమారు 15 సంవత్సరాలు పాలించారు. ప్రతీహార సామ్రాజ్యం రాష్ట్రకూట, పాల వంశీయుల దండయాత్రల వల్ల క్షీణించ సాగింది. సుమారు ఒక శతాబ్దికాలం మహావైభవంగా అనుభవించిన ప్రతీహార వంశం, ఉత్తర భారత దేశంలో మహా సామ్రాజ్య స్థాపన చేసిన వంశంగా ప్రసిద్ధికెక్కింది. పాలవంశం శశాంకుడి మరణానంతరం వంగ దేశం శతాబ్దికాలం అరాజక స్థితికి లోనైంది. దేశంలో అనిశ్చిత పరిస్థితులు ఏర్పడ్డాయి. ప్రజల ఆర్థిక స్థితి అస్తవ్యస్తంగా తయారైంది. ప్రజలప్పుడు ప్రతిభా సంపన్నుడు, యుద్ధవీరుడు, ధైర్యవంతుడు అయిన గోపాలుని తమ ప్రభువుగా ఎన్నుకున్నారు. అతడికి సమస్త అధికారాలను అప్పచెప్పారు. గోపాలుడి పేరుమీద పాల వంశం ఏర్పడినది. పాలవంశ స్థాపకుడైన గోపాల ప్రభువు తాత దైతవిష్ణువు గొప్ప పండితుడు. రాజానుగ్రహం వున్నవాడు. దైతవిష్ణువు కుమారుడు వస్సత విద్యావంతుడు. క్షాత్ర విద్యలలో నేర్పరి. భుజబల సంపన్నుడు. ఇతడి కుమారుడు పాలవంశ స్థాపకుడైన గోపాలుడు. గోపాలుడు క్షాత్ర ధర్మం అవలంభించి మహావీరుడుగా ప్రశంసింపబడినాడు. గోపాలుడి తాత దైతవిష్ణువు బ్రాహ్మణుడు. వైదికమత నిరతుడు. గోపాలుడి తరువాత రాజ్యానికి వచ్చిన వారు వైదిక ధర్మంతో పాటు క్షాత్ర ధర్మం కూడా అవలంభించారు. తరువాత కాలంలో ఈ వంశీయులు క్షత్రియులుగా పరిగణింపబడ్డారు. మరికొంత కాలానికి ఈ వంశీయులు సూర్య వంశీయులుగాను, సాగర వంశీయులుగాను పరిగణింపబడ్డారు. గోపాలరాజు తరువాత పాల రాజ్య సింహాసనాన్ని అతడి కుమారుడు ధర్మపాలుడు క్రీస్తుశకం 770లో అధిష్టించి సుమారు 40 సంవత్సరాలు పాలించాడు. పాల రాజ్యాన్ని విస్తరించడానికి ధర్మపాలుడు యువకులను చేర్చుకొని గొప్ప సైన్యాన్ని సనకూర్చుకున్నాడు. ధర్మపాలుడు ఉత్తరాపథాన్ని జయించిన తరువాత తన సార్వభౌమత్వాన్ని ప్రకటించుకున్నాడు. ఇతడు ఉత్తర భారతంలో అనేక రాజ్యాలను జయించినప్పటికీ వాటిని పాల సామ్రాజ్యంలో చేర్చుకోలేదు. అనేక రాజ్యాలను జయించిన ధర్మపాలుడు ఆ రాజ్యాదిపతులను తన సామంతులుగా స్వీకరించి, వారిని ఆ రాజ్యాలను పాలించడానికి నియమించాడు. అతడు అంగ, వంగ దేశాలను మాత్రమే ప్రత్యక్షంగా పాలించాడు. అతడు శతాధిక యుద్ధాలను చేసిన మహాశూరుడు. అజేయ పరాక్రముడు. సామాన్యంగా వున్న పాల రాజ్యాన్ని మహా సామ్రాజ్యంగా రూపొందించి వంగ దేశానికి సమున్నత స్థానాన్ని కలిగించాడు. ఇతడు క్రీస్తుశకం 810 లో మరణించాడు. ధర్మపాలుడి అనంతరం అతడి కుమారుడు దేవపాలుడు రాజ్యాధిపతి అయ్యాడు. ఇతడు కూడా శూరుడు. సమర్థుడైన పాలకుడు. తండ్రి సంపాదించి ఇచ్చిన మహా సామ్రాజ్యానికి అదనంగా కొన్ని ప్రాంతాలను జయించి విశాల భూ భాగాన్ని అతి వైభవంగా పాలించాడు. దేవపాలుడు అనేక దండయాత్రలు చేసి విజయాలు సాధించాడు. ప్రతీహార వంశీయుల ఆధిపత్యాన్ని నశింపచేసి, పాలరాజ వంశ ప్రతిష్టను పెంపొందించి, ఉత్తర భారతంలో ప్రముఖ వ్యక్తిగా దేవపాలుడు కీర్తించబడ్డాడు. దేవపాలుడి పాలనా కాలం క్రీస్తుశకం 810-850. దేవపాలుడి అనంతరం విగ్రహపాలుడు పాల రాజ్యాధినేత అయ్యాడు. ఇతడు కేవలం నాలుగు సంవత్సరాలే పాలించాడు. విగ్రహపాలుడు సన్యాసై రాజ్యాన్ని త్యజించిన తరువాత అతడి కుమారుడు నారాయణ పాలుడు పాల రాజ్య సింహాసనాన్ని క్రీస్తుశకం 854 లో అధిష్టించి సుదీర్ఘ కాలం పాలించాడు. కాని ఇతడు రాజ్యంలోని అధిక భాగాలను కోల్పోయాడు. నారాయణ పాలుడు శాంతి కాముకుడు. తత్త్వ జిజ్ఞాసాపరుడు. ఇతడి కాలంలో సామంతులు స్వతంత్రులయ్యారు. ప్రతీహార వంశీయులు పాల రాజ్యంలో అధిక భాగాన్ని ఆక్రమించుకున్నారు. అయితే రాష్ట్రకూటులతో సంబంధ బాంధవ్యాలు ఏర్పడ్డ తరువాత నారాయణ పాలుడు వంగ, అంగ దేశాలలో పాల సామ్రాజ్యాన్ని వునరుద్ధరించాడు. 54 సంవత్సరాలు పాలించిన ఇతడు క్రీస్తుశకం 908 లో మరణించాడు. నారాయణ పాలుడి తరువాత అతడి కుమారుడు రాజ్యపాలుడు సింహాసనం అధిష్టించాడు. ఇతడి కాలం నుండి పాల సామ్రాజ్యం పతనావస్థను చెందింది. ఇతడి తరువాత కొంతకాలం రెండవ గోపాలుడు, రెండవ విగ్రహ పాలుడు పాల రాజ్యాన్ని పాలించారు.

రెండవ విగ్రహ పాలుడు క్రీస్తుశకం 987 లో మరణించిన తరువాత అతడి కుమారుడు మొదటి మహీపాలుడు పాల రాజ్యాదిపత్యాన్ని వహించాడు. ఇతడు పాలనలోకి వచ్చేనాటికి పాల మహాసామ్రాజ్యం అతి సాధారణ రాజ్యంగా వుండేది. క్రీస్తుశకం 1000 కల్లా పాల వంశీయులు వునః తమ సామ్రాజ్యాన్ని నిర్మించుకున్నారు. మహీపాలుడు పాల సామ్రాజ్య వునరుద్ధరణ చేసి మరో 50 సంవత్సరాలు పాల వంశీయులు వంగ, అంగ దేశాలను పాలించేట్లు చేశాడు. మొదటి మహీపాలుడు అసాధారణ ప్రజ్ఞావంతుడు. రాజ్యకాంక్ష కలవాడు. అనేక విజయాలను సాధించాడు. ఇతడు క్రీస్తుశకం 1038 వరకు సుమారు 51 సంవత్సరాలు పాలించాడు. మొదటి మహీపాలుడు మరణించిన తరువాత నాయపాలుడు రాజ్యానికి వచ్చాడు. ఇతడు క్రీస్తుశకం 1055 వరకు 17 సంవత్సరాలు పాలించాడు. ఆ తరువాత నయపాలుడి కుమారుడు మూడవ విగ్రహ పాలుడు రాజ్యాదిపత్యం వహించి 15 సంవత్సరాలు పాలించాడు. ఇతడి అనంతరం అతడి జ్యేష్ట కుమారుడు రెండవ మహీపాలుడు రాజయ్యాడు. శత్రురాజుల దండయాత్రల వల్ల బలహీనపడి సామ్రాజ్య భాగాలను కోల్పోయిన సమయంలో ఇతడు అధికారంలోకి వచ్చాడు. ఇతడి పాలనాకాలం క్రీస్తుశకం 1070-1075. ఇతడి తరువాత శూరపాలుడు రాజై రెండు సంవత్సరాలు పాలించాడు. ఆ తరువాత రామపాలుడు, రాజ్యపాలుడు, కుమారపాలుడు, మూడవ గోపాలుడు రాజులయ్యారు. మూడవ గోపాలుడు క్రీస్తుశకం 1144 వరకు 14 సంవత్సరాలు పాలించాడు. ఆ తరువాత మదనపాలుడు రాజ్యానికి వచ్చాడు. ఇతడే పాల వంశీయులలో చివరివాడు. ఇతడు క్రీస్తుశకం 1161 వరకు 15 సంవత్సరాలు పాలించాడు. అనేక విజయాలను సాధించిన పాల వంశీయుల పాలన సుమారు 400 సంవత్సరాలు సాగింది.

***(స్వర్గీయ బిఎన్ శాస్త్రి గారి బ్రాహ్మణ రాజ్య సర్వస్వం ఆధారంగా)***



## నిశితంగా నిర్భయంగా కలాలను ఝుళిపించిన మల్లయోధ

నీలం సర్వేశ్వర రావు గారి సంపాదకత్వంలో వెలువడిన మల్లయోధ కవితా సంకలనంలో మల్ల యోధురాళ్ళ పై లైంగిక వేధింపుపై రాజ్యం మను ధర్మ పాలన పై కవులు కవయిత్రులు వివిధ కోణాల్లో తమ కలాలను నిశితంగా నిర్భయంగా ఝుళిపించిన తీరును పరిశీలిస్తే ఆయా భావాల్లో పిడికిళ్లు బిగించగలిగే శక్తి గలదని నిర్ద్వంద్వంగా చెప్పవచ్చు. కొన్ని కవితలు చప్పగా వున్ననూ తిరుగుబాటు స్పష్టంగా కనిపించింది

రేపటి స్ఫూర్తి పొద్దులు కవితలో వారు స్త్రీలు ఒంటికి మట్టిపొరల వస్త్రం కప్పుకున్న పాలపిట్టలు అని కుస్తీ లోని ప్రాథమిక సత్యాన్ని వివరిస్తూ క్రీస్తు పూర్వం 2023 దేశభక్తి కొత్త నిర్వచనం జాతి గీతం అయింది అని జనజ్వాల వెటకారాన్ని పలికించారు.

శ్రీనివాస్ గౌడ్ తన తేటతెల్లం కవితలో మల్లగుల్లాలేం లేవు అంతా తేటతెల్లం అంటూ మత రాజ్యవు చీకటి కోణాన్ని ఆవిష్కరిస్తూ విషం దేశ దేహం నిండా ఎక్కక ముందే త్వర పడాలి అంటూ హెచ్చరించారు. ఆటస్థలం పచ్చి గాయాల ప్రదర్శనై నడి వీధి కొచ్చింది అని వడ్డెబోయిన శ్రీనివాస్ చేతుల్లో చెరో తుపాకీ తో హీరాబెన్.. పూలన్ దేవి అంటూ నేటి ప్రజాస్వామ్య అపహాస్యాన్ని తుపాకీ యే జయించగల్గుననే అభిప్రాయాన్ని వ్యక్తం చేసారు.

ఆమె పాదం కవితలో అనిశెట్టి రజిత ఆమె మానవతా శాస్త్రాన్ని కళ్ళు తెరిచి కాచుకోవాలిక ఆ విప్లవాస్త్రాన్ని అని ఆమె రౌద్రన్ని పసిగట్టి ఆమె ఉరుముతున్న ఆకాశం! హిమపాతం! పగులుతున్న నేల! పేలుతున్న పర్వతం! ఆవేశాన్ని ఆలోచన తో రంగరించి కొత్త సృష్టి కోసం అడుగులేయవలెనని హిత బోధ చేసారు. లైంగిక వేధింపుల పై ఎటువంటి చర్యలు తీసుకోలేని నవుంసక రాజ్యాన్ని ఎండగడుతూ శిఖా ఆకాష్ వ్రాసిన కవితలో ఆద్యంతం బాగా సాగి వాళ్ళను నవుంసకులు గా కందాం రండి అనే ముగింపు పేలవంగా ఉంది. వాస్తవ దూరం అనిపించింది.



నసీమా బేగం తన కవితలో కనిపించే అవయవాలను రాక్షస కళ్ళతో స్కానింగ్ చేసే సంస్కార హీనుడా! పరువు ప్రతిష్ట అంటూ ఓ మూలన నక్కి ఏడుస్తారని భ్రమ పడకు! అని ఫత్వా జారీ చేసారు. శారద ఆవాల బతుకు బరి లో కవిత లో దేశం పటం పై చేవ్రాలు కావలసిన పరిమళాలు మరణించక ముందే జాగృత చేతనులై వెలుగునదులను స్వేచ్ఛగా ప్రవహించ నివ్వండి అని విభిన్న శైలి లో చెప్పారు.

యుగాంతం కవితలో వైష్ణవి శ్రీ ఆమె దేహం ఒట్టి దేహమేనా! అది జాతీయ పతాకం కాదూ?! అని ప్రశ్నించిన తీరు కి తప్పక సెల్యూట్ చేయాల్సిందే!! మీ యుగాంతానికి ప్రారంభోత్సవ గీతాన్ని ఆలపిస్తున్నాం అంటూ సమర భేరి మోగించారు.

రూప రుక్మిణి ప్రపంచ పటం ముందు బిక్కు బిక్కు మంటూ వెర్రి చూపులు చూస్తుంటే ఆ ప్రపంచమే ఉలిక్కి పడేలా ఈ దేశవు జెండా ను ఎత్తి పట్టుకుంది ఈ జ్యోతులే అని మల్ల యోధుల ప్రతిభను చాటారు. నేలవూరి రత్నాజి తన కవితలో సుతారవు దేహాల కన్నీళ్ళు బొట్టు బొట్లుగా ఈ నేలమ్మను తడువుతుంటే పిచ్చి గా నవ్వుకుంటుంది ఆమని అంటూ బాధను వ్యక్తీకరిస్తూ నువ్వు విటుడి కన్నా పరాయి దేశవు శత్రువు కన్నా ప్రమాదకారి హంతకి వని టార్గెట్ చేసిన తీరు ప్రశంసనీయం.

విశ్వ తన కవితలో కీర్తి పతాకాలను క్రీడా మైదానంలో రెపరెప లాడించిన ఆ ప్రతిభ చీకటి గదిలో కామ క్రీడలాడమని తెగించి నిరసన గళ మెత్తింది మీ వెంట నేనంటూ భరోసా ఇచ్చారు.

నీలం సర్వేశ్వర రావు సంపాదకుడు గా మలియత్నం ఈ సంకలనం. మల్ల యోధురాళ్ళ న్యాయం కోసం సంఘీభావంగా ఈ సంకలనం లో కొత్త పాత కలాల మేళవింపు ప్రశంసనీయం. ఇంకొన్ని మెళకువలు నేర్చుకోవాలని సలహా. అచ్చు తప్పుల వలన అర్థం మారే అవకాశం వుంటుంది. నీలం తన స్వీయ కవిత లో నిజాం రజాకార్ కి ఎదురు తిరిగిన రొమ్ముకట్టు నంగేలమ్మ అని వ్రాసారు. చారిత్రకంగా నంగేలమ్మ ఘటన ట్రావెన్ కోర్ సంస్థానంలో జరిగిన సంఘటన . ఇలాంటి తప్పులు లేకుండా సరి చూసుకో గల్గితే మంచి సంపాదకుడు గా ఎదగ వచ్చు. ప్రతులకు నీలం సర్వేశ్వర రావు అంబేడ్కర్ డెన్సిటీ కంచిక చర్ల కృష్ణా జిల్లా 6304 664 725 సంప్రదించండి.

**– గిరిప్రసాద్ చెలమల్లు**
**9493388201**

## 19న రవూఫ్ కవితా సంపుటి 'జాబిల్లి వుష్పం' ఆవిష్కరణ సభ

ఆంధ్రప్రదేశ్ రచయితల సంఘం ఆధ్వర్యంలో మే 19 సాయంత్రం గుంటూరు బృందావన్ గార్డెన్స్ లోగల గుంటూరుజిల్లా సీనియర్ సిటిజన్స్ సర్వీస్ ఆర్గనైజేషన్ కార్యాలయంలో డా. రవూఫ్ కవితా సంపుటి 'జాబిల్లి వుష్పం' ఆవిష్కరణ సభజరుగనున్నది. ఆంధ్ర ప్రదేశ్ రచయితల సంఘం అధ్యక్షులు డా. సి.భవానీదేవి అధ్యక్షతన జరిగే ఈ సభలో కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత డా. పాపినేని శివశంకర్ వుస్తకా విష్కరణ చేస్తారు. ప్రముఖ కవి ప్రసాదమూర్తి వుస్తక సమీక్ష చేయ నుండగా, అభ్యుదయ రచయితల సంఘం జాతీయ అధ్యక్షులు పెను గొండ లక్ష్మీనారాయణ, కాట్రగడ్డ దయా నంద్ పాల్గొంటారు. ఈ కార్య క్రమానికి సాహితీ ప్రియులం దరూ పాల్గొనవలసిందిగా ఆంధ్రప్రదేశ్ రచయితల సంఘం కోరుతున్నది.

### రచయిత,విమర్శకులు డాక్టర్ చిటికెన కిరణ్ కుమార్‌కు

## జపాన్ విశ్వవిద్యాలయ ఆహ్వానం



శాంతి, నిరాయుధీకరణ మరియు పర్యావరణ పరిరక్షణ అంశంగా క్యుషు విశ్వవిద్యాలయం జపాన్ వారు నిర్వహించిన అంతర్జాతీయ సదస్సుకు తెలంగాణ రాష్ట్రం సిరిసిల్ల జిల్లా కేంద్రానికి చెందిన పలు జాతీయ, అంతర్జాతీయ అవార్డుల గ్రహీత ప్రముఖ రచయిత, విమర్శకులు ఇంటర్నేషనల్ బెనెవోలెంట్ రీసెర్చ్ ఫోరం సభ్యులు డాక్టర్ చిటికెన కిరణ్ కుమార్ కు ఆహ్వానం విశ్వవిద్యాలయ ప్రొఫెసర్ డాక్టర్ మాసాహిగో నుండి అందుకున్నారు. ఆదివారం భారతీయ కాలమానం మధ్యాహ్నం నుండి అంతర్జాలంలో ప్రపంచవ్యాప్తంగా వీడియో విజువల్ గా కొనసాగిన ఇట్టి కార్యక్రమంలో డా.చిటికెన కిరణ్ కుమార్ హాజరు అయ్యారు. 1945 సంవత్సరంలో నాగసాకి అణుబాంబు దాడిలో కోల్పోయిన ప్రాణ నష్టాన్ని, హృదయ విధారకమైనటువంటి సంఘటనలు చూవుతూ వెబినార్ కొనసాగింది. చిటికెన కార్యక్రమంలో పాల్గొన్నందుకు నిర్వాహకులు ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. గతంలో దక్షిణ కొరియా సియోల్ కు చెందిన హెవెన్లీ కల్చర్ అండ్ వరల్డ్ పీస్ రిస్టోరేషన్ ఆఫ్ లైట్ సంస్థ వారు నిర్వహించిన ప్రపంచశాంతి శిఖరాగ్ర సదస్సు లలో రెండు సార్లు చిటికెన పాల్గొన్నారు. వివిధ దేశాల నుండి విద్యావేత్తలు, సంస్థ ప్రతినిధులు, ప్రముఖులు హాజరయ్యారు.

## చరిత్ర మరచిన చెరగని సంతకం సోయం గంగులు

**ఐనాల భరత్,**
**9640266152**

ఖమ్మం ప్రాంతానికి చెందిన కోయ జాతి గెరిల్లా పోరాట వీరుడు సోయం గంగులు. ఆయన జీవితం అడుగడుగునా స్ఫూర్తివంతం పోరాట కెరటంగా వ్యక్తిత్వ వికాసానికి నిలువెత్తు నిదర్శనంగా నిలుస్తుంది. ఇటువంటి ఈ మహనీయుని గురించి పరిశోధనాత్మక చారిత్రక నవలగా సోయం గంగులు చారిత్రక నవల ఖమ్మం ప్రాంత కోయ కమ్యూనిస్టు జీవితం అనే పేరుతో రచన, పరిశోధకులుగా డా.కె. ముత్యం, ఆర్. శివలింగం గార్లు అనేక వ్యయ ప్రయాసలకు ఓర్చి చరిత్ర సైతం మరచిన ఒక అవూర్వమైన వ్యక్తిని పరిచయం చేశారు. ఈ మహోన్నత రచనను సగర్వంగా రాయల సుభాష్ చంద్రబోస్ మెమోరియల్ ట్రస్ట్ ఖమ్మం వారు ప్రచురించినారు. ఈ చారిత్రక నవల ఇటీవలి కాలంలోనే వెలువడింది. ఎటువంటి కల్పనలకు అవాస్తవలకు తావు లేకుండా కోయప్రాంతం తిరిగి ఆయన గురించిన సమాచారం సేకరించి, ఆయన గురించి ఎరుక కల్గిన వారిని ఇంటర్వ్యూ చేసి పరిశోధనాత్మకంగా వెలువరించిన, రచయితలు, పరిశోధకులు, డా. కె. ముత్యం సార్, ఆర్, శివలింగం సార్ ఇద్దరికి ఎన్ని సార్లు అభినందనలు చెప్పిన వారి కృషికి తక్కువే అవుతుంది. వారే చెప్పినట్లు సోయం గంగులు అమరుడై 70 సంవత్సరాలకు పై బడుతున్నా ఆయన మార్గంపై త్యాగంపై




ఇంతవరకు ఒక్క వుస్తకం రాలేదు.(ఆదివాసి ఉపాధ్యాయ సంఘం, ఖమ్మం వాళ్ళు వేసిన చిన్న వుస్తకం తప్పితే) వుస్తకం వేయడం ఆనాడు తెలంగాణ పోరాటాన్ని నడిపిన శక్తుల బాధ్యత. ఆయన మార్గంలోనివాళ్ళు అప్పటివాళ్ళ త్యాగాల్ని విడిచి,మరచి వుస్తకం వేయలేదన్న ఆరోపణ మాది. ఆ మార్గమే మాది కూడా అని చెప్పుకుటున్న వాళ్ళు కూడా ఈ పనే చేశారు. కానీ రచయితలు 70 ఏళ్ల తరువాత కూడా వాళ్ళకు దొరికిన సమాచారంతో పాటు నిరంతరం లోతైన పరిశోధన చేసిన శివలింగం గారు లేకుంటే ఈ వుస్తకమే లేదు,అని వినమ్రంగా ఆయన కృషిని కొనియాడారు రచయిత ముత్యంగారు, మొత్తంగా వీరి ఇద్దరి కృషివలన ఓ చరిత్ర మరచిన విరుడ్ని కొత్తగా మన ముందు నిలిపినట్లు అయ్యింది. రాశిలో చిన్న వుస్తకం అయిన రచన విధానంలో సత్యనిరూపణ చేసిన విషయంలో ఎన్నో కొత్త చరిత్రలకు మార్గదర్శనం గావించిన వుస్తకంగా చదివే క్రమంలో అర్థంఅవుతుంది. చారిత్రక నవల విశేషాలు: గంగులు వుట్టిన సంగతులు, బాల్యం వివాహం వంటి విశేషాలను చాలా సూక్ష్మగా వివరించడం మనం నవలలో గమనించవచ్చు.

**(మిగతా మళ్లీ వారంలో)**

# రాకెట్ లా దూసుకెళ్తున్న గోల్డ్ రేటు

చైనాలో ఉద్దీపన చర్యలు, యూఎస్లో ద్రవ్యోల్బణం కూల్గా మారడంతో అంతర్జాతీయ మార్కెట్లో పసిడి రేటు రాకెట్లా దూసుకెళ్తోంది. ప్రస్తుతం, ఔన్స్ (28.35 గ్రాములు) బంగారం ధర 2,420 డాలర్ల వద్ద ఉంది. మన దేశంలో, ఈ రోజు 10 గ్రాముల ఆర్నమెంట్ బంగారం (22 కేరెట్లు) ధర 800 రూపాయలు, స్వచ్ఛమైన పసిడి (24 కేరెట్లు) ధర 870 రూపాయలు, 18 కేరెట్ల గోల్డ్ రేటు 650 రూపాయల చొప్పున పెరిగాయి. వెండి రేటు స్థిరంగా ఉంది. తెలంగాణలో బంగారం, వెండి ధరలు హైదరాబాద్ మార్కెట్లో 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారం ధర ? 74,620 వద్దకుబీ 22 క్యారెట్ల బంగారం ధర ? 68,400 వద్దకుబీ 18 క్యారెట్ల బంగారం ధర ? 55,960 వద్దకు చేరింది. కిలో వెండి ధర హైదరాబాద్ మార్కెట్లో ? 92,500 గా ఉంది. ఏపీ, తెలంగాణవ్యాప్తంగా ఇదే ధర అమల్లో ఉంది.

ఆంధ్రప్రదేశ్లో బంగారం, వెండి ధరలు విజయవాడలో 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారం ధర ? 74,620 వద్దకుబీ 22 క్యారెట్ల ఆర్నమెంటు బంగారం ధర ? 68,400 వద్దకుబీ 18 క్యారెట్ల బంగారం ధర ? 55,960 వద్దకు చేరింది. ఇక్కడ కిలో వెండి ధర ? 92,500 గా ఉంది. విశాఖపట్నం మార్కెట్లో బంగారం, వెండికి విజయవాడ రేటే అమలవుతోంది.



### ఇండియా స్కిల్స్ 2024 ఆధిపత్య ట్రేడ్లలో

## 170 మంది మహిళలు



న్యూఢిల్లీ : ద్వారకలోని యశోభూమిలో 2024 మే 15 నుండి 19వ తేదీ వరకు జరుగుతున్న ఇండియా స్కిల్స్ కాంపిటీషన్ 2024, ఇంతకుముందు పురుషుల ఆధిపత్యంలో ఉన్న ట్రేడ్లలో మహిళల భాగస్వామ్యం పెరిగింది. పాల్గొనే స్త్రీలు తమ మగవారితో తలపోటుగా పోటీ పడుతున్నారు, చాలా ఉత్సాహం మరియు ఉత్సాహాన్ని ప్రదర్శిస్తారు మరియు నైపుణ్యం మరియు ప్రతిభకు లింగ సరిహద్దులు లేవని నిరూపిస్తున్నారు. మహిళలకు సాధికారత కల్పించి వారికి ఉపాధి అవకాశాలు కల్పించాలనే కేంద్రం దృష్టికి ఇది అనుగుణంగా ఉంది. ఈ సంవత్సరం,ఇండియా స్కిల్ 61 నైపుణ్యాలు మరియు 400ం పరిశ్రమ నిపుణులలో 30ం రాష్ట్రాలు మరియు కేంద్ర పాలిత ప్రాంతాల నుండి 900ం మంది అభ్యర్థుల భాగస్వామ్యాన్ని చూస్తోంది. లాజిస్టిక్స్ ఫ్రైట్ ఫార్వార్డింగ్, వెబ్ టెక్నాలజీస్, విజువల్ మర్చండైజింగ్, ఫ్యాషన్ టెక్నాలజీ, గ్రాఫిక్ డిజైన్ టెక్నాలజీ, పెయింటింగ్ మరియు డెకరేటింగ్, ఎలక్ట్రికల్ ఇన్స్టాలేషన్లు, ఇండస్ట్రియల్ డిజైన్ టెక్నాలజీ మరియు రెన్యూవబుల్ ఎనర్జీ వంటి ట్రేడ్లలో 170 కంటే ఎక్కువ మంది మహిళలు పాల్గొంటున్నారు. పోటీ సమాన అవకాశాలను అందించడానికి ఒక వేదికను కూడా అందిస్తోంది. మునుపటి సంవత్సరాల్లో, ప్లంబింగ్ హీటింగ్ నైపుణ్యం మహిళా అభ్యర్థి భాగస్వామ్యానికి సాక్ష్యమిచ్చింది. ల్యాండ్స్కేప్ గార్డెనింగ్ నైపుణ్యంలో రెండు మహిళా బృందాలు ఉన్నాయి. విజువల్ మర్చండైజింగ్ కూడా స్త్రీల ఆధిపత్యం. మొబైల్ రోబోటిక్స్ కూడా ఇద్దరు అమ్మాయిల బృందాన్ని చూసింది. "ఇండియాస్కిల్స్ 2024లో మహిళల భాగస్వామ్యంలో గణనీయమైన పెరుగుదల కనిపించింది, వారి అపారమైన ప్రతిభ మరియు స్థితిస్థాపకతను ప్రదర్శిస్తుంది. ఈ పెరుగుతున్న ప్రాతినిధ్యం వారి నైపుణ్యాలకు నిదర్శనం మాత్రమే కాదు, మన దేశానికి మరింత సమగ్రమైన మరియు సమానమైన భవిష్యత్తు కోసం ఒక ముఖ్యమైన అడుగు కూడా" అని ఇండియాస్కిల్స్ 2022 విజేత మరియు ఇండియాస్కిల్స్ 2024 జ్యూరీ సభ్యుడు సోనూ లాథర్ అన్నారు. ఒడిశా నుండి ఇండియాస్కిల్ 2024లో పాల్గొనే కీర్తిపర్ణ సదాంగి మాట్లాడుతూ, మునుపటి సంవత్సరం పోటీదారు రింకీ మహతో నుండి తాను ప్రేరణ పొందానని చెప్పారు. "నాకు ఫ్రాన్స్కు వెళ్లే అవకాశం లభిస్తే, ప్రపంచ వేదికపై మన త్రివర్ణ పతాకాన్ని గర్వంగా చిత్రించాలని నేను నిశ్చయించుకున్నాను" అని ఆమె తెలిపారు.

ఇండియాస్కిల్స్ 2024 యొక్క ఈ ఎడిషన్లో అటానమస్ మొబైల్ రోబోటిక్స్, ఆటోమొబైల్ రిపేరింగ్, క్లౌడ్ కంప్యూటింగ్ మరియు మెకాట్రానిక్స్ వంటి కొత్త-యుగ నైపుణ్యాలు కూడా చాలా ప్రజాదరణ పొందుతున్నాయి. అభ్యర్థులు ఈ అభివృద్ధి చెందుతున్న ట్రేడ్లలో చాలా ఉత్సాహంతో మరియు సంకల్పంతో పాల్గొంటున్నారు. నూతన ఆవిష్కరణలు, ఉత్పాదకతను పెంపొందించడం మరియు ఉద్యోగ అవకాశాలను విస్తరించడం ద్వారా దేశ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడానికి కొత్త-యుగం నైపుణ్యాలు కీలకంగా మారుతున్నాయి. ఈ నైపుణ్యాలు శక్తివంతమైన ప్రారంభ పర్యావరణ వ్యవస్థను పెంపొందించడం, కొత్త పాత్రలను సృష్టించడం మరియు విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను ఆకర్షించడం, ఇవన్నీ ఆర్థిక వృద్ధికి దోహదం చేస్తాయి. అదనంగా, డిజిటల్ మరియు సాంకేతిక నైపుణ్యాలలో నైపుణ్యం దేశం యొక్క ఎగుమతి సామర్థ్యాలను పెంచుతుంది, గ్రీన్ టెక్నాలజీల ద్వారా స్థిరమైన అభివృద్ధికి మద్దతు ఇస్తుంది మరియు స్మార్ట్ మౌలిక సదుపాయాల ద్వారా మొత్తం జీవన ప్రమాణాలను మెరుగుపరుస్తుంది."ఇండియాస్కిల్స్ 2024 మన భవిష్యత్తును రూపొందించడంలో కొత్త-యుగం నైపుణ్యాల యొక్క కీలక పాత్రను హైలైట్ చేస్తుంది, పాల్గొనేవారు అత్యాధునిక సాంకేతికతలలో నైపుణ్యాన్ని ప్రదర్శిస్తారు. ఈ నైపుణ్యాలు ఆవిష్కరణలను నడిపించడం, ఉత్పాదకతను పెంపొందించడం మరియు డిజిటల్ ఆర్థిక వ్యవస్థలో భారతదేశాన్ని గ్లోబల్ లీడర్గా నిలబెట్టేలా చేస్తాయి" అని అటానమస్ మొబైల్ రోబోటిక్స్ జ్యూరీ మహారాష్ట్రకు చెందిన అక్షత్ మరాఠీ అన్నారు.

ఇండియాస్కిల్స్ 2024 విజేతలు, అత్యుత్తమ పరిశ్రమ శిక్షకుల సహాయంతో, సెప్టెంబర్ 2024లో ఫ్రాన్స్లోని లియోన్లో జరగనున్న వరల్డ్స్కిల్స్ పోటీకి సిద్ధమవుతారు మరియు 70 దేశాల నుండి 1,500 మంది పోటీదారులను ఒకచోట చేర్చుకుంటారు. ఈ సంవత్సరం, వరల్డ్ స్కిల్స్లో ఆటోమొబైల్, హాస్పిటాలిటీ, మెకాట్రానిక్స్ మరియు వాటర్ టెక్నాలజీలో భారతదేశం పతకాలు సాధిస్తుందని ప్రారంభ పోకడలు మరింత అంచనా వేస్తున్నాయి.

### మోదీ మరోసారి ప్రధాని అయితే

## స్టాక్ మార్కెట్ పరిస్థితి ఏంటి?



దేశవ్యాప్తంగా ఈ సారి చర్చ మోదీ మరోసారి ప్రధానిగా తిరిగి వస్తారా లేదా అనే దానిపైనే కొనసాగుతోంది. దీనిపై జోరుగా బెట్టింగులు సైతం కొనసాగుతున్నాయి. వాస్తవానికి ఇటీవల బీజేపీ ఎన్డీయే కూటమికి 300 కంటే తక్కువ వస్తాయనే అంచనాల మధ్య స్టాక్ మార్కెట్లలో పతనం నమోదైంది. దీనిపై ఏకంగా కేంద్ర హోం మంత్రి అమిత్ షా, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఇటీవల ఇన్వెస్టర్లలో ధైర్యం నింపే మాటలు చెప్పారు. ప్రస్తుతం నిపుణుల అంచనాల ప్రకారం ఎన్నికల ఫలితాలు వచ్చేంత వరకు దేశీయ ఈక్విటీ మార్కెట్లు ప్రస్తుత స్థాయిల వద్దే కొనసాగుతాయని ఈల్డ్ మ్యాక్సిమైజర్ యోగేష్ మెహతా అంచనా అంచనా వేశారు. ఈ క్రమంలో ఎన్ఎస్ఈ నిఫ్టీ సూచీ 21,700-22,800 మధ్య స్థాయిలో కొనసాగుతుందని అంచనా వేశారు. అయితే ప్రస్తుతం నిఫ్టీ సూచీ 22,466 స్థాయిల వద్ద కొనసాగుతోంది. అయితే నిపుణులు మాత్రం ఈసారి మోదీ మరోసారి ప్రధానిగా ఎన్నికైతే ప్రధానంగా రైల్వేలు, ఇన్ఫ్రా స్ట్రక్చర్, డిఫెన్స్, పవర్, ప్రభుత్వ యాజమాన్యంలోని సంస్థల షేర్లు సూపర్ రాబడులను అందిస్తాయని అంచనా వేశారు.అయితే ఇప్పటికే పైన పేర్కొన్న రంగాలకు చెందిన అనేక కంపెనీలు దలాల్ స్ట్రీట్లో దౌడు తీస్తున్నాయి. ఉదాహరణకు మే 17, 2023 నుంచి.. డిఫెన్స్ రంగానికి చెందిన ఆస్ట్రా మైక్రోవేవ్ ప్రొడక్ట్స్ 124 శాతం, హిందుస్థాన్ ఏరోనాటిక్స్ వంటి డిఫెన్స్ 194 శాతం లాభపడ్డాయి. అలాగే నైబ్ లిమిటెడ్, భారత్ డైనమిక్స్, డాటా ప్యాట్రన్, పరాస్ డిఫెన్స్ వంటి కంపెనీలు సైతం మంచి రాబడులను ఇన్వెస్టర్లకు అందించాయి. ఇక ప్రభుత్వ యాజమాన్యంలోని 50 సంస్థలు గడచిన ఏడాది కాలంలో 100 శాతం కంటే ఎక్కువ ర్యాలీని నమోదు చేశాయి. ప్రభుత్వ యాజమాన్యంలోని కొచ్చిన్ షిప్యార్డ్ ఏడాది కాలంలో అత్యధికంగా 387 శాతం ర్యాలీతో ముందంజలో ఉంది. ఐఎఫ్సిఐ , ఇండియన్ రైల్వే ఫైనాన్స్ కార్పొరేషన్ , హౌసింగ్ %డ% అర్బన్ డెవలప్మెంట్ కార్పొరేషన్, ఆర్ఈసీ కూడా 300% కంటే ఎక్కువ లాభపడ్డాయి. ఇదిలా ఉండగా ఈసారి సార్వత్రిక ఎన్నికల్లో ఏదైనా ప్రతికూల లేదా ఊహించని ఫలితం వెలువడితే దలాల్ స్ట్రీట్ తీవ్ర పతనాన్ని చూడాల్సి వస్తుందని మెహతా అన్నారు. ఎన్నికల ఫలితాలను పక్కన పెడితే దీర్ఘకాలికంగా మిడ్క్యాప్, స్మాల్క్యాప్ల పనితీరు విస్తృతంగా ఉందని అన్నారు. ఈ క్రమంలో కొత్త పెట్టుబడిదారులు దీర్ఘకాలిక వ్యూహంతో ఉన్నట్లయితే ఎస్ఐపీలు, మ్యూచువల్ ఫండ్స్ ద్వారా పెట్టుబడులు పెట్టొచ్చని యోగేష్ మెహతా సూచించారు. రానున్న పదేళ్ల కాలంలో ఈక్విటీలు మరింతగా పెరిగే అవకాశం ఉందని మెహతా అన్నారు.

# హాట్ సమ్మరులో అమెజాన్ గ్రేట్ ట్రెండ్లు




హైదరాబాద్ : మన దేశంలోని దక్షిణ, తూర్పు ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు క్రమంగా పెరుగుతున్నాయి. ఆ విషయం మే 2 నుంచి 7వ తేదీ వరకు జరిగిన అమెజాన్ గ్రేట్ సమ్మర్ సేల్ సందర్భంగా కూడా బయటపడింది. గత సంవత్సరం కంటే ఈ సంవత్సరం ఏసీలు, ఎయిర్ కూలర్లకు ఈ ప్రాంతాల్లో డిమాండు రెండురెట్లు పెరిగింది. ముఖ్యంగా 5 స్టార్ రేటింగ్ ఉన్న వై-ఫై ఏసీలకు ఎక్కువ డిమాండుఉంది. గతంలో పెద్ద నగరాల్లోవాళ్లే ఈ ఏసీలు కొంటుండగా, ఇప్పుడు 2-3 టైర్ నగ రాల నుంచే 65% మంది కస్టమర్లు వీటిని కొనడం విశేషం. దుస్తుల్లో కూడా వేసవికి సరిపోయే పేస్టెల్స్, ఫ్లోరల్స్, కంఫర్టబుల్ ఎథ్నిక్, ఫ్యూజన్ వేర్ ఎక్కువగా ఇష్టపడ్డారు. గ్రేట్ సమ్మర్ సేల్ మొదటిరోజు గత సంవత్సరం కంటే టీవీ సెట్లకు 1.4 రెట్ల ఎక్కువ డిమాండు కనిపించింది. గేమింగ్ ఛైర్లు, బీన్ బ్యాగ్స్, రిక్లైనర్స్ లాంటి ఫర్నిచర్ కూడా బాగానే కొన్నారు. ఈ విషయాలను అమెజాన్ అధికార ప్రతినిధి ఒకరు వెల్లడించారు ఈ సమ్మర్ ట్రెండ్స్ గురించి ఆయన మ రింత వివరిస్తూ... "కస్టమర్లు తమను తాము ఒక యునిక్ స్టైల్లో చూసుకునేందుకు, ఎప్పటికప్పుడు బాగుంటూ, స్టైల్గా ఉంటూ తమ ఆశలు నెరవేర్చుకునేలా చేయడానికి అమెజాన్ ఫ్యాషన్లో ఎప్పుడూ కృషిచేస్తుంటాం. దేశవ్యాప్తంగా ఉన్న మా వినియోగ దారులకు ప్రసిద్ధ బ్రాండ్ల నుంచి ట్రెండింగ్ స్టైల్స్ని క్యూరేటెడ్, అపారమైన ఛాయిస్లను అందిస్తాం. ఇవన్నీ వారికి మంచి విలువను, సౌలభ్యాన్ని అందిస్తాయి. ఈ వేసవిలో మహిళల ఎథ్నిక్ దుస్తులలో 2.5 రెట్లు పెరుగుదల ఉంది. అని తెలిపారు.

# సింగపూర్ ఎయిర్ లైన్స్ ఉద్యోగులకు 8 నెలల జీతం బోనస్



ప్రముఖ విమానయాన సంస్థ సింగపూర్ ఎయిర్లైన్స్ రికార్డు స్థాయిలో లాభాలు నమోదు చేసింది. అంచనాలకు మించి లాభాలు నమోదు చేయడంతో తన సిబ్బందికి బంపర్ ఆఫర్ అందించాలని నిర్ణయించింది. ఎనిమిది నెలల జీతాన్ని బోనస్గా ఇవ్వనున్నట్లు ప్రకటించింది.కరోనా మహమ్మారి కారణంగా దాదాపుగా అన్ని ఎయిర్లైన్ సంస్థలు నష్టాల్లోకి జారుకున్నాయి. ఆ తర్వాత పరిస్థితులు అనుకూలించి.. చైనా, హాంకాంగ్, జపాన్, తైవాన్ దేశాల సరిహద్దులు పూర్తిగా తెరచుకోవడమే తిరిగి సంస్థ లాభాల బాట పట్టడానికి కారణం అని సింగపూర్ ఎయిర్లైన్స్ తెలిపింది. 2023- 24 ఆర్థిక సంవత్సరంలో విమానయాన సంస్థ రికార్డు స్థాయిలో 1.98 బిలియన్ డాలర్ల వార్షిక నికర లాభాన్ని నమోదు చేసింది. దీంతో మార్చి ముగిసే సమయానికి ఎయిర్లైన్ నికర ఆదాయం 24 శాతం పెరిగి 2.7 బిలియన్ డాలర్లకు చేరింది. ప్యాసింజర్లకు సౌకర్యవంతమైన ప్రయాణ వసతుల్ని కల్పించడంతో పాటు తమ ఉద్యోగుల మెరుగైన పనితీరే ఈ వృద్ధికి కారణమని కంపెనీ పేర్కొంది. అందుకే లాభాల్లో కొంత భాగాన్ని ఉద్యోగులకు బోనస్ రూపంలో చెల్లించనున్నట్లు సంస్థ ప్రకటించింది. గత సంవత్సరంలో ఏకంగా 36.4 మిలియన్ల మంది ప్రయాణికులకు సేవలు అందించినట్లు తెలిపింది. ఇలా కంపెనీ ఆర్జించిన లాభాలను బోనస్ రూపంలో ఉద్యోగులకు ఇవ్వడం ఇదేం తొలిసారి కాదు. గతంలో దుబాయ్ ఎమిరేట్స్ కూడా ఇలానే 20 వారాల జీతాన్ని బోనస్గా అందించింది.

# వెనక్కి తగ్గిన ఓయో రూమ్స్




ప్రముఖ హాస్పిటాలిటీ సెక్టార్ కంపెనీ ఓయో రూమ్స్ తొలి పబ్లిక్ ఆఫర్ విషయంలో వెనక్కి తగ్గినట్లు సమాచారం. ఐపీఓ కోసం సెబీకి సమర్పించిన దరఖాస్తును ఓయో ఉపసంహరించుకున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం కంపెనీ రీఫైనాన్సింగ్ ప్రణాళికను ఖరారు చేసే పనిలో ఉందని సంబంధిత వర్గాలు తెలిపాయి. ఈ రీఫైనాన్సింగ్ ప్రక్రియ పూర్తయ్యాక తిరిగి ఐపీఓకు దరఖాస్తు చేసే యోచనలో ఉన్నట్లు పేర్కొన్నాయి.

'రీ ఫైనాన్సింగ్ ప్రక్రియ వల్ల కంపెనీ ఆర్థిక వివరాల్లో మార్పులు చోటు చేసుకుంటున్నాయి. ఈ మార్పులను అనుసరించి నిబంధనల ప్రకారం సెబీకి సవరించిన ఇనీషియల్ పబ్లిక్ ఆఫరింగ్ ) దరఖాస్తును సమర్పించాల్సి ఉంటుంది. ప్రస్తుతం కంపెనీ రీఫైనాన్సింగ్ కు సంబంధించి నిర్ణయం చివరి దశలో ఉంది. ఈ క్రమంలో ప్రస్తుతం అందుబాటులో ఉన్న వివరాలతోనే ఐపీఓకు దరఖాస్తు ఆమోదం కోసం ప్రయత్నించడంలో ఎలాంటి అర్థం లేదు.' అని ఓయో రూమ్స్ వర్గాలు తెలిపినట్లు జాతీయ మీడియాల్లో పలు కథనాలు వెలువడ్డాయి.

అంతర్జాతీయ ట్రావెల్ టెక్నాలజీలో అగ్రగామిగా ఉన్న సాఫ్ట్ బ్యాంక్ ఆధారిత ఓయో డాలర్ బాండ్ల జారీ ద్వారా 450 మిలియన్ డాలర్ల సమకూర్చుకునే రీఫైనాన్సింగ్ ప్లాన్ లకు చేరువవుతున్నందున ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. అందుకే ఇన్వెస్టర్లు ఆత్రుతగా ఎదురుచూస్తున్న ఐపీఓను రీఫైల్ చేయాలని ఓయో రూమ్స్ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. ఓయో రీఫైనాన్సింక్ ప్రక్రియకు జేపీ మోర్గాన్ లీడ్ బ్యాంకర్ గా వ్యవహరిస్తోంది. వార్షిక వడ్డీ రేటు 9-10 శాతంతో డాలర్ బాండ్లను విక్రయించనుందని పీటీఐ పేర్కొంది. ఈ క్రమంలోనే ఓయో తన ప్రస్తుత డిఆర్హెచ్పి ని రీఫైనాన్సింగ్ కు ముందుగానే ఉపసంహరించుకోవడానికి మార్కెట్ నియంత్రణ సంస్థ సెబీకి ఇప్పటికే దరఖాస్తు చేసుకున్నట్లు తెలుస్తోంది.

# ఎన్నికల ఫలితాల నుంచి కాపాడే స్టాక్స్



సార్వత్రిక ఎన్నికలు 5వ దశకు చేరుకున్న వేల దాదాపు ఎన్నికలు చివరికి అంకానికి దగ్గరయ్యాయి. ఈ క్రమంలో దేశంలో ఎన్నికల ఫలితాలపై ఓటర్ల కంటే ఇన్వెస్టర్లు అధికంగా ఆందోళన చెందుతున్నారు. వాస్తవానికి ఏ రాజకీయ పార్టీ గెలుస్తుందనే ఆలోచనపై చాలా మంది పెట్టుబడిదారుల భవితవ్యం ప్రస్తుతం ఆధారపడి ఉంది. అనేక మంది ఇన్వెస్టర్లు తమ ఊహాగానాలకు అనుగుణంగా ఇప్పటికే ట్రేడ్స్ నిర్వహించారు. 8 ఫలితాలకు మరింతగా చేరువవుతున్న వేళ ఈక్విటీ మార్కెట్లలో అస్థిరత పెరుగుతున్న నేపథ్యంలో చాలా మంది ఇన్వెస్టర్లు తమ పోర్ట్ఫోలియోను కాపాడుకునేందుకు చూస్తున్నారు. ఈ క్రమంలో వారు కొన్ని రంగాల్లోని షేర్లపై దృష్టి సారించొచ్చని నిపుణులు సూచిస్తున్నారు. దేశీయ బ్రోకరేజ్ సంస్థ ప్రభుదాస్ లిల్లాధర్ ప్రకారం మొదటగా బ్యాంకింగ్ రంగం ఇన్వెస్టర్ల పోర్ట్ ఫోలను స్థిరంగా ఉంచదగినదని పేర్కొంది. గ్రామీణ ప్రాంతాల నుంచి డిమాండ్ తిరిగి పుంజుకోవటంతో పాటు ఈసారి వర్షపాతం సాధారణంగా ఉంటుందనే అంచనాల మధ్య ఎఫ్ఎంసీజీ రంగాలకు చెందిన ఐటీసీ, హిందుస్థాన్ యూనీలివర్, బ్రిటానియా, టైటాన్ వంటి కంపెనీల షేర్లు పెట్టుబడిదారుల సంపదను ఆవిరవటం నుంచి కాపాడటంతో తోడ్పడతాయని బ్రోకరేజ్ అంచనా వేస్తోంది. ఇక ఇదే సమయంలో రంగాల వారీగా బ్రోకరేజ్ ఎంపిక చేసిన వివిధ కంపెనీల షేర్ల జాబితాను పరిశీలిస్తే..

లి ఎఫ్ఎంసీజీ- హిందుస్థాన్ యూనీలివర్, బ్రిటానియా, జీసీపీఎల్, మ్యారికో, డాబర్, ఇమామీ, వరుణ్ బెవరేజెస్ ఉన్నాయి

లి ఆటో- ఐషర్ మోటార్స్, హీరో మోటొకార్ప్, మహీంద్రా అండ్ మహీంద్రా, మారుతీ సుజుకీ ఎంపికయ్యాయి.

లి ఫార్మా, హాస్పిటల్- సన్, మ్యాక్స్ హెల్త్కేర్, లుపిన్, జూపిటర్ హాస్పిటల్స్ ఉన్నాయి

లి ఐటీ సర్వీసెస్- టీసీఎస్, హెచ్సీఎల్ టెక్, ఎల్ టిఐ మైండ్ ట్రీ, సయ్యంట్ నిలిచాయి

లి ప్రైవేట్ బ్యాంక్స్- హెచ్డీఎఫ్సీ బ్యాంక్, కోటక్ బ్యాంక్, యాక్సిస్ బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్ ఉన్నాయి

లి క్యాపిటల్ గూడ్స్- సీమెన్స్, ఏబీబీ, హనీవెల్, ఇలాంటాస్ బెక్, టిమ్ కెన్, హిటాచీ ఎనర్జీ, జిఈటిడి

లి కమోడిటీస్- హిందాల్కో

లి కన్జూమర్ డ్యూరబుల్, టెలికాం- హావెల్స్ ఇండియా, ఎయిర్ టెల్, డెలివరీ కంపెనీలు ఎంపికయ్యాయి. ఐటీ రంగంలో ప్రస్తుతం కొనసాగుతున్న అస్థిర పరిస్థితులు తిరిగి పునరుద్ధరణకు చాలా కాలం పడుతున్న వేళ దీనిపై తక్కువ వెయిటేజ్ బ్రోకరేజ్ ఉంచింది. ఈడిఎస్, డేటా అనలిటిక్స్, డిజిటల్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, సప్లై చైన్ వంటి విభాగాలు వృద్ధిని పెంచుతాయని భావిస్తోంది. ఇక గ్రామీణ డిమాండ్ మెరుగుపడటంతో ఆటోమొబైల్ రంగం షేర్లపై అధిక వెయిటేజ్ కేటాయించింది. సాధారణ రుతుపవనాలతో ట్రాక్టర్లు, కార్లకు డిమాండ్ పెరుగుతుందని భావిస్తూ వెయిచేజ్ పెంచబడింది. అలాగే ఎన్నికల తర్వాత టెలికాం కంపెనీలు ఛార్జీలను పెంచనున్నట్లు వస్తున్న వార్తలతో ఎయిర్ టెల్ కంపెనీ ఆదాయాలపై సానుకూల ధోరణిని బ్రోకరేజ్ వ్యక్తం చేసింది. అలాగే %జీxూ% ప్లాట్ఫారమ్ల విభజన మీడియం టర్మ్లో కీలకమైన ట్రిగ్గర్ అవుతుందని భావిస్తున్నట్లు పేర్కొంది. ఇక బ్రోకరేజ్ సంస్థ ఆయిల్ అండ్ గ్యాస్ షేర్లపై తక్కువ వెయిటేజ్ కేటాయించింది.

# కియా కార్ లీజింగ్ షురూ



రోజుకో కొత్త కారులో తిరగాలని ఉందా? అయితే మీకు గుడ్ న్యూస్. ప్రముఖ ఆటోమొబైల్ కంపెనీ కియా భారత్లో కార్ లీజింగ్ సర్వీస్ను ప్రారంభించింది. హైదరాబాద్ సహా మొత్తం 6 నగరాల్లో ఈ ఫెసిలిటీ అందుబాటులోకి వచ్చింది. మీరు అతి తక్కువ అద్దె చెల్లించి నచ్చిన కియా కారును లీజుకు తీసుకోవచ్చు. భారతదేశంలో కొత్త కారు కొంటే దానికి కచ్చితంగా ఇన్సూరెన్స్ చేయాల్సి ఉంటుంది. పైగా నిర్వహణ ఖర్చులు కూడా భరించాల్సి ఉండాలి. ఒక వేళ మీ దగ్గర పాత కారు ఉంటే, దానిని విక్రయించేటప్పుడు చాలా తక్కువ మొత్తమే వెనక్కు వస్తుంది. అందువల్ల కొత్త మోడళ్లకు అప్గ్రేడ్ కావడం కష్టమవుతుంది. ఇలాంటి సమస్యలేవీ లేకుండా, ఇప్పుడు కారును లీజుకు తీసుకునే సౌకర్యం అందుబాటులోకి వచ్చింది.

**6 నగరాల్లో**

కియా కంపెనీ, ఓరిక్స్ ఆటో ఇన్ఫ్రాస్ట్రక్చర్ సర్వీసెస్తో ఒప్పందాన్ని కుదుర్చుకుంది. కనుక ఈ రెండూ కలిసి కియా లీజ్ సేవలను హైదరాబాద్, చెన్నై, బెంగళూరు, ముంబయి, పుణె, దిల్లీల్లో ప్రారంభించాయి. ఈ విషయాన్ని కియా ఇండియా చీఫ్ సేల్స్ ఆఫీసర్ మ్యుంగ్-సిక్ సోన్ తెలిపారు.

**ఈ వాహనాలు మాత్రమే!**

కియా కార్లను 24-60 నెలల వ్యవధి వరకు లీజుకు తీసుకోవచ్చు. హైలెట్ ఏమిటంటే, ఎలాంటి ఎడ్వాన్స్ పేమెంట్ కూడా చేయనక్కర్లేదు. కియా సోనెట్ కారుకు నెలకు రూ.21,900బీ సెల్టోస్కు రూ.28,900, కారెన్స్కు రూ.28,800 వరకు అద్దె చెల్లించాల్సి ఉంటుంది. మనలో చాలా మందికి కార్లు అంటే చాలా ఇష్టం ఉంటుంది. కానీ కారు కొనేంత స్తోమత వారికి ఉండదు. ఇలాంటి వారి కోసమే ప్రముఖ ఆటోమొబైల్ కంపెనీలు సబ్స్క్రిప్షన్ ప్లాన్లను అందిస్తున్నాయి. వీటి ద్వారా మీకు నచ్చిన కారును నిర్దిష్ట కాలం పాటు వాడుకోవచ్చు. దీని కోసం మీరు ప్రతినెలా నిర్దిష్ట మొత్తాన్ని చెల్లిస్తే సరిపోతుంది. ఇది ఏదో చాలా బాగుంది కదూ. మీరు కనుక కార్ లవర్ అయితే, ఈ అవకాశాన్ని ఉపయోగించుకుని, నెలకో కొత్త కారులో హాయిగా తిరగవచ్చు. వాస్తవానికి విదేశాల్లో ఈ కార్ సబ్స్క్రిప్షన్ చాలా పాపులర్.

**డిపాజిట్ ఎంత చేయాలి?**

ప్రముఖ ఆటోమొబైల్ కంపెనీలు అన్నీ కార్ సబ్స్క్రిప్షన్ ప్లాన్లను అందిస్తున్నాయి. మీరు ఎంచుకునే మోడల్ ఆధారంగా ఈ డిపాజిట్ మొత్తం మారుతుంది. అయితే కార్ సబ్స్క్రైబ్ చేసుకోవడానికి ముందుగా కొంత మొత్తాన్ని డిపాజిట్ చేయాల్సి ఉంటుంది. లేదా డౌన్ పేమెంట్ చెల్లించాల్సి వస్తుంది. తరువాత మీరు కోరుకున్నంత కాలానికి నెలనెలా ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. అంతే సింపుల్.

**కార్ సబ్స్క్రిప్షన్ బెనిఫిట్స్!**

మీకు నచ్చిన కారును సబ్స్క్రైబ్ చేసుకోవచ్చు. దీనిని మీకు నచ్చినప్పుడు వదులుకోవచ్చు కూడా. కార్ సబ్స్క్రైబ్ చేసుకున్న తరువాత మీకు రోడ్ సైడ్ అసిస్టెన్స్ లభిస్తుంది. మీరు ప్రస్తుతం వాడుతున్న మోడల్ను వదులుకొని, కొత్త మోడల్కు అప్గ్రేడ్ చేసుకోవడానికి వీలవుతుంది. కారు మెయింటెనెన్స్, ఇన్సూరెన్స్, ట్యాక్సు అన్నీ మీరు చెల్లించే నెలవారీ సభ్యత్వ రుసుములోనే కవర్ అయిపోతాయి. కనుక ఎక్స్ట్రా ఫీజు కట్టాల్సిన పని ఉండదు. యూఎస్, యూరోప్లో ఇది బాగా పాపులర్ అయ్యింది. ఇండియాలో కూడా ఈ కార్ సబ్స్క్రిప్షన్ ప్లాన్ క్రమంగా ప్రాచుర్యం పొందుతోంది.

### మార్కెట్ ఫలితాలకు ఎన్నికల రిజల్ట్ ప్రభావం ఉండదు



ముంబై, , భారతదేశంలో అత్యంత విశ్వసనీయ ఆర్థిక సేవల సంస్థల్లో ఒకటైన ప్రభుదాస్ లిల్లాధర్ దట్రేస్ ఆఫ్ వోలటిలిటీ ఇండియా స్ట్రాటజీ రిపోర్ట్ - 2024 మాండేట్ ప్రకారం, కేంద్రంలో వచ్చిన పాలనతో సంబంధం లేకుండా పేర్కొంది. ఎఫ్ఎంసిజి ఆటో, హెల్త్కేర్, ఐటి సర్వీసెస్, ప్రైవేట్ బ్యాంక్లు మరియు క్యాపిటల్ గూడ్స్ వంటి రంగాలు మంచి పనితీరును కనబరుస్తాయని మరియు ఎన్నికల ఫలితాలకు వ్యతిరేకంగా వివేకవంతమైన డిఫెన్సివ్ హెడ్జ్గా పేర్కొనబడ్డాయి. ఎన్డిఏ తిరిగి అధికారంలోకి వస్తే పాలసీ కొనసాగుతుందని పిఎల్ ఆశిస్తోంది మరియు ఇన్ఫ్రా, రక్షణ, సిజి, న్యూ ఎనర్జీ, టూరిజం మొదలైన అంశాలకు సంబంధించిన అంశాలు బాగానే కొనసాగుతాయి. వినియోగదారుడు, 2 వాట్స్మరియు ట్రాక్టర్లు గ్రామీణ డిమాండ్ మరియు సాధారణ రుతుపవనాల అంచనాలలో గ్రీన్ రెమ్మల నుండి ప్రోత్సాహాన్ని పొందవచ్చని పేర్కొంది. 2004లో యుపిఏ విజయం ఊహించని రీతిలో పునరావృతం కావడం వల్ల ఒక్క రోజులో సెన్సెక్స్లో 15% క్షీణత నెలకొనడంతో గత రెండు వారాలుగా మార్కెట్లు ఆందోళనకు గురయిన విషయం విదితమే.

## 50 భారతీయ స్టార్టప్లను

### ప్రపంచ మార్కెట్లలో తీసుకువెళ్లాలని లక్ష్యం




బెంగళూరు : వినియోగదారుల ఉత్పత్తుల రంగంలో స్టార్టప్ల కోసం గ్లోబల్ బిజినెస్ యాక్సిలరేటర్ అయిన ప్రొపెల్ నాల్గవ సీజన్ను ప్రారంభించినట్లు అమెజాన్ ఇండియా ప్రకటించింది. అభివృద్ధి చెందుతున్న భారతీయ బ్రాండ్లు మరియు స్టార్టప్లు ఈ-కామర్స్ ఎగుమతులను ఉపయోగించి ప్రపంచవ్యాప్తంగా కస్టమర్లను చేరుకోవడానికి పూర్తిస్థాయి మద్దతును అందించడానికి తీర్చిదిద్దబడిన వినూత్నమైన ప్రోగ్రామ్ ఇది. ప్రొపెల్ ఎస్4 అంతర్జాతీయ మార్కెట్లలో 50 స్టార్టప్ల ప్రారంభానికి మద్దతు ఇస్తుంది మరియు భారతదేశం నుండి గ్లోబల్ బ్రాండ్లను సృష్టించనుంది. దీనిలో పాల్గొనే స్టార్టప్లు యాక్టివేట్ క్రెడిట్లు, ఆరు నెలల ఉచిత లాజిస్టిక్స్ మరియు అకౌంట్ మేనేజ్మెంట్ సపోర్ట్, అలాగే టాప్ 3 విజేతల కోసం అమెజాన్ నుండి 100 వేల అమెరికన డాలర్లు గ్రాంట్తో సహా 1.5 అమెరికన మిలియన్ల డాలర్లుకు పైగా విలువైన మొత్తం రివార్డ్లను గెలుచుకుంటాయి. పాల్గొనే స్టార్టప్లు భారతీయ ఆదాయ-ఆధారిత ఫైనాన్సింగ్ సంస్థలైన క్లబ్, వెలాసిటీ మరియు గెట్వాన్టేజ్లతో కనెక్ట్ అవ్వడానికి కూడా అమెజాన్ సహాయం చేస్తుంది, ఇవి పాల్గొనే స్టార్టప్లకు తమ వ్యాపారాన్ని విస్తృత స్థాయిలో విస్తరించడానికి క్యూరేటెడ్ ఆఫర్లను అందిస్తాయి. ప్రోగ్రామ్ కోసం అప్లికేషన్లు తెరవబడతాయి మరియు జూన్ 9, 2024న ముగుస్తాయి. ఇది డెమో-డే తో ముగుస్తుంది, దీనిలో పాల్గొనేవారు తమ వ్యాపార ప్రతిపాదనలను ప్రముఖ విసి సంస్థలకు అందించడానికి మరియు వారి కార్యకలాపాలను విస్తరించడానికి నిధులను పొందే అవకాశాన్ని పొందుతారు. ప్రొపెల్ ఎస్4లో భాగంగా, అమెజాన్ లీడర్లు, విసి భాగస్వాములు మరియు సీనియర్ ఇండస్ట్రీ లీడర్లతో కూడిన మెంటార్షిప్ బోర్డును అమెజాన్ ఏర్పాటు చేసింది, వారు అభివృద్ధి చెందుతున్న బ్రాండ్లతో కలిసి పనిచేయటం తో పాటుగా , వారికి తగిన వనరులు, 1:1 మెంటార్షిప్ మరియు వర్క్షాప్లను గ్లోబల్ డిమాండ్ ప్యాటర్న్లు మరియు ఈ-కామర్స్ ద్వారా విజయవంతమైన ఎగుమతుల వ్యాపారం నిర్మాణం పై తగిన పరిజ్ఞానం అందిస్తారు. అమెజాన్ ఇండియా గ్లోబల్ ట్రేడ్ డైరెక్టర్ భూపేన్ వాకంకర్ మాట్లాడుతూ, "ప్రొపెల్ యాక్సిలరేటర్ యొక్క నాల్గవ సీజన్ ప్రారంభం పట్ల నేను సంతోషిస్తున్నాను. ఈ కార్యక్రమం ద్వారా మినిమలిస్ట్, సిరోనా, ఎకోరైట్, పెర్ఫోరా మరియు బటర్నట్ ఎడ్యుఫీల్డ్లతో సహా ప్రపంచవ్యాప్తంగా 70కి పైగా భారతీయ స్టార్టప్లకు మేము ఇప్పటికే సహాయం చేసాము. మేము అభివృద్ధి చెందుతున్న కంపెనీలకు వారి వ్యాపార ప్రతిపాదనలకు జీవం పోయడానికి మరియు భారతదేశం నుండి ప్రపంచవ్యాప్తంగా జనాదరణ పొందిన బ్రాండ్లను రూపొందించడానికి తగిన అవకాశాన్ని అందిస్తూ ప్రొపెల్ యాక్సిలరేటర్ను ప్రారంభించాము. మేము ప్రొపెల్ యొక్క సరికొత్త సీజన్ కోసం సంతోషిస్తున్నాము. ఈ సంవత్సరం గ్లోబల్ మార్కెట్లలో భారతదేశం నుండి 50 వరకు స్టార్టప్లను ప్రారంభించడంలో సహాయపడటానికి విస్తరించిన ప్రయోజనాలు మరియు మద్దతుతో సీజన్ 4 మరింత పెద్దదిగా మరియు మెరుగైనదిగా మలుస్తున్నాము. 2025 నాటికి భారతదేశం నుండి 20 బిలియన్ల ఇ-కామర్స్ ఎగుమతులను ప్రారంభించాలనే మా నిబద్ధతలో ఈ కార్యక్రమం కీలక భాగం.." అని అన్నారు

### ఏఓఐలో విజయవంతంగా

## ఫోలిక్యులర్ లింఫోమా స్టేజ్ 4 చికిత్స



విజయవాడలోని అమెరికన్ ఆంకాలజీ ఇన్స్టిట్యూట్,కానూరు,అత్యంత సవాలుతో కూడిన ఫోలిక్యులర్ లిం ఫోమా స్టేజ్ 4 తో ఇబ్బంది పడుతున్న 62 ఏళ్ల వ్యక్తికి విజయవంతంగాచికిత్సను చేసినట్లు వెల్లడించింది.బరువు తగ్గడం మరియు గత ఆరు నెలలుగా తీవ్రమైన వెన్నునొప్పి వంటి సమస్యలతో అతను పలు హాస్పిటల్స్ తిరిగారు. ప్రారంభంలో ఇతర ఆసుపత్రులలో పరీక్షలు చేసినప్పుడు , అతని పొత్తికడుపు లో పలు పెద్ద లింప్ నోడ్స్ ఉన్నాయని కనుగొనబడింది. క్షయవ్యాధి ప్రోటోకాల్ల క్రింద అతనికి చికిత్స చేశారు. అయినప్పటికీ, నిరంతర సమస్యల కారణంగా, డాక్టర్ సాయికృష్ణ కొల్లూరు వద్ద పరీక్ష చేయించుకోవటం కోసం విజయవాడలోని ఏఓఐ కు వచ్చారు. సమగ్ర పరీక్ష లతో పాటుగా బయాప్సీ తో పెద్ద లింప్ నోడ్స్ మరియు ఎముక ప్రమేయంతో ఫోలిక్యులర్ లింఫోమా స్టేజ్ వున్నట్లుగా డాక్టర్ కొల్లూరు నిర్ధారించారు. సరిగ్గా చెప్పాలంటే, అభివృద్ధి చెందిన దశలో ఉన్న ఒక రకమైన నాన్-హాడ్కిన్ లింఫోమా. ఇది తీవ్ర స్థాయిలో వుంది. ఒక ప్రాంతంలో మాత్రమే కాకుండా ఎముక మజ్జ లేదా కాలేయం, ప్లీహము లేదా ఊపిరితిత్తుల వంటి అవయవాలకు కూడా వ్యాపించింది. ఏఓఐ మల్టీడిసిప్లినరీ మరియు అధునాతన చికిత్సా విధానాలతో, ఆరు నెలల పాటు ఆరు సైకిల్స్ కీమోఇమ్యునోథెరపీ రోగి చేయించుకున్నాడు."చికిత్సకు రోగి యొక్క ప్రతిస్పందన మా అంచనాలను మించిపోయింది" అని ఏఓఐ కానూరు మెడికల్ ఆంకాలజిస్ట్ డాక్టర్ సాయి కృష్ణ కొల్లూరు అన్నారు. "వ్యక్తిగతీకరించిన సంరక్షణ మరియు అత్యాధునిక చికిత్సలను అందించడంలో మా బృందం యొక్క అంకితభావం కారణంగా , కీమోథెరపీకి అద్భుతమైన ప్రతిస్పందన లభించింది. గణనీయంగా లక్షణాల నుంచి ఉపశమనం కలగటం తో పాటుగా జీవన నాణ్యత కూడా మెరుగుపడింది" అని అన్నారు.



# ఆప్ అంతానికి భాజపా ఆపరేషన్ షురూ

● మా నేతలను అరెస్టు చేసి జైళ్లకు పంపించేందుకు ప్లాన్
● మోడీపై ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ ఆగ్రహం

ఢిల్లీ: భాజపా, ప్రధానమంత్రి నరేంద్ర మోదీలపై ఆమ్‌ఆద్మీపార్టీ కన్వీనర్, ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఆప్ నేతలను అరెస్టు చేసి జైళ్లకు పంపించేందుకు ఆపరేషన్ ఝాడు కార్యక్రమాన్ని మొదలుపెట్టారని ఆరోపించారు. బిభవ్ కుమార్ అరెస్టుకు నిరసనగా భాజపా ప్రధాన కార్యాలయాన్ని ముట్టడించేందుకు పార్టీ కార్యకర్తలతో బయలుదేరిన వేళ కేజ్రీవాల్ ఈ వ్యాఖ్యలు చేశారు. ఆమ్‌ఆద్మీ పార్టీని మట్టికరిపించాలని ప్రధాని నిర్ణయించుకున్నారు. ఆప్ గురించి విమర్శలు చేస్తూనే ఉన్నారు. ఆప్ను ముప్పుగా భావిస్తోన్న భాజపా.. నాకు బెయిల్ వచ్చినప్పటి నుంచి ఆపరేషన్ ఝాడు పేరుతో కార్యక్రమాన్ని మొదలుపెట్టింది. ఆప్ నేతల అరెస్టులు, పార్టీ బ్యాంకు అకౌంట్లను సీజ్ చేయడం, ఆప్ కార్యాలయాలను మూసివేయించడం వంటివి అందులో భాగమే అని కేజ్రీవాల్ ఆరోపించారు. భాజపా కార్యాలయాన్ని ముట్టడించేందుకు కేజ్రీవాల్ తన పార్టీ కార్యకర్తలతో సహా బయలుదేరారు. ఈ సమయంలో వారిని పోలీసులు అడ్డుకున్నారు. దీంతో ఆప్ కార్యాలయం ముందు ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ బైఠాయించి నిరసన చేపట్టారు. ఫలితంగా ఆ ప్రాంతంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. మరోవైపు డీడీయూ మార్గ్లో పోలీసులు 144 సెక్షన్ విధించారు. ఐటీవో మెట్రో స్టేషన్ను తాత్కాలికంగా మూసివేశారు. భాజపా కేంద్ర కార్యాలయం వద్ద భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

# మంత్రివర్గ సమావేశానికి ఈసీ ఓకే

● నేడే సమావేశం ● అత్యవసర విషయాలు మాత్రమే చర్చించాలని కండీషన్
● తక్షణం అమలు చేయాల్సిన అంశాల ఎజెండా మీద మాత్రమే సమావేశం నిర్వహించాలని స్పష్టం
● రైతు రుణమాఫీ అంశాలను వాయిదా వేయాలని తేల్చి చెప్పిన వైనం
● ఎన్నికల ప్రక్రియలో భాగస్వాములు అయిన అధికారులు మంత్రివర్గ సమావేశంలో పాల్గొనద్దని షరతు



తెలంగాణ బ్యూరోప్రతినిధిః తెలంగాణ మంత్రివర్గ సమావేశానికి ఎన్నికల సంఘం అనుమతి ఇచ్చింది. శనివారం జరగాల్సిన మంత్రివర్గ సమావేశం ఎన్నికల సంఘం అనుమతి రాకపోవటంతో సోమవారంకు 3 గంటలకు వాయిదా పడింది. అధికారులతో సీఎం రేవంత్ సమీక్ష చేసారు. కేబినెట్ భేటీలో రైతు రుణమాఫీతో పాటుగా రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలు...ఉమ్మడి రాజధానిలో ఏపీకి కేటాయించిన ఆస్తుల పైన నిర్ణయం తీసుకోవాలని భావించారు. కానీ, ఎన్నికల సంఘం కీలక ఆదేశాలు ఇచ్చింది. ఈసీ అనుమతి తెలంగాణలో లోక్ సభ ఎన్నికలు ముగియటంతో సీఎం రేవంత్ మంత్రివర్గ సమావేశానికి నిర్ణయించారు. ఆ భేటీలో రైతు రుణమాఫీతోపాటు, రాష్ట్ర ఆదాయం పెంపు, వర్షాకాల సీజన్ లో చేపట్టాల్సిన చర్యలపై కేబినెట్ ప్రధానంగా చర్చించే విధంగా అజెండా ఫిక్స్ అయింది. రెండు తెలుగు రాష్ట్రాల మధ్య అపరిష్కృతంగా ఉన్న అంశాలపై కేబినెట్ కీలక నిర్ణయం తీసుకోవాలని భావించారు. ఆగస్టు 15 నాటికి రైతు రుణ మాఫీఅమలు చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్ ఎంపీ ఎన్నికల ప్రచారంలో పలు మార్లు హామీ ఇచ్చారు. ఇందు కోసం కేబినెట్ భేటీలో నిర్ణయం తీసుకోవాలని డిసైడ్ అయ్యారు. అయితే, ఎన్నికల సంఘం అనుమతి రాక ఆ సమావేశం జరగలేదు.

ఇప్పుడు తాజాగా ఎన్నికల సంఘం కేబినెట్ భేటీకి అనుమతి ఇస్తూనే కొన్ని షరతులు విధించింది. కేబినెట్ సమావేశం నిర్వహించుకోవచ్చని చెబుతూనే.. రైతు రుణమాఫి, ఉమ్మడి రాజదాని అంశాలపై చర్చించకుండా.. కేబినెట్లో అత్యవసరమైన విషయాలపైనే చర్చించాలని షరతులతో కూడిన అనుమతినిచ్చింది. ఎన్నికల విధుల్లో ఉన్న అధికారులు కేబినెట్ భేటీకి వెళ్లకూడదని కేంద్ర ఎన్నికల సంఘం స్పష్టం చేసింది. దీంతో..రైతు రుణమాఫీ అమలు దిశగా ప్రభుత్వం అధికారిక నిర్ణయం ఎన్నికల కోడ్ పూర్తయిన తరువాతనే ప్రకటించాల్సిన పరిస్థితి ఏర్పడింది. కోడ్ తరువాతే రుణమాఫీ నిర్ణయం రైతుల రుణమాఫీ అమలు దిశగా రేవంత్ ఇప్పటికే కార్యాచరణ ప్రారంభించారు. రుణమాఫీ కోసం దాదాపు రూ. 40 వేల కోట్లు అవసరం. ఇందుకు సంబంధించి రైతు కార్పోరేషన్ ఏర్పాటు చేసే ఆలోచనలో ప్రభుత్వం ఉంది. ఇప్పటికే అధికారులు బ్యాంకర్లతో ఈ అంశం పైన చర్చించి ప్రతిపాదనలు సిద్దం చేసారు. కేబినెట్ సమావేశం జరిగితే..అందులోనే రైతు కార్పోరేషన్ పై నిర్ణయం తీసుకోవాలని భావించింది. ఇప్పుడు ఈ నిర్ణయం వాయిదా పడనుంది. ఇప్పుడు ఎన్నికల సంఘం మంత్రివర్గ భేటీకి అనుమతి ఇవ్వటం సమావేశం నిర్వహణ పైన ప్రభుత్వం సమయం ఖరారు చేయాల్సి ఉంది. ఈ భేటీలో ధాన్యం కొనుగోళ్ల పురోగతిని కేబినెట్ సమీక్షించనుంది. జూన్ నెల అరంభం నుంచి ఖరీఫ్ పంట సీజన్ ప్రారంభం కానున్న నేపథ్యంలో విత్తనాలు, ఎరువులు, నీటి ప్రణాళికపై చర్చ జరుగనుంది.

# మళ్లీ కరోనా కలకలం..

● మాస్కులు ధరించాల్సిందే ● సింగపూర్‌లో కరోనా మరోసారి విజృంభించింది




న్యూఢిల్లీ ... ప్రపంచవ్యాప్తంగా రెండు, మూడుసార్లు లాక్డౌన్స్ నిర్వహించిన తర్వాత.. కరోనా ప్రభావమైతే గణనీయంగానే తగ్గింది. కొన్ని దేశాల్లో వివిధ వేరియెంట్లు పంజా విసిరినా, కొవిడ్ కేసులు నమోదైనా.. మునుపటిలా ఎక్కువ స్థాయిలో నమోదవ్వలేదు. క్రమంగా దాని ప్రభావం తగ్గుతూ వచ్చింది. దీంతో.. ఈ వైరస్ కథ ఇక కంచికి చేరినట్లేనని అంతా ఊపిరి పీల్చుకున్నారు. కానీ.. ఇంతలోనే ఇది ఊహించని షాక్ ఇచ్చింది. తన కథ ఇంకా ముగిసిపోలేదంటూ.. మళ్లీ కోరకలు చాచడం మొదలుపెట్టింది. అవును.. మీరు చదువుతోంది అక్షరాల నిజం. సింగపూర్లో కరోనా మరోసారి విజృంభించింది. కేవలం వారం రోజుల్లోనే (మే 5 నుంచి 11వ తేదీ వరకు) అక్కడ 25,900 కంటే ఎక్కువ కేసులు నమోదయ్యాయి. దీంతో.. అక్కడి ప్రభుత్వం అప్రమత్తమైంది. ఇది మరింత ఉధృతమైతే పరిస్థితులు భయంకరంగా మారొచ్చన్న ఉద్దేశంతో.. ముందు జాగ్రత్త చర్యలు చేపడుతోంది. ఇందులో భాగంగానే.. ప్రతి ఒక్కరూ మాస్కులు తప్పనిసరిగా ధరించాలని ఆదేశాలు జారీ చేసింది. దీనిపై సింగపూర్ ఆరోగ్యశాఖ మంత్రి ఆంగ్ యె కుంగ్ మాట్లాడుతూ.. కొత్తగా కొవిడ్ ఉద్ధృతి మొదలవుతోంది. అది క్రమంగా పెరుగుతోంది. నాలుగు వారాల్లో ఇది గరిష్ఠ స్థాయికి చేరే అవకాశం ఉంది అని తెలిపారు. మరోవైపు.. సింగపూర్ ఆసుపత్రుల్లో చేరే కరోనా రోగుల సంఖ్య క్రమంగా పెరుగుతూ వస్తోంది. గత వారం రోజులుగా ప్రతిరోజూ 250 మంది కొవిడ్ బాధితులు హాస్పిటల్స్లో చేరుతున్నట్టు ఆరోగ్య శాఖ తెలిపింది. ఈ తరుణంలోనే.. ఆసుపత్రులు సంసిద్ధం కావాలని ఆదేశాలు జారీ చేసింది. రోగులకు పడకలను అందుబాటులో ఉంచాలని, అత్యవసరం కాని శస్త్రచికిత్సలను వాయిదా వేయాలని సూచించింది. అలాగే.. తీవ్రమైన అనారోగ్యంతో బాధపడుతున్న వారు, 60 కంటే ఎక్కువ వయస్సుగల వారు కరోనా వ్యాక్సిన్ను తప్పకుండా తీసుకోవాలని ఆరోగ్యశాఖ మంత్రి ప్రజలను విజ్ఞప్తి చేశారు.

# గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలుస్తున్నాం

● మోడీ దేవుళ్ల పేరుతో ఓట్లు అడగడం దేనికి సంకేతం ● కాంగ్రెస్ ప్రభుత్వానికి ఎన్నికలు వచ్చినప్పడే రైతు బంధు గుర్తుకొస్తుంది ● అభ్యర్థి గుణగణాలను చూసి ఓటు వేయాలి ● ఆలేరులో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



తెలంగాణ బ్యూరోప్రతినిధిః తెలంగాణలో ఇప్పటి వరకు జరిగిన గ్రాడ్యుయేట్ ఎన్నికల్లో తమ పార్టీ విజయం సాధించిందని.. ఈ ఎన్నికల్లోనూ గెలుస్తుందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు ధీమా వ్యక్తం చేశారు. ఆదివారం బీఆర్ఎస్ విస్తృతస్థాయి కార్యకర్తల సమావేశం నిర్వహించారు. గ్రాడ్యుయేట్ ఉప ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆలేరులో బీఆర్ఎస్ కేడర్తో చర్చించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మీడియాతో మాట్లాడుతూ.. గ్రాడ్యుయేట్ ఎన్నికల్లో ఓటు వేసే ముందు పార్టీతో పాటు అభ్యర్థి గుణగణాలను చూడాలని సూచించారు. ఈ ఎన్నికల్లో ఒక వైపు బిట్స్ పిలానీలో చదువుకున్న అభ్యర్థి , మరో పార్టీ వైపు బ్లాక్ మెయిలర్, లాబీయింగ్ , పైశాచిక ఆనందం పొందే అభ్యర్థి ఉన్నారని చెప్పారు. గ్రాడ్యుయేట్ ఎన్నికల్లో అభ్యర్థులను చూసి ఆలోచించి ఓటు వేయాలని కోరారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అయోధ్య గుడి కట్టారని చెబుతూ.. బీజేపీ అభ్యర్థి ఓట్లు అడుగుతున్నారని.. తాము యాదాద్రి గుడి కట్టామని.. గుడి పేరుతో తాము ఇంతవరకు ఓట్లు అడగలేదని చెప్పారు. తాము ప్రాజెక్టులు కట్టామని.. అవి కూడా దేవుళ్ల పేరు మీద కట్టామని అయినా తాము దేవుడి పేరుతో ఏ ఎన్నికల్లోనూ ఓట్లు అడగట్లేదని స్పష్టం చేశారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో బీఆర్ఎస్ ప్రభుత్వం రాక ముందు ఒక మెడికల్ కళాశాల కూడా లేదన్నారు. కేసీఆర్ అధికారంలోకి వచ్చిన తర్వాత మూడు మెడికల్ కళాశాలను ప్రకటించారని తెలిపారు. అసెంబ్లీ ఎన్నికల్లో తమ ఓటమికి రెండు కారణాలు ఉన్నాయని.. ఒకటి చేసిన పనిని చెప్పుకోలేదని.. రెండోది కొన్నివర్గాలను దూరం చేసుకోవడంతోనే ఓడిపోయామని చెప్పుకొచ్చారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో రైతులు నాట్లు వేస్తున్నప్పుడు రైతు బంధు వచ్చింది.. కానీ కాంగ్రెస్ ప్రభుత్వంలో రైతులకు ఓట్లు వేస్తున్నప్పుడు మాత్రమే రైతు బంధు వేస్తున్నారని కేటీఆర్ ఆరోపించారు

# ప్రజా సమస్యలను పరిష్కరిస్తాం: మంత్రి పొంగులేటి



తెలంగాణ బ్యూరోప్రతినిధి: ఖమ్మం రూరల్ మండలం, రెడ్డిపల్లి, పోలేపల్లి) లో నిర్వహించిన ప్రజా సమస్యలపై ప్రజల వద్దకే శ్రీనన్న కార్యక్రమంలో రెవెన్యూ శాఖ మంత్రి పొంగిలేటి శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సమావేశంలో ప్రజలనుంచి మంత్రి సమస్యలు అడిగి తెలుసుకుంటున్నారు. గ్రామాల్లో సమస్యలపై మంత్రి శ్రీనివాస్ రెడ్డికి వినతిపత్రాలు అందజేసిన ప్రజలు. సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తానని ప్రజలకు మంత్రి శ్రీనివాస్ రెడ్డి తెలియజేశారు. మీ అందరి దీవెనలతో ఎమ్మెల్యేగా గెలిచానని, తెలంగాణలో మార్పు కావాలని ఇందిరమ్మ రాజ్యం తెచ్చుకున్నామని, ఇళ్ళు లేని ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇళ్ళు ఇస్తామని మంత్రి పొంగులేటి స్పష్టం చేశారు. గ్రామంలో ఉన్న పాఠశాల, రోడ్లు, కమ్యూనిటీ హాల్ నిర్మాణం త్వరలోనే పూర్తి చేపిస్తామన్నారు. త్వరలోనే అర్హులైన ప్రతి ఒక్కరికీ రేషన్ కార్డులు, పెన్షన్లు ఇస్తామన్నారు. పాలేరు నియోజకవర్గం తన సొంత ఇల్లు అని, ఎన్నికల కోడ్ అయిపోగానే నియోజకవర్గంలో అభివృద్ధి పనులు మొదలవుతాయన్నారు. అడిగిన సమస్యలే కాకుండా అడగని సమస్యలు కూడా పరిష్కరిస్తాని చెప్పారు. ప్రజలు అడిగిన కోరికలు తీర్చే బాధ్యత తనదన్నారు. భవిష్యత్లో ఏ సమస్య వచ్చినా ఇందిరమ్మ కమిటీ ద్వారా తనకు తెలియచేయాలని, ప్రజలందరూ సంతోషంగా ఉండాలని మీ పెద్ద కొడుకుగా పనిచేస్తానని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు.

## నా డాక్యుమెంట్స్ ఫేక్ అని నిరూపిస్తే

# రాజీనామా చేస్తా

## ప్రభుత్వ విప్‌కు మాజీ మంత్రి మల్లారెడ్డి సవాల్



తెలంగాణ బ్యూరోప్రతినిధి: సుచిత్రలో నెలకొన్న భూవివాదంపై మాజీ మంత్రి, మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి హాట్ కామెంట్స్ చేశారు. భూమి విషయంలో తన వద్ద ఉన్నవి తప్పుడు డాక్యుమెంట్స్ అని కాంగ్రెస్ నేతలు ఆరోపించడంపై తీవ్రంగా స్పందించారు. తన డాక్యుమెంట్స్ ఫేక్ అని నిరూపిస్తే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసేందుకు తాను సిద్ధం అని ప్రకటించారు మల్లారెడ్డి. తనపై ఆరోపణలు చేసిన ప్రభుత్వ విప్ లక్ష్మణ్ సిద్ధమా? అని ప్రశ్నించారు. భూమి విషయంలో తన తప్పు ఉందని నిరూపిస్తే అన్నీ వదిలేసి పోతానని అన్నారు. ఈ భూమి విషయంలో వారివే ఫోర్జరీ డాక్యుమెంట్స్ అని ఆరోపించారు మల్లారెడ్డి. ఇదే విషయమై ఆదివారం నాడు మీడియాతో మాట్లాడిన మల్లారెడ్డి.. సర్వే ఇప్పుడే పూర్తయ్యింది కదా.. రిపోర్ట్ వచ్చే వరకు అందరూ వెయిట్ చేయాలన్నారు. సోమవారం నాడు సీఎం రేవంత్ రెడ్డి, రెవెన్యూ మంత్రి, కలెక్టర్లను కలుస్తానని.. తన వద్దనున్న ఒరిజినల్ డాక్యుమెంట్స్ని వారికి చూపిస్తానని మల్లారెడ్డి చెప్పారు. మల్లారెడ్డి భూ వివాదంపై దర్యాప్తు కొనసాగుతోంది. సుచిత్రలో మల్లారెడ్డి భూవివాదంపై రెవెన్యూ అధికారులు సర్వే నిర్వహించారు. ఇరువురి సమక్షంలో పూర్తిగా హద్దులను సర్వే చేశారు అధికారులు. సర్వే నెంబర్ 82, 83ను సర్వే విస్తీర్ణాన్ని రెవెన్యూ అధికారులు గుర్తించారు. ఈ సర్వే రిపోర్ట్ను సిద్ధం చేసే పనిలో అధికారులు నిమగ్నమయ్యారు. కాగా, ల్యాండ్ తమదేనంటూ ఇరు వర్గాల వ్యక్తులు డిమాండ్ చేస్తున్న నేపథ్యంలో.. రెవెన్యూ అధికారుల రిపోర్ట్ కీలకంగా మారింది.

**మల్లారెడ్డిపై ధర్మపురి కాంగ్రెస్ ఎమ్మెల్యే లక్ష్మణ్ ఫైర్ :** సుచిత్రలోని భూ వివాదంలో ఎమ్మెల్యే లక్ష్మణ్ పేరును మల్లారెడ్డి ప్రస్తావించారు. దీంతో ఇవాళ లక్ష్మణ్ స్పందించారు. మీడియాతో మాట్లాడిన ఆయన.. శనివారం జరిగిన వివాదంలో తన పేరును ప్రస్తావించడంతోనే తాను మీడియా ముందుకు వచ్చానని క్లారిటీ ఇచ్చారు. మల్లారెడ్డి మంత్రిగా ఉన్న సమయంలో అధికారాన్ని అడ్డుపెట్టుకొని దౌర్జన్యంగా భూమిని అక్రమించారని ఆరోపించారు. తాము కొన్న భూమిని ఫేక్ డాక్యుమెంట్లు అని మల్లారెడ్డి చెప్తున్నారని అన్నారు. కోర్టు ఇచ్చిన ఇంజక్షన్ ఆర్డర్ను వెకేట్ చేయించుకోలేదన్నారు. గతంలో తాము పోలీసులకు, మున్సిపల్ కమీషనర్కు పిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోలేదని లక్ష్మణ్ ఆరోపించారు. సర్వే అనంతరం చట్టప్రకారం రెవెన్యూ అధికారుల నిర్ణయానికి కట్టుబడి ఉంటామని స్పష్టం చేశారు లక్ష్మణ్. తమ ప్రభుత్వంపై బురద జల్లడం మంచి పద్దతికాదని మల్లారెడ్డికి హితవు చెప్పారు లక్ష్మణ్.

**సిట్టింగ్ జడ్జితో విచారణ జరపాలి :** మల్లారెడ్డి భూ కబ్జాలపై సిట్టింగ్ జడ్జితో విచారణ చేపట్టాలని ప్రభుత్వాన్ని కోరతామని ఎమ్మెల్యే లక్ష్మణ్ తెలిపారు. గత ప్రభుత్వం మల్లారెడ్డి గుండాయిజం చేసారని ఆరోపించారు. ప్రస్తుతం వివాదం నడుస్తున్న భూమిలో తనకు కేవలం 600 గజాల స్థలం మాత్రమే ఉందన్నారు. మల్లారెడ్డి నోరు పెద్దదిగా చేస్తే ఎవరు భయపడరన్నారు. ల్యాండ్ లోకి పోవద్దని ఇంజక్షన్ ఆర్డర్లో ఉన్నా.. మల్లారెడ్డి లెక్క చేయలేదని, ల్యాండ్ లోకి వెళ్ళారని ఆరోపించారు. సర్వే ప్రకారం తమ ల్యాండ్ తమకు వస్తుందని ఆశిస్తున్నామన్నారు. 4000 గజాలు తప్ప మిగతా ల్యాండ్తో తమకు అనవసరం లేదని లక్ష్మణ్ స్పష్టం చేశారు. ఈ విషయంలో మల్లారెడ్డి కావాలనే కాంగ్రెస్ పార్టీ మీద బురద చల్లుతున్నారని ఆరోపించారు. 2015లో ఈ ల్యాండ్ సర్వే అవసరం లేదని మల్లారెడ్డి అడ్డుకున్నారని లక్ష్మణ్ ఆరోపించారు. తమ వద్ద ఉన్న డాక్యుమెంట్లు కరెక్ట్ కాకపోతే ఈ ల్యాండ్ వదిలిపెడతామన్నారు. ల్యాండ్ విషయంలో కోర్టు నోటీసులు జారీ చేసినా మల్లారెడ్డి ఎందుకు స్పందించడం లేదని లక్ష్మణ్ ప్రశ్నించారు. త్వరలో మల్లారెడ్డి దొంగతనం, ఆయన అసలు బండారం బయటపడుతుందన్నారు. ఈ ప్రభుత్వం చట్టం ప్రకారం పోతుందన్నారు. మల్లారెడ్డి ఇంకా మంత్రి పదవిలో ఉన్నట్టు వ్యవహరిస్తున్నారని విమర్శించారు. తాము చట్టాన్ని గౌరవిస్తామని.. మల్లారెడ్డి లాగా చట్టాన్ని వ్యతిరేకించమని ఎమ్మెల్యే లక్ష్మణ్ వ్యాఖ్యానించారు.

# కాంగ్రెస్ ప్రభుత్వం హామీలను నెరవేర్చాలి

● ఆదాయం కోసం రిజిస్ట్రేషన్ లో ఛార్జీలు పెంచారు ● బిల్డింగ్ పర్మిషన్ కి చదరపు అడుగుకి 75 రూపాయలు వసూలు చేస్తున్నారు ● రేవంత్ ఇచ్చిన హామీలు అమలు చేయలేరు ● ఏదిపడితే అది చెప్పి తప్పించుకుంట అంటే ప్రజలు నీ



భరతం పడతారు ● అతి తక్కువ కాలంలో ప్రజలచేత వ్యతిరేకత ఎదుర్కొన్న సీఎం రేవంత్ రెడ్డి ● కమీషన్ల దుకాణాలు ఓపెన్ చేశారు ● ఈటల రాజేందర్

తెలంగాణ బ్యూరో, ప్రతినిధి: కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని బిజెపి సీనియర్ నాయకులు ఈటెల రాజేందర్ డిమాండ్ చేశారు గ్రాడ్యుయేట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వపరమైన ఆదాయాన్ని పెంచేదానికంటే వాళ్ళ ఆదాయం ఎలా పెంచుకోవాలో ఆలోచన చేస్తున్నారు. హైదరాబాద్ లో బిల్డింగ్ కన్స్ట్రక్షన్ లో ఎస్.ఎఫ్.టి కి 75 రూపాయలు వసూలు చేయాలని ఫిక్స్ అయిందని, రైట్ రాయల్ ట్యాక్స్ లెక్క ముగ్గురు మనుషులని పెట్టి వారు చెప్తేనే పర్మిషన్ ఇచ్చేటట్లుగా.. ఆ ముగ్గురికి డబ్బులు చెల్లించాలని నిర్ణయం జరిగినట్టు తెలుస్తుందన్నారు.పెరుగుట విరుగుట కొరకైనట్లు కేసీఆర్ కూడా ఇలానే చేసి ఖతమయ్యారు. కెసిఆర్ జుట్టులో నుంచి పుట్టిన అంటే ఏదో అనుకున్నాం.. రేవంత్ రెడ్డి ఇదేనా నువ్వు చేసే పని. పోయేకాలం ఇలానే ఉంటుందన్నారు. అతి తక్కువ కాలంలో అతి ఎక్కువ డబ్బులు వసూలు చేసింది రేవంత్ రెడ్డి నే. రిజిస్ట్రేషన్ ఆదాయం కోసం భూముల రేట్లు పెంచాలనే ఆలోచన సరి అయినది కాదన్నారు. ప్రధానమంత్రి, హోంమంత్రి ఇక్కడికి వచ్చి తెలంగాణలో డబుల్ ఆర్ టాక్స్ వసూలు చేయబడుతుంది.. 360 డిగ్రీస్ లో పరిశీలన చేస్తున్నాం కేర్ ఫుల్ గా ఉండండి అని ఇప్పటికే హెచ్చరికలు చేసి వెళ్లారు. కాంగ్రెస్ పార్టీ తన నైజాన్ని, పాత స్వభావాన్ని మళ్లీ ప్రదర్శిస్తుంది. ఇచ్చిన హామీలు అమలు చేయడం దేవుడు ఎరుగు కానీ మహిళలకు 2500 రూపాయల ఊసేలేదు. నాలుగువేల పెన్షన్ మాటే లేదు. రెండు లక్షల రూపాయల రుణమాఫీ చేస్తానన్న తన మాట విశ్వసించరని దేవుళ్ళ మీద ఒట్టుపెట్టి చెప్తున్నారు. రూపాయి ఖర్చు కానీ రేషన్ కార్డు కూడా ఇవ్వలేక అభాసు పాలైనారని అసహ్యించుకుంటున్నారు. బిల్డింగ్ ల కోసం, భూముల విషయంలో ఇచ్చిన రిలాక్షేశన్ విషయంలో పాతవారిని మళ్లీ పిలిపించుకొని పాత ప్రభుత్వం 100 రూపాయలు వసూలు చేస్తే ఈయన 200 రూపాయలు వసూలు చేస్తూ డబ్బుల వసూళ్లకు పాల్పడుతున్నారు. మున్సిపల్ శాఖ ముఖ్యమంత్రి దగ్గరే ఉంది ఇప్పటివరకు ఒక అనుమతి ఇవ్వడం లేదన్నారు. రియల్ ఎస్టేట్ కుప్పకూలిపోయిందని,ప్రభుత్వ ఆదాయ వనరులు రోజురోజుకు తగ్గిపోతున్నాయి. రిజిస్ట్రేషన్లు తగ్గిపోయాయి. తెలంగాణ ఆర్థిక ప్రగతి పురోగమనంలో కాకుండా మందగించిపోయింది. కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసే పరిస్థితి ఏది.శాసనమండలిలో కాంగ్రెస్ పార్టీని నిలదీసే శక్తి ఒక్క బిజెపికి మాత్రమే ఉంది. సీఎం రేవంత్ రెడ్డి, ఆయన మంత్రివర్గ సహచరుల కుటుంబాలు ఇన్వాల్వ్ అవుతున్నాయి. సర్పంచులు చేసిన పనులకు, కాంట్రాక్టు పనులు చేసిన వారికి బిల్లులు రావడం లేదు. 10% లంచాలు ఇస్తే తప్ప బిల్లులు రాని పరిస్థితి ఉందన్నారు. డబ్బులు తప్ప వేరే పని లేదు.అతి తక్కువ కాలంలో అతి ఎక్కువ డబ్బులు వసూలు చేస్తున్నారు. అన్ని డిపార్ట్మెంట్ల వారు దుకాణాలు ఓపెన్ చేశారు. పది సంవత్సరాల కరువు ఒకేసారి నింపుకునేలా పోటీపడుతున్నట్లు కనిపిస్తున్నారు. పంటలు ఎండిపోయినయ్ మోటర్లు, ట్రాన్స్ఫార్మర్లు కాలిపోతున్నాయి అయినా వాటిని పట్టించుకోవడం లేదు. 500 బోనస్ దేవుడు ఎరుగు 40 కిలోల బస్తాకి నాలుగు కేజీలు కటింగ్ పెడుతున్నారు. వారి సొంత పనులు తప్ప రైతులకు మహిళలకు ఏం జరుగుతుందో చూసే నాధుడే లేడన్నారు. బాధ్యత కలిగిన పౌరులుగా పట్టభద్రుల నియోజకవర్గంలో ప్రేమేందర్ రెడ్డిని గెలిపించాలని కోరుతున్నాను. ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూడా యువకులు, చదువుకున్న వారు సంపూర్ణంగా బిజెపిని ఆశీర్వదించి గెలిపిస్తారని విశ్వాసం ఉందన్నారు.

# పంచన్ లామా ఎక్కడ?

● ఆచూకీని చైనా ప్రకటించాలని అమెరికా మరోసారి డిమాండ్
● తక్షణమే విడుదల చేయాలన్న అమెరికా విదేశాంగశాఖ



వాషింగ్టన్... అమెరికా-చైనా మధ్య మరోసారి ఉద్రిక్తతలు తలెత్తాయి. టిబెట్ ఆధ్యాత్మిక గురువు కావాల్సిన పంచన్ లామా ఆచూకీని బీజింగ్ ప్రకటించాలని వాషింగ్టన్ డిమాండ్ చేసింది. సురక్షితంగా ఉన్నాడా?లేడా? అన్న విషయాన్ని వెల్లడించాలని కోరింది. హిమాలయాల్లో పంచన్ లామా అదృశ్యమై 29 ఏళ్లు పూర్తన సందర్భంగా జరిగిన కార్యక్రమంలో అమెరికా విదేశాంగశాఖ ప్రతినిధి మాథ్యూ మిల్లర్ ఈ వ్యాఖ్యలు చేశారు. 11వ పంచన్ లామాగా ఎంపికైన బాలుడు గెధున్ చౌకీ నీమాను చైనా అపహరించి నేటికి 29 ఏళ్లు పూర్తయ్యాయి. ఆ చిన్నారి టిబెట్ బుద్ధిజానికి చాలా కీలక వ్యక్తి. కిడ్నాప్నకు గురయ్యే నాటికి ఆ బాలుడి వయసు ఆరేళ్లు. నేటి వరకు బాహ్య ప్రపంచానికి కనిపించలేదు. పంచన్ లామా వద్దకు ఎవరినీ వెళ్లనీయడంలేదు. ఆ స్థానంలో మరో బాలుడిని తీసుకొచ్చింది. పీఆర్సీ అధికారులు తక్షణమే గెధున్ ఆచూకీ వెల్లడించాలి. అతడి మానవ హక్కులను కాపాడాలి. తక్షణమే బేషరతుగా పంచన్ లామాను విడుదల చేయాలి అని అమెరికా విదేశాంగ శాఖ డిమాండ్ చేసింది.

**కిడ్నాప్.. కుట్ర కథ ఇదీ :** 1950లో చైనా టిబెట్పై ఆక్రమణ ప్రారంభించింది. 1959లో టిబెట్ తిరుగుబాటు చేసింది.. అది విఫలం కావడంతో అక్కడి బౌద్ధ మత గురువు దలైలామా భారత్కు శరణార్థిగా వచ్చారు. ఆయన ధర్మశాలలో ఆశ్రయం పొందుతున్నారు. ఆయన తర్వాతి స్థానంలో ఉన్న 10వ పంచన్ లామా లోబ్సాంగ్ గ్యాల్సెన్ మాత్రం టిబెట్లోనే ఉండిపోయారు. మరోపక్క చైనా ఆగడాలను దలైలామా ప్రపంచ వ్యాప్తంగా వెల్లడించడం మొదలుపెట్టారు. దీంతో భవిష్యత్తులో దలైలామా స్థానాన్ని కబ్జా చేయాలని చైనా భావించింది. ఈ దలైలామా ఎంపికలో పంచన్ లామా పాత్ర చాలా కీలకం. 1989లో టిబెట్లోనే ఉండిపోయిన పంచన్ లామా అనుమానాస్పద స్థితిలో మరణించారు. ఆయనపై విష ప్రయోగం చేశారంటారు. దలైలామా 1995 మే 14న ఆరేళ్ల బాలుడైన గెధున్ చోకీ నీమా పేరును 11వ పంచన్ లామాగా ప్రకటించారు. దీంతో చైనా ఆగ్రహం కట్టలు తెంచుకొంది. సరిగ్గా మూడు రోజుల తర్వాత చైనా సైన్యం ఆ బాలుడిని కిడ్నాప్ చేసింది. అప్పటి నుంచి అతడు ఎక్కడ ఉన్నాడో ఎవరికీ తెలియదు.

# ఆకాశంలో రాకాసి ఉల్క

● రాత్రిని పగలుగా మార్చేంత వెలుగు..!
● స్పెయిన్, పోర్చుగల్ గగనతలంలో ఘటన

పోర్చుగల్: స్పెయిన్, పోర్చుగల్ గగనతలంలో ఓ అరుదైన దృశ్యం ఆవిష్కృతమైంది. ఓ భారీ నీలిరంగు ఉల్క భూమిపై పడింది. ఆ సమయంలో వచ్చిన వెలుగు పగలును తలపించింది. ఒక్కసారిగా చోటు చేసుకొన్న ఈ ఘటనతో ప్రజలు ఆశ్చర్యపోతున్నారు. ఈ వెలుగు కొన్ని వందల కిలోమీటర్ల దూరం కనిపించినట్లు వార్తలొస్తున్నాయి. ఈ ఉల్కా ఎక్కడ నేలను తాకిందో ఎవరూ కచ్చితంగా చెప్పలేకపోతున్నారు. ఇది క్యాస్ట్రో డైరో ప్రాంతంలో పడినట్లు ప్రచారం జరుగుతోంది. వివరాలు పూర్తిగా వెల్లడికావాల్సి ఉంది.

ఇక దీనికి సంబంధించిన పలు వీడియోలు నెట్టింట వైరల్గా మారాయి. 2013లో కూడా రష్యాలోని చెల్యాబిన్స్క అనే ప్రాంతంలో ఇంతకంటే పెద్ద స్థాయి ఉల్కలు పడ్డాయి. అప్పట్లో ఆ ఉల్కలు భారీగా ఉన్నాయని శాస్త్రవేత్తలు వెల్లడించారు. అందుకే ఆ స్థాయిలో నిప్పులు వచ్చాయని పేర్కొన్నారు. అది 500 కిలో టన్నుల టీఎన్టీకి సమానమైన శక్తిని విడుదల చేసిందని అంచనావేశారు.

## మరోసారి గన్నవరం ఎయిర్ పోర్ట్‌లో

# డాక్టర్ లోకేష్ హల్ చల్



గన్నవరం... సీఎం జగన్ విదేశాలకు వెళ్ళే సమయంలో ఎయిర్ పోర్ట్ లో అనుమానాస్పదంగా సంచరించిన డాక్టర్ లోకేష్ ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. 151 సెక్షన్ కింద కేసు నమోదు చేశారు. గుండె పోటనడంతో పోలీసులు అతడిని ఆస్పత్రిలో చేర్పించారు. నేడు ఢిల్లీ వెళ్లేందుకు డాక్టర్ లోకేష్ మళ్లీ గన్నవరం ఎయిర్ పోర్ట్ వచ్చారు. లోకేష్ తో శాటిలైట్ ఫోన్ గుర్తించిన ఎయిర్ పోర్ట్ సిబ్బంది దానిని స్వాధీనం చేసుకున్నారు. ఎయిర్ పోర్ట్ స్టాఫ్ గన్నవరం పోలీసులకు సమాచారం అందించారు. శాటిలైట్ ఫోన్ వినియోగానికి ఇక్కడ అనుమతి లేకపోవటంతో ఫోన్ సీజ్ చేశారు పోలీసులు. కేసు నమోదుపై లీగల్ ఒపీనియన్ తీసుకుంటున్నారు. కాగా..ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి తన విదేశీ పర్యటన సందర్భంగా లండన్ వెళ్లే సమయంలో గన్నవరం ఎయిర్పోర్టులో శుక్రవారం రాత్ర కలకలం రేగింది. ఓ వ్యక్తి అనుమానాస్పదంగా సంచరిస్తూ పోలీసులకు పట్టుబడ్డ విషయం తెలిసిందే. అతన్ని అదుపులోకి తీసుకున్న పోలీసులు.. వెంకటాయపాలెనికి చెందిన ఎన్ఆర్ఐగా గుర్తించారు. అయితే పోలీసులు తనను అకారణంగా అదుపులోకి తీసుకున్నారని డాక్టర్ లోకేష్ కుమార్ ఆరోపిస్తున్నారు. సీఎం అవినీతిని ప్రశ్నించాననే కారణంతోనే అదుపులోకి తీసుకుని హింసించారని ఆరోపించారు. ఇక గన్నవరం విమానాశ్రయంలో ఏం జరిగిందో కూడా డాక్టర్ లోకేష్ కుమార్ వెల్లడించారు. ఎయిరిండియా విమానంలో ఢిల్లీకి వెళ్లి అక్కడి నుంచి అమెరికా వెళ్లేందుకు.. గన్నవరం ఎయిర్ పోర్టుకు వెళ్లినట్లు లోకేష్ కుమార్ తెలిపారు.



# అత్యుత్సాహం...
# విధ్వంస కారకం

■ ఎన్నికల కమిషన్ ఆదేశాలు గాలికొదిలేసిన అధికారులు

■ చరిత్రలో తొలిసారి పోలీసులపైనే సిట్



**ఐదేళ్లకోసారి వచ్చే ఎన్నికల్లో ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్నాయి రాజకీయ పార్టీలు. ఐదేళ్ల కోసం అధికారంలోకి వచ్చి ఎన్నికల నోటిఫికేషన్ రాగానే ఎన్నికల నిబంధనలను మరిచిపోయి ఇంకా తామే అధికారంలో ఉన్నామన్న ధీమాలో రెచ్చిపోతున్నారు రాజకీయ పార్టీల శ్రేణులు. ఫలితంగా శాంతి భద్రతలకు విఘాతం కలుగుతుంది. ఎన్నికల నిబంధనలను అతిక్రమించి లా అండ్ ఆర్డర్‌ను తమ చేతిలోకి తీసుకొని విధ్వంసాన్ని సృష్టించిన వారిపట్ల పోలీసులు తూతూ మంత్రంగా చర్యలు తీసుకోవడంతో పరిస్థితి అదుపుతప్పుతోంది. సరిగ్గా ఆంధ్రప్రదేశ్ ఎన్నికల సందర్భంగా సృష్టించిన అలజడులు ప్రజాస్వామ్యాన్ని అపహాస్యాన్ని చేసే విధంగా తయారు చేశారు. కేంద్ర ఎన్నికల సంఘం రంగంలోకి దిగి విధ్వంసకర సంఘటనలపై ఆగ్రహం వ్యక్తం చేసి ఆదేశాలు జారీ చేసినప్పటికీ రాష్ట్ర స్థాయిలో మాత్రం చర్యలు సక్రమంగా తీసుకోలేరని ఆరోపణలు ఉన్నాయి.**



ఆంధ్రప్రదేశ్ లో ఎన్నికలు, ఆ తర్వాత జరిగిన గొడవలపై పోలీసులపైనే సిట్ పేరుతో విచారణ జరుగుతోంది. పరిస్థితులను చక్కబెట్టడంలో పోలీసులు విఫలమయ్యారనే ఫిర్యాదులు, ఆరోపణలతో ఈసీ ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని రంగంలోకి దించింది. సిట్ విచారణతో అటు పొలిటిషియన్స్, అటు పోలీసులు సైతం వణికిపోతున్నారు. ఏపీలోఎన్నికల సందర్భంగా జరిగిన విధ్వంసకాండపై ఒకరిపై ఒకరు ఆరోపణలు చేసుకుంటున్నారు .వైసీపీ వర్సెస్ ఎన్డీఏ కూటమి నేతల మధ్య మాటలయుద్ధం నడుస్తుంది. ఇప్పుడు వారందరికీ పోలీసులు టార్గెట్ అవుతున్నారు. ఇన్ని విధ్వంసాలకు, గొడవలకు పోలీసులే కారణమని ఆరోపణలు గుప్పిస్తున్నారు. దానికి తగ్గట్టే పలు చోట్ల పోలీసులుకూడా స్వామి భక్తి ప్రదర్శిస్తూ వివాదాల్లో కూరుకుపోతున్నారు. ఎలాంటి చర్యలు తీసుకుంటారో అన్న ఆందోళనలో ఉన్నట్లు తెలుస్తోంది. గతంలోఎన్నడూ కూడా ఇండియన్ సివిల్ సర్వీస్ చరిత్రలో ఇలాంటి ఘటనలు చోటు చేసుకోలేదంటున్నారు. డీజీపీ స్థాయి అధికారిపై ఈసీ చర్యలు తీసుకున్నాకింద స్థాయి సిబ్బందిలో కొందరు మాత్రం వైసీపీ సేవలోనే తరిస్తున్నారు. పోలింగ్ ముగిసాక కూడా అధికారులపై వేటుపడుతుండటమే అందకు నిదర్శనంగా కనిపిస్తుంది. మితిమీరినస్వామి భక్తి ప్రదర్శిస్తూ చిత్తూరు జిల్లాలో పనిచేసిన ఐఏఎస్, ఐపీఎస్లతో పాటు కిందస్థాయి అధికారులు ఇప్పుడు ఫలితం



అనుభవిస్తున్నారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో గతంలో ఎన్నడూ లేని విధంగా నలుగురుఐపీఎస్ అధికారులు, ఇద్దరు ఐఏఎస్ ఆఫీసర్లపై ఈసీ బదిలీ వేటువేసింది.

ఒక ఐఏఎస్ అయితేఏకంగా సస్పెండ్ అయ్యారు. ఇక పోలీస్ అధికారులు అయితే పదుల సంఖ్యలో సస్పెన్షన్ కు గురయ్యారు. కొందరు వీరిలో ఉన్నారు. మూడు సంవత్సరాల క్రితం జరిగిన తిరుపతిపార్లమెంటు ఉప ఎన్నికలకు సంబంధించిగత ఆరు నెలల క్రితంజూలు విదిలించిన ఎన్నికల కమిషన్ అప్పట్లో తిరుపతినగరపాలక సంస్థ కమిషనర్గా పనిచేసిన అన్నమయ్యజిల్లా కలెక్టర్ గిరీషాను ఏకంగా సస్పెండ్ చేసింది.

## ఎస్ఐలు,ఏఎస్ఐలపై సస్పెన్షన్ వేటు

ఆ తర్వాత పోలింగ్ రోజు పోలీస్ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించారని తిరుపతి నగరానికి చెందిన ఈస్ట్ సీఐ శివప్రసాద్ రెడ్డి,వెస్ట్ సీఐ శివప్రసాద్ తోపాటు మరో ఇద్దరు ఎస్ఐలు, ఏఎస్ఐలపై సస్పెన్షన్ వేటు వేసింది. వారితోపాటుదొంగ ఓట్లపై ఫిర్యాదులు ఇచ్చినా పట్టించుకోలేదని ఇద్దరు సీఐలు అబ్బన్న ,చక్రధర్లను వీఆర్కుపంపింది. తర్వాతజరిగిన పరిణామాల్లో డిప్యూటీ మున్సిపల్ కమిషనర్ చంద్రమౌళిరెడ్డితో పాటు కంప్యూటర్ ఆపరేటర్లముగ్గురిపై క్రిమినల్ కేసులో నమోదు చేయమని ఎన్నికల కమిషన్ ఆదేశాలు జారీ చేశారు ఎన్నికలసంఘం అధికారులు ఉమ్మడి చిత్తూరు జిల్లాలో చిత్తూరు ఎస్పీగా వచ్చిన జాషువా టీడీపీ నేతలపై అక్రమంగా రౌడీ షీట్లు ఓపెన్చేస్తున్నారని ఎన్నికల కమిషన్ ఫిర్యాదులు అందడంతో ఆయన్ని తప్పించారు. అంతకుమునుపు ఎస్పీగా పనిచేసిన నిశాంత్ రెడ్డిని కూడా ఎన్నికల విధులకుదూరంగా ఉంచాలని ఆదేశాలు జారీ చేశారు.

వారితోపాటుచిత్తూరులో ఎస్బీ సిఐగా ఉన్న గంగిరెడ్డిని కూడాఎన్నికల విధులకు దూరం చేశారు. మితిమీరిన స్వామి భక్తి ఇక తిరుపతిజిల్లాలో అయితే మితిమీరిన స్వామి భక్తితో అధికారులు పనిచేశారని ప్రతిపక్షాలు ఆరోపించాయి. అక్కడ పనిచేసిన వెంకటరమణారెడ్డి అనే కలెక్టర్పైఎన్నికల కమిషన్ కు అనేక ఫిర్యాదులువెళ్లాయి. ఆయన తర్వాత వచ్చినలక్ష్మీ షా మీద పదిరోజులకే వేటుపడింది. ఇదే సమయంలో ఎస్పీపరమేశ్వర్ రెడ్డి మీద ఎన్నికల కమిషన్ఒంగోలు ఎస్పీగా ఉన్న సమయంలో వేటువేసింది.

మరోవైపు పరమేశ్వర్ రెడ్డి స్థానంలో వచ్చిన మల్లికార్జున కర్గే చెప్పినట్లు వినడం లేదని, వైసీపీ సర్కారు ఆమెను వారం రోజులకే తప్పించింది. ఆమెస్థానంలో కృష్ణకాంత్పాటిల్ అనే యువ ఐపీఎస్అధికారిని తీసుకొచ్చారు. అయితే ఆయన పైఅధికారులు చెప్పినట్లువినడం తప్ప సొంతంగా నిర్ణయంతీసుకోలేకపోయారన్న విమర్శలు వచ్చాయి.

## అమలు కాని వెబ్ కాస్టింగ్

ముఖ్యంగాఈసీ అత్యంత సమస్యాత్మకంగా గుర్తించిన పోలింగ్ బూత్లను వందశాతం వెబ్ కాస్టింగ్ చేసి..అక్కడ ఆర్మ్ పోలీసులను ఉంచాలనిఅదేశాలు జారీ చేసినా ఆచరణలోఅమలు కాలేదు. ఆ క్రమంలో ఎన్నికలకురెండు రోజులు ముందు ఐదుగురు సీఐలను ఎన్నికల విధులకు దూరంగా ఉంచాలని వారిని అనంతవురం పంపించారు. తిరుమలవన్ టౌన్ సీఐగా పనిచేసినజగన్మోహన్ రెడ్డి, పలు వివాదాల్లో ఇరుక్కున్న అంజూయాదవ్, వినోద్ కుమార్, శ్రీనివాసులు లాంటి వారు రెగ్యులర్ పోస్టింగ్లో లేకపోయినప్పటికీ మొత్తం యంత్రాంగాన్ని వారి నడిపిస్తున్నారనే విమర్శలుఉన్నాయి.

మరోవైవుఎస్బీ సీఐ, డీఎస్పీలతో పాటు అలిపిరిఅధికారి రామచంద్రరెడ్డి, తిరుపతిడీఎస్పీ సురేందర్ రెడ్డిలు ఏకపక్షంగా వ్యవహరించారని ఫిర్యాదులు వెల్లువెత్తాయి. చంద్రగిరి నియోజకవర్గంలో బిఎస్ జవాన్లు ఫైరింగ్ చేయడం. కూచువారిపల్లి గ్రామంలో మహిళల మీద దాడులు ఇవన్నీస్థానికపోలీసుల పనితీరుకు అద్దం పట్టాయి.

## స్ట్రాంగ్ రూమ్స్ ప్రాంగణంలో రౌడీ మూకలు

వీటన్నిటిని మించి స్ట్రాంగ్ రూమ్స్ ఉన్న పద్మావతి మహిళాయూనివర్సిటీ ప్రాంగణంలో రౌడీ మూకలు చంద్రగిరిటీడీపీ అభ్యర్థి వులివర్తి నానిపై చేసిన దాడి దేశవ్యాప్తంగా సంచలనంకలిగించింది. ముఖ్యంగానాని కారు సీసీ వుటేజ్లో దాడి దృశ్యాలుఅందర్నీ ఉలిక్కిపడేలా చేశాయి. సమ్మెటలు, రాడ్లు, రాళ్లు బీరు బాటిల్స్ తోటీడీపీ అభ్యర్థి మీద దాడి చేయడం.గన్ మ్యాన్ కాల్పులు ఫ్యాక్షన్ మూవీని తలపించాయి. ఆ దాడిపై టీడీపీకార్యకర్తలు ఆగ్రహం వ్యక్తం చేస్తుంటే, వారిని





శాంతిపచేయకుండా గంటలపాటు వదిలేసి, ఆ తర్వాత వారిమీద లాఠీ చార్జి చేయడంఅనేక విమర్శలకు దారితీసింది. దీనిపైన ఎన్నికల కమిషన్ తో పాటు గవర్నర్వరకు ఫిర్యాదులు వెళ్లడంతో మరోసారి నలుగురు పోలీస్ అధికారులపై వేటు పడింది. దాంతోమరోసారి ఎస్పీ బదిలీ అయ్యార. రెండు నెలల కాలంలో ముగ్గురుఎస్పీలకు ఒక తిరుపతిజిల్లాలోనే బదిలీ అవ్వడం గమనార్హం. మొత్తంమీద తిరుపతిజిల్లా అంటే అక్కడ పనిచేయడానికిఅందరూ భయపడే పరిస్థితులు ఏర్పడ్డాయిప్పుడు. ఎన్నికల కమిషన్ దెబ్బకు ఉమ్మడి చిత్తూరు జిల్లా వ్యాప్తంగా పక్షపాతంతో వ్యవహరించే అధికారులకు షాక్ ట్రీట్మెంట్ఇచ్చినట్లైందన్న చర్చ జరుగుతుంది.

## శరవేగంగా దర్యాప్తు

ఏపీలో అల్లర్లు జరిగిన చిత్తూరు, అనంతవురం, పల్నాడు జిల్లాలపై సిట్ బృఎందం శరవేగంగా దర్యాప్తు చేస్తోంది. నిన్న నరసరావుపేటలో 8 గంటలపాటు అధికారులు కేసులను పరిశీలించారు. ఈరోజు చంద్రగిరి, తాడిపత్రి, మాచర్ల, గురజాల, నరసరావుపేటలో పర్యటించి వివరాలు సేకరించనున్నారు. పోలింగ్ రోజు ముందు నుంచి నిన్నటి వరకు జరిగిన గొడవలకు సంబంధించిన ప్రతి ఎఫ్ఐఆర్ను పరిశీలిస్తున్నారు. ఇప్పటికే ప్రాథమిక విచారణ పూర్తి చేసిన అధికారులు.. 5 రోజులపాటు దర్యాప్తు చేయనున్నారు.ఇప్పటికే మరి కొందరు పేర్లను చేర్చి దర్యాప్తు చేస్తున్నారు. గొడవల సెక్షన్ కింద నమోదైన సెక్షన్లను మార్చే ప్రయత్నాలు జరుగుతున్నట్లు సమాచారం. పల్నాడు జిల్లాలో సిట్ అధికారులు విచారణ చేపట్టారు. నరసారావుపేట మండలం దొండపాడు, మామిడిపాడు గ్రామాల్లో జరిగిన అల్లర్ల వీడియోలను పరిశీలిస్తున్నారు. నరసరావుపేట రూరల్ పోలీస్ స్టేషన్లో విచారణ ముగిసిన అనంతరం.. సిట్ అధికారి సౌమ్య లత వన్ టౌన్ పోలీస్ స్టేషన్ లో అల్లర్ల వీడియోలను పరిశీలించారు. ఎన్నికల రోజు తిరుపతి జిల్లా చంద్రగిరిలో జరిగిన ఘర్షణల పై ఎన్నికల కమిషన్ ఏర్పాటు చేసిన సిట్ బృఎందం కూచివారిపల్లి గ్రామాన్ని పరిశీలించింది. ముందుగా సర్పంచ్ కొటాల చంద్రశేఖర్ రెడ్డి గృఎహాన్ని పరిశీలించారు.

చంద్రశేఖర్ రెడ్డి ఇంటితోపాటు కార్ను కూడా దగ్ధం చేసిన నేపథ్యంలో వాటిని పరిశీలించారు. తర్వాత కూచివారిపల్లిలోని గ్రామస్తులతో సమావేశమయ్యారు. గొడవలు మొదట ఏ విధంగా ప్రారంభమయ్యాయి అన్న విషయాన్ని సిట్ డీఎస్పీ రవి మనోహరాచారి తెలుసుకున్నారు. పూర్తి సమాచారాన్ని సిట్ చైర్మన్కు అందజేస్తానని తెలిపారు. కొసమెరువు ఏమిటంటే స్వామి భక్తి ప్రదర్శించిన అధికారులు కోట్ల రూపాయలు



వెనుకేసుకు వెళ్లారంట ఓ పోలీసు అధికారితన కుటుంబ సభ్యుల పేరుతో ఐదు ఎకరాల క్వారీలీజులు తీసుకోగా మరో ఇద్దరు పోలీసుఅధికారులు ఒకొక్కరు ఐదు కోట్ల రూపాయలవిలువైన భవనాలు నిర్మించుకున్నారంట. అందుకే వారంతా అంత స్వామిభక్తి ప్రదర్శించారంటున్నారు.

విద్య వెంకట్, తెలంగాణ బ్యూరో 9391618181



## చరిత్ర సృష్టించిన ఆర్సీబీ.. సన్‌రైజర్స్ రికార్డ్ బద్దలు!

రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు(ఆర్సీబీ) చరిత్ర సృష్టించింది. ఐపీఎల్ చరిత్రలోనే ఓ సీజన్లో 150 సిక్సు బాదిన తొలి జట్టుగా ఆర్సీబీ చరిత్రకెక్కింది. ఐపీఎలే కాకుండా ఓ టీ20 టోర్నీలోనే ఓ జట్టు 150 సిక్సు బాదడం ఇదే తొలిసారి. ఐపీఎల్ 2024 సీజన్లో భాగంగా చెన్నై సూపర్ కింగ్స్తో శనివారం జరిగిన డూ ఆర్ డై మ్యాచ్లో ఆర్సీబీ ఈ ఫీట్ సాధించింది. ఈ మ్యాచ్లో ఆర్సీబీ మొత్తం 16 సిక్సు బాది ఈ ఘనతను అందుకుంది. ఈ క్రమంలో సన్రైజర్స్ హైదరాబాద్ పేరిట ఉన్న ఈ రికార్డును అధిగమించింది. ఇప్పటి వరకు సన్రైజర్స్ హైదరాబాద్ 146 సిక్సతో ఈ జాబితాలో టాప్లో ఉండగా.. ఆర్సీబీ అధిగమించింది. ఆర్సీబీ బ్యాటర్లలో విరాట్ కోహ్లీ, రజత్ పటీదార్ నాలుగేసి సిక్సు బాదగా.. ఫాఫ్ డుప్లెసిస్, కామెరూన్ గ్రీన్ మూడేసి సిక్సర్లు కొట్టారు. దినేశ్ కార్తీక్, గ్లేన్ మ్యాక్స్వెల్ చెరొక సిక్సర్ బాదారు. ఈ మ్యాచ్లో ముందుగా బ్యాటింగ్ చేసిన ఆర్సీబీ నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్లకు 218 పరుగులు చేసింది. విరాట్ కోహ్లీ(29 బంతుల్లో 3 ఫోర్లు, 4 సిక్సతో 47), గ్లేన్ మ్యాక్స్వెల్(5 బంతుల్లో 2 ఫోర్లు, సిక్సో 16), ఫాఫ్ డుప్లెసిస్(39 బంతుల్లో 3 ఫోర్లు, 3 సిక్సతో 54) విధ్వంసకర బ్యాటింగ్తో చెలరేగారు.
రజత్ పటీదార్(23 బంతుల్లో 2 ఫోర్లు, 4 సిక్సతో 41), కామెరూన్ గ్రీన్(17 బంతుల్లో 3 ఫోర్లు, 3 సిక్సతో 38 నాటౌట్) కీలక ఇన్నింగ్స్ ఆడారు. చెన్నై బౌలర్లలో శార్దూల్ ఠాకూర్ రెండు వికెట్లు తీయగా.. మిచెల్ సాంట్నర్, తుషారా దేశ్పాండే తలో వికెట్ పడగొట్టారు.
అయితే ఈ మ్యాచ్లో 218 పరుగులు చేయడం ద్వారా ఆర్సీబీ అరుదైన ఘనతను అందుకుంది.
ఓ సీజన్లో అత్యధిక సార్లు 200 ప్లస్ రన్స్ చేసిన జట్టుగా.. ముంబై ఇండియన్స్, కేకేఆర్తో సమంగా నిలిచింది.
ఈ సీజన్లో ఆర్సీబీతో పాటు కేకేఆర్ 6 సార్లు 200 ప్లస్ రన్స్ చేసింది. 2023 సీజన్లో ముంబై ఇండియన్స్ కూడా ఆరు సార్లు 200 ప్లస్ రన్స్ చేసింది.



# రెండో స్థానానికి సన్‌రైజర్స్

● ఉప్పల్ మ్యాచులో 4 వికెట్లు తేడాతో విజయం ● ఈ సీజన్‌లో 8వ విజయం నమోదు
● మరో 5 బంతులు మిగిలి ఉండగానే లక్ష్య ఛేదన ● పంజాబ్ కింగ్స్‌కు తప్పని ఓటమి ● ఇక కేకేఆర్‌పైనే భారం!



ఐపీఎల్ 2024లో లీగ్ స్టేజ్ను టాప్-2తో ముగించడమే లక్ష్యంగా సన్ రైజర్స్ హైదరాబాద్ ముందడుగు వేసింది. ఆదివారం జరిగిన తన చివరి లీగ్ దశ మ్యాచులో పంజాబ్ కింగ్సు ఓడించింది. పంజాబ్ నిర్దేశించిన 215 పరుగుల లక్ష్యాన్ని మరో 5 బంతులు మిగిలి ఉండగానే 4 వికెట్లు తేడాతో గెలుపొందింది. దీంతో పాయింట్ల పట్టికలో టాప్-2లోకి చేరింది. ఇవాళ జరుగుతున్న ఐపీఎల్ 2024 లీగ్ స్టేజ్ చివరి మ్యాచులో కేకేఆర్ చేతిలో రాజస్థాన్ రాయల్స్ ఓడితే.. సన్ రైజర్స్ టాప్-2 బెర్తును ఖరారు చేసుకోనుంది. ఐపీఎల్ 2024లో భాగంగా తన చివరి లీగ్ మ్యాచులో సన్ రైజర్స్ హైదరాబాద్ ఘన విజయం సాధించింది. ఆదివారం హైదరాబాద్లోని ఉప్పల్ వేదికగా జరిగిన మ్యాచులో 4 వికెట్లు తేడాతో విజయం సాధించింది. పంజాబ్ కింగ్స్ నిర్దేశించిన 215 పరుగుల లక్ష్యాన్ని మరో 5 బంతులు మిగిలి ఉండగానే సన్ రైజర్స్ ఛేదించింది. దీంతో ఈ సీజన్లో 8వ విజయాన్ని నమోదు చేసింది. ఫలితంగా పాయింట్ల పట్టికలో టాప్-2లోకి చేరింది. 215 పరుగుల భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన సన్ రైజర్సుకు తొలి బంతికి బిగ్ షాక్ తగిలింది. ఇన్ ఫామ్ బ్యాటర్ ట్రావిస్ హెడ్ను అర్షదీప్ సింగ్ తొలి బంతికే క్లీన్ బౌల్డ్ చేశాడు. కానీ మరో ఓపెనర్ అభిషేక్ శర్మ మాత్రం ఫామ్ కొనసాగించాడు. రాహుల్ త్రిపాఠితో కలిసి స్కోరు బోర్డును పరుగులు పెట్టించాడు. వీరిద్దరూ 30 బంతుల్లోనే 72 పరుగులు జోడించారు. అభిషేక్ శర్మ (28 బంతుల్లో 66 రన్స్), రాహుల్ త్రిపాఠి (18 బంతుల్లో 33 రన్స్)లు ఔట్ అయినా.. నితీశ్ రెడ్డి పరుగుల వేటను కంటిన్యూ చేశాడు. 25 బంతుల్లో 3 సిక్సు సాయంతో 37 రన్స్ స్కోరు చేశాడు. హెన్రిచ్ క్లాసెన్ 26 బంతుల్లో 42 రన్స్ చేశాడు. దీంతో చివరకు సన్ రైజర్స్ మరో 5 బంతులు ముగిలి ఉండగానే 6 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది.
అంతకుముందు బ్యాటింగ్ చేసిన పంజాబ్ కింగ్స్.. నిర్ణీత 20 ఓవర్లలో 214/5 పరుగులు చేసింది. ఓపెనర్లు ప్రభ్ సిమ్రాన్ సింగ్ (45 బంతుల్లో 71 రన్స్), అథర్వ టైడ్ (27 బంతుల్లో 46 రన్స్) చేసి.. ఆ జట్టుకు శుభారంభాన్ని అందించారు. దీంతో 9 ఓవర్లు ముగిసే సరికి పంజాబ్.. 97/0తో నిలిచింది. దీంతో ఈ మ్యాచులో పంజాబ్.. 250 పరుగుల వరకు చేసేలా కనిపించింది. కానీ కట్టుదిట్టంగా బంతులేసిన సన్ రైజర్స్ బౌలర్లు స్వల్ప వ్యవధిలో వికెట్లు తీశారు.

## అప్పుడు జీరో.. ఇప్పుడు హీరో!



జీవితం ఎప్పుడూ ఒకేలా ఉండదు. కష్టాలకు కృంగిపోవద్దు. విజయాలకు పొంగిపోవద్దు. ఇందుకు రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు(ఆర్సీబీ) స్టార్ పేసర్ యశ్ దయాల్ క్రికెట్ ప్రయాణమే నిదర్శనం. గతేడాది ఇదే ఐపీఎల్లో చివరి ఓవర్లో 29 పరుగులను డిఫెండ్ చేయలేకపోయిన యశ్ దయాల్.. తాజా సీజన్లో సంచలన బౌలింగ్తో 17 పరుగులు డిఫెండ్ చేసి ఆర్సీబీని ప్లే ఆఫ్స్ చేర్చాడు.ఏడాది కాలంలోనే యశ్ దయాల్ సక్సెస్ అందుకున్నాడు. గుజరాత్ టైటాన్స్ బౌలర్గా.. కేకేఆర్ సంచలన రింకూ సింగ్ ధాటికి వరుసగా 5 బంతుల్లో 5 సిక్సు సమర్పించుకొని నాడు జీరో అయిన యశ్ దయాల్.. తాజాగా ఆర్సీబీకి చిరస్మరణీయ విజయాన్ని అందించి హీరోగా మారాడు.రింకూ సింగ్ ధాటికి గత సీజన్లో తీవ్ర మానసిక వేదనతో అనారోగ్యానికి గురైన యశ్ దయాల్.. ఆ సీజన్లో మళ్లీ బరిలోకి దిగలేదు. చివరకు గుజరాత్ టైటాన్స్ను కూడా అతన్ని వదిలేసింది. వేలంలో అనూహ్యంగా రూ. 5 కోట్ల భారీ ధరకు ఆర్సీబీ కొనుగోలు చేయడంతో అందరూ విమర్శలు గుప్పించారు. 5 సిక్సు సమర్పించుకున్న బౌలర్కు రూ. 5 కోట్లా? అని సెటైర్లు పేల్చారు.వారి విమర్శలకు తగ్గట్లే యశ్ దయాల్ ఫస్టాఫ్ సీజన్లో దారుణంగా విఫలమయ్యాడు. కానీ సెకండాఫ్ సీజన్లో సంచలన ప్రదర్శనతో ఆర్సీబీ విజయాల్లో కీలక పాత్ర పోషిస్తున్నాడు. సీఎస్కే ప్లే ఆఫ్స్ చేరాలంటే ఆ జట్టుకు ఆఖరి ఓవర్లో 17 పరుగులు అవసరమవ్వగా.. బంతిని అందుకున్న యశ్ దయాల్.. తొలి బంతినే లో ఫుల్టాస్ సంధించాడు.ఈ లడ్డూ లాంటి బంతిని ధోనీ ఫైన్ లెగ్ దిశగా స్టేడియం బయటకు పంపించాడు. అతని భారీ సిక్సర్కు బంతి 110 మీటర్ల దూరంలో పడింది. దాంతో ఆర్సీబీ శిబిరం తీవ్ర నిరాశకు గురైంది. విరాట్ కోహ్లీ తీవ్ర ఆగ్రహానికి గురైంది.తర్వాతి బంతిని నెమ్మదిగా వేసిన యశ్ దయాల్ డేంజరస్ ధోనీని క్యాచ్ ఔట్గా పెవిలియన్ చేర్చాడు. తర్వాతి నాలుగు బంతుల్లో ఒక్క పరుగే ఇచ్చి ఆర్సీబీని ప్లే ఆఫ్స్ చేర్చాడు. ఈ సంచలన ప్రదర్శనతో యశ్ దయాల్ ప్రస్తుతం హీరోగా మారాడు. టాక్ ఆఫ్ ది టౌన్గా నిలిచాడు. యశ్ దయాల్ సంచలన ప్రదర్శనపై స్పందించిన రింకూ సింగ్.. 'ఇదంతా ఆ దేవుడి ప్లాన్ బేబీ'అని అభినందనలు తెలిపాడు.

# దోనీ కొట్టిన భారీ సిక్సరే మనల్ని ప్లే ఆఫ్స్‌కు చేర్చింది!



● ఆర్సీబీ జట్టు విజయంపై దినేశ్ కార్తీక్ ఆసక్తికర విశ్లేషణ
● గెలుపుపై ఆశలు సన్నగిల్లినప్పుడు అదే కీలక పరిణామమని వ్యాఖ్య
● డ్రెస్సింగ్ రూమ్‌లో అతని అభినందన స్పీచ్ వీడియోను ఎక్స్‌లో పోస్ట్ చేసిన ఆర్సీబీ

ఓవైపు వరుణుడి దోబూచులాట.. మరోవైపు గెలుపు సమీకరణాలు.. ఆద్యంతం నరాలు తెగే ఉత్కంఠ.. ఇదీ శనివారం రాత్రి చెన్నై సూపర్ కింగ్స్, రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు మధ్య జరిగిన మ్యాచ్ జరిగిన తీరు. ఈ పోరులో విజయం బెంగళూరునే వరించింది. ప్లే ఆఫ్స్ కు చేరాలంటే కనీసం 18 పరుగుల తేడాతో గెలవాల్సిన మ్యాచ్ ను అనూహ్యంగా 27 పరుగుల తేడాతో గెలిచింది. అయితే తమ జట్టు విజయంపై ఆర్సీబీ ప్లేయర్ దినేశ్ కార్తీక్ ఆసక్తికర విశ్లేషణ చేశాడు. మ్యాచ్ అనంతరం డ్రెస్సింగ్ రూంలో మాట్లాడుతూ సీఎస్ కే మాజీ సారథి మహేంద్రసింగ్ ధోనీ కొట్టిన భారీ సిక్సరే జట్టు గెలిచేందుకు పరోక్షంగా కారణమైందని విశ్లేషించాడు. ఇందుకు సంబంధించిన వీడియోను ఆర్సీబీ తమ ఎక్స్ ఖాతాలో పోస్ట్ చేసింది.
**అసలు ఏం జరిగిందంటే.. :** సీఎస్ కే చివరి ఓవర్ లో 17 పరుగులు (ప్లే ఆఫ్స్ కు చేరాలంటే విజయానికి కాదు) చేయాల్సి ఉంది. యష్ దయాల్ లెగ్ స్టంప్ పై లో ఫుల్ టాస్ గా వేసిన తొలి బంతినే ధోనీ ఫైన్ లెగ్ మీదుగా స్టాండ్స్ లోకి పంపాడు. ఏకంగా 100 మీటర్ల సిక్సర్ బాదాడు. దాంతో అది కాస్తా స్టేడియం రూఫ్ పైనుంచి బయట పడిపోయింది. ఫలితంగా అంపైర్లు మరో బాల్ ను తీసుకున్నారు. అప్పటివరకు ఆడిన బంతి తడిసిపోవడంతో బౌలర్లకు దానితో బౌలింగ్ చేయడం కష్టమైంది. కొత్త బంతి అందుబాటులోకి రావడం వల్ల యష్ దయాల్ బ్యాక్ ఆఫ్ ద హ్యాండ్ స్లోవర్ బాల్స్ వేసేందుకు వీలైంది. అలా అతను వేసిన రెండో బంతికి ధోనీ అవుట్ అవగా చివరి నాలుగు బంతుల్లో దయాల్ కేవలం ఒక్క పరుగే ఇచ్చాడు. దీని గురించే దినేశ్ కార్తీక్ చెప్పుకొచ్చాడు.
**తడవని కొత్త బంతి లభించింది..**
మనకు జరిగిన మంచి విషయం ఏమిటంటే ధోనీ స్టేడియం బయటకు సిక్స్ కొట్టడం. దీనివల్ల మనకు తడవని, బౌలింగ్ కు అనుకూలమైన కొత్త బంతి లభించింది అని దినేశ్ కార్తీక్ చెప్పాడు. ఇందుకు జట్టు సభ్యులంతా అవును అన్నట్లుగా తల ఆడించారు. ఈ సందర్భంగా యష్ దయాల్ బౌలింగ్ పై సరదా కామెంట్ చేశాడు. యష్.. మంచి బౌలింగ్ వేశావు. బ్యాట్స్ మన్ కు ఎలాంటి బంతి వేయాలి అని మనసులో అనుమానం ఉన్నప్పుడు లెగ్ స్టంప్ పై హై ఫుల్ టాస్ వెయ్యి. బంతి తడిగా ఉన్నప్పుడు అనుసరించేందుకు అదో మంచి మంత్రం అంటూ వ్యాఖ్యానించాడు. అలాగే ప్లే ఆఫ్స్ లో నిలవాలంటే గెలవాల్సిన ఆరు మ్యాచ్ లను వరుసగా గెలవడం గొప్ప విషయమని చెప్పాడు. ఈ జట్టును ప్రేక్షకులంతా సుదీర్ఘకాలంపాటు జ్ఞాపకం ఉంచుకుంటారని అన్నాడు. ఈ సందర్భంగా సహచరులను ఉత్సాహపరిచాడు. ఆండీ ఫ్లవర్ (జట్టు హెడ్ కోచ్) లాగా మొహం నీరసంగా పెట్టకండి. నవ్వండి.. ఎంజాయ్ చేయండి.. మందేయండి.. పార్టీ చేసుకోండి.. సరదాగా గడపండి అని కార్తీక్ వ్యాఖ్యానించాడు.

### పాపం.. ఆ భారత బౌలర్‌కు
## రావాల్సిన గుర్తింపు రాలేదు



రాజస్థాన్ రాయల్స్ వెటరన్ పేసర్ సందీప్ శర్మకు రావాల్సిన గుర్తింపు రాలేదని పాకిస్థాన్ మాజీ క్రికెటర్ వసీమ్ అక్రమ్ అన్నాడు. ఎన్నో ఏళ్లుగా నిలకడగా రాణిస్తున్నా.. అతను అనామక బౌలర్గా మిగిలిపోయాడని అభిప్రాయ పడ్డాడు. ఐపీఎల్ 2024 సీజన్లో సందీప్ శర్మ సంచలన ప్రదర్శన కనబరుస్తున్నాడు.
ఇప్పటి వరకు 7.93 ఎకానమీతో 10 వికెట్లు తీసి రాజస్థాన్ రాయల్స్ ప్లే ఆఫ్స్ చేరడంలో కీలక పాత్ర పోషించాడు. ఇప్పటి వరకు 124 ఐపీఎల్ మ్యాచ్లు ఆడిన సందీప్ శర్మ 7.86 ఎకానమీతో 134 వికెట్లు తీసాడు. ఐపీఎల్ చరిత్రలో అత్యంత నిలకడగా రాణించిన బౌలర్గా గుర్తింపు పొందాడు.
అయితే అతని తల రాతో లేక దురదృష్టమో తెలియదు కానీ సందీప్ శర్మకు ఇతర బౌలర్లలా గుర్తింపు దక్కలేదు. దాంతో టీమిండియా తరపున ఆడే అవకాశాన్ని కూడా అతను అందుకోలేదు. ఐపీఎల్ 2022 సీజన్లో అతను అన్సోల్డ్ ఆటగాడిగా కూడా మిగిలిపోయాడు. రీప్లేస్మెంట్ ఆటగాడిగా రాజస్థాన్ రాయల్స్లోకి ఎంట్రీ ఇచ్చిన సందీప్ శర్మ.. సంచలన ప్రదర్శనతో అదరగొడుతున్నాడు.తాజాగా ఓ జాతీయ ఛానెల్తో మాట్లాడిన వసీం అక్రమ్.. సందీప్ శర్మ గురించి ప్రత్యేకంగా మాట్లాడాడు. అతన్ని 2012 అండర్ 19 ప్రపంచకప్లో తొలిసారి చూశానని చెప్పిన వసీం అక్రమ్ అతన్ని స్వింగ్ బౌలింగ్కు ఫిదా అయినట్లు తెలిపాడు. ఆ తర్వాత అతను తన బౌలింగ్లో యార్కర్లు, స్లోయర్ బాల్ను డెవలప్ చేసుకున్నాడు. అయితే అతనికి రావాల్సిన గుర్తింపు మాత్రం రాలేదని చెప్పాడు.'డెత్ ఓవర్లలో సందీప్ శర్మ అద్భుతంగా బౌలింగ్ చేస్తున్నాడు. యార్కర్లతో పాటు స్లోయర్ బాల్తో బ్యాటర్లను ఇబ్బంది పెడుతున్నాడు. కొత్త బంతితో స్వింగ్ కూడా రాబడుతున్నాడు. సందీప్ శర్మను నేను 2012 అండర్ 19 ప్రపంచకప్లో తొలిసారి చూశాను. అప్పుడు బంతిని అద్భుతంగా స్వింగ్ చేశాడు. అయితే అతనికి రావాల్సిన గుర్తింపు అయితే రాలేదు. చివరి ఓవర్లు బౌలింగ్ చేసేవారు స్పెషలిస్ట్ బౌలర్లు అవుతారు. ఎందుకుంటే అలా బౌలింగ్ చేసేవారు చాలా తక్కువగా ఉంటారు. డెత్ ఓవర్లలో బౌలింగ్ చేయడం ప్రత్యేకమైన నైపుణ్యం. అలాంటి స్కిల్ సందీప్ శర్మకు ఉంది. నేను ఐపీఎల్లో కామెంటేటర్గా పని చేసినప్పుడు సందీప్ శర్మ తరుచూ నాతో మాట్లాడేవాడు.బంతితో ఎలా స్వింగ్ రాబట్టాలో అడిగి తెలుసుకునేవాడు. నేను నీ నైపుణ్యాలను మాత్రమే నమ్ముకొని సాధన చేయాలని, వికెట్లు తీయడంపైనే ఫోకస్ పెట్టాలని చెప్పేవాడిని. ప్రస్తుతం అతను స్లోయర్ బౌన్సర్తో పాటు ఔట్సైడ్ ఆఫ్ స్టంప్ యార్కర్ను డెవలప్ చేసుకున్నాడు. దురదృష్టవశాత్తు సందీప్ శర్మ టీ20 ప్రపంచకప్కు ఎంపికవ్వ లేదు. అతనికి అవకాశం ఇవ్వాల్సింది'అని వసీం అక్రమ్ చెప్పుకొచ్చాడు.

# ఆర్సీబీ ఆల్‌టైమ్ రికార్డు : చరిత్రలో ఫస్ట్ టైమ్..!

రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు అదరగొట్టింది. ప్లేఆఫ్కు వెళ్లాలంటే తప్పక గెలవాల్సిన మ్యాచ్లో పంజా విసిరింది. చిన్నస్వామి స్టేడియంలో చెన్నై సూపర్ కింగ్స్తో జరిగిన మ్యాచ్లో 27 పరుగుల తేడాతో నెగ్గింది. తొలుత బ్యాటింగ్ చేసిన ఆర్సీబీ నిర్ణీత 20 ఓవర్లలో అయిదు వికెట్లు కోల్పోయి 218 పరుగులు చేసింది. డుప్లెసిస్ (54; 39 బంతుల్లో, 34, 36) టాప్ స్కోరర్.విరాట్ కోహ్లి (47; 29 బంతుల్లో, 34, 46), రజత్ పటిదార్ (41; 23 బంతుల్లో, 24, 46), కామెరూన్ గ్రీన్ (38★; 17 బంతుల్లో, 34, 36) సత్తాచాటారు. మిచెల్ శాంట్నర్ (1/23) పొదుపుగా బౌలింగ్ చేశాడు. అయితే ఆర్సీబీ 219 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించినప్పటికీ, ప్లేఆఫ్స్ చేరాలంటే చెన్నైని 200 పరుగులకే కట్టడి చేయాలి. కాగా, ఆఖరి వరకు ఉత్కంఠగా సాగిన ఛేదనలో సీఎస్కే 20 ఓవర్లకు ఏడు వికెట్లు కోల్పోయి 191 పరుగులకు పరిమితమైంది. రచిన్ రవీంద్ర(61; 37 బంతుల్లో, 54, 36), రవీంద్ర జడేజా (42; 22 బంతుల్లో, 34, 36), అజింక్య రహానె (33; 22 బంతుల్లో, 34, 16), ఎంఎస్ ధోనీ (25; 13 బంతుల్లో, 34, 16) పోరాడారు.ప్లేఆఫ్కు క్వాలిఫై కావాలంటే సీఎస్కేకు చివరి ఆరు బంతుల్లో 17 పరుగులు అవసరమయ్యాయి. యశ్ దయాల్ వేసిన తొలి బంతిని ధోనీ స్టేడియం బయటకు పంపించాడు. కానీ యశ్ ఆ తర్వాత అద్భుతంగా బౌలింగ్ చేసి ఆఖరి అయిదు బంతుల్లో ఒక్క పరుగే ఇచ్చాడు.అయితే ప్లేఆఫ్కు చేరిన ఆర్సీబీ చరిత్ర సృష్టించింది. ఈ సీజన్లో బెంగళూరు జట్టు తొలి ఎనిమిది మ్యాచ్లో కేవలం ఒక్క విజయమే సాధించి, ఏడింట్లో ఓడింది. వరుసగా ఆరు మ్యాచ్లో పరాజయం చవిచూసింది. కానీ చివరి ఆరు మ్యాచ్లో విజయాలతో హోరెత్తించి లీగ్ తదుపరి దశకు చేరుకుంది.
ఈ క్రమంలో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు ఆల్టైమ్ రికార్డు నెలకొల్పింది.
తొలి ఏడు మ్యాచ్లో ఒకే విజయం సాధించి ప్లేఆఫ్కు చేరిన తొలి జట్టుగా ఆర్సీబీ రికార్డు సాధించింది. ఐపీఎల్ చరిత్రలో మరే జట్టు ఆర్సీబీలా గొప్పగా పుంజుకుని ప్లేఆఫ్కు చేరలేదు. 2016లోనూ ఆర్సీబీ పవర్ఫుల్ కమ్బ్యాక్ టీమ్గా




చరిత్రకెక్కింది. ఆ సీజన్లో తొలి ఏడు మ్యాచ్లో రెండే విజయాలు సాధించింది. కానీ చివరి ఏడు మ్యాచ్లో ఆరు నెగ్గి ప్లేఆఫ్కు వెళ్లింది.
ఇక ఓ ఐపీఎల్ సీజన్లో వరుసగా ఆరు విజయాలు, ఆరు ఓటములు చవిచూసిన ఏకైక జట్టుగా రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు రికార్డు సృష్టించింది. డెక్కన్ ఛార్జర్స్ (2010), పంజాబ్ కింగ్స్ (2020), సన్రైజర్స్ హైదరాబాద్ (2022) వరుసగా అయిదు విజయాలు, అయిదు ఓటములు చవిచూశాయి.

### చెన్నై విజయం అనంతరం
## భావోద్వేగానికి గురైన కోహ్లీ దంపతులు

రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్టు అద్భుతంగా పుంజుకుంది. ఐపీఎల్-2024 పాయింట్ల పట్టికలో అట్టడుగు స్థాయి నుంచి ఏకంగా ప్లే ఆఫ్స్కు చేరుకుంది. శనివారం రాత్రి చెన్నై సూపర్ కింగ్స్పై 27 పరుగుల తేడాతో గెలిచి ప్లే ఆఫ్స్లో నాలుగవ బెర్త్ను ఖరారు చేసుకుంది. దీంతో ఆర్సీబీ ఆటగాళ్లతో పాటు అభిమానుల ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. ముఖ్యంగా స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ, అతడి భార్య అనుష్క శర్మ భావోద్వేగానికి గురయ్యారు. ఏమాత్రం ఆశలు లేని స్థితి నుంచి ప్లే ఆఫ్స్కు చేరడంతో విరాట్ కన్నీళ్లను అదుపు చేసుకోలేకపోయాడు. మ్యాచ్ను ప్రత్యక్షంగా వీక్షించిన అనుష్క శర్మ కూడా ఎమోషనల్ అయ్యింది. ఆమె కూడా కళ్లు చెమర్చింది. ఇందుకు సంబంధించిన ఫొటోలు, వీడియోలు సోషల్ మీడియాలో వైరల్గా మారాయి.
కాగా రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్టు ఇప్పటివరకు ఒక్కసారి కూడా ఐపీఎల్ ట్రోఫీని గెలవలేకపోయింది. ఈ సారి ప్లే ఆఫ్స్కు చేరడంతో ఆ జట్టు ఫ్యాన్స్ గంపెడాశలు పెట్టుకున్నారు. కాగా కోల్కతా నైట్ రైడర్స్, రాజస్థాన్ రాయల్స్, సన్రైజర్స్ హైదరాబాద్ జట్లు ఇప్పటికే ప్లే ఆఫ్స్కు అర్హత సాధించాయి. నేడు (ఆదివారం) జరగనున్న చివరి రెండు మ్యాచ్ల ఫలితాల ఆధారంగా ప్లే ఆఫ్స్ మ్యాచ్లు ఏయే జట్ల మధ్య జరగనున్నాయనేది ఖరారవుతుంది.

# ఎన్టీఆర్ కోసం బ్రహ్మాస్త్రం



యంగ్ టైగర్ ఎన్టీఆర్ ప్రస్తుతం కొరటాల శివ దర్శకత్వంలో దేవర సినిమాను చేస్తున్న విషయం తెల్సిందే. మరో వైపు బాలీవుడ్ స్టార్ దర్శకుడు అయాన్ ముఖర్జీ దర్శకత్వంలో రూపొందుతున్న వార్ 2 లో కూడా ఎన్టీఆర్ నటిస్తున్నాడు. ఈ రెండు సినిమాల షూటింగ్స్ సమాంతరంగా సాగుతున్నాయి. ఈ రెండు సినిమాల తర్వాత ఎన్టీఆర్ చేయబోతున్న సినిమా ఏంటీ అనేది ఇప్పటికే అధికారికంగా కన్ఫర్మ్ అయ్యింది. కేజీఎఫ్, సలార్ క్రియేటర్ ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో ఎన్టీఆర్ సినిమా రూపొందబోతుంది. వచ్చే ఏడాది ఆరంభం కు వీరి కాంబో మూవీ పట్టాలెక్కే అవకాశాలు ఉన్నాయట. ఎన్టీఆర్ కోసం రెడీ చేసిన కథ కు దర్శకుడు ప్రశాంత్ నీల్ డ్రాగన్ అనే టైటిల్ ను అనుకున్నాడట. అయితే డ్రాగన్ టైటిల్ ఇప్పటికే బాలీవుడ్ స్టార్ ఫిల్మ్ మేకర్ కరణ్ జోహార్ చేతిలో ఉందట. చాలా కాలం క్రితం కరణ్ జోహార్ ఆ టైటిల్ ను రణబీర్ కపూర్, ఆలియా జంటగా రూపొందిన సినిమా కోసం రిజిస్టర్ చేయించాడు. డ్రాగన్ అనే టైటిల్ అనుకున్నప్పటికి వారి సినిమాకు చివరకు బ్రహ్మాస్త్ర టైటిల్ ను కన్ఫర్మ్ చేశారు. ఇప్పటికే బ్రహ్మాస్త్ర సినిమా వచ్చింది. అయినా ఇప్పటికి కూడా డ్రాగన్ టైటిల్ ను కరణ్ జోహార్ తన వద్దే పెట్టుకున్నాడు. ఆ టైటిల్ లో ఉన్న పవర్ ఫుల్ ఫీల్ ఉన్న మూవీ కోసం కరణ్ జోహార్ వెయిట్ చేస్తున్నాడు. ఎన్టీఆర్, ప్రశాంత్ నీల్ మూవీ కోసం డ్రాగన్ టైటిల్ ను కరణ్ జోహార్ ఇచ్చేశాడట. సన్నిహితుల ద్వారా కరణ్ జోహార్ ను సంప్రదించడం ద్వారా టైటిల్ మార్పిడి జరిగిందని తెలుస్తోంది. త్వరలోనే వీరి కాంబో మూవీ కి సంబంధించిన అధికారిక ప్రకటన వచ్చే అవకాశాలు ఉన్నాయి. ఎన్టీఆర్ కి డ్రాగన్ అనే టైటిల్ కచ్చితంగా సెట్ అవుతుందని ఫ్యాన్స్ నమ్ముతున్నారు. ప్రశాంత్ నీల్ చాలా నమ్మకంతో ఎన్టీఆర్ కి ఆ టైటిల్ అనుకున్నాడు. కనుక ఆ టైటిల్ కు న్యాయం చేసే విధంగా ఖచ్చితంగా సినిమా ఉంటుందనే నమ్మకం వ్యక్తం అవుతోంది.

# సీనియర్‌తో దురుసుగా...



ఒకే సినిమాలో ఇద్దరు హీరోయిన్లు కలిసి నటిస్తున్నారంటే? వాళ్లిద్దరి మధ్య తగ్గాఫ్ వార్ తప్పనిసరి. ది బెస్ట్ అనిపించుకోవడం కోసం పోటాపోటీగా నటిస్తుంటారు. ఒక్కోసారి అది బ్యాలెన్స్ తప్పిందంటే వ్యక్తిగత వివాదాలకు దారి తీస్తుంటుంది. అలాంటి సంఘటనలు ఎన్నో చోటు చేస్తున్నాయి. తాజాగా సెట్స్ లో దురుసుగా ప్రవర్తించడంతో స్టార్ వారసురాలు సోనాక్షి సిన్హా సీనియర్ నటి మనీషా కోయిరాలకు క్షమాపణలు చెప్పిన సంగతి ఆలస్యంగా వెలుగులోకి వచ్చిందివీరిద్దరు కలిసి సంజయ్ లీలా భన్సాలీ దర్శకత్వం వహించిన 'హీరామండి'లో నటించిన సంగతి తెలిసిందే. ఇటీవలే రిలీజ్ అయిన వెబ్ సిరీస్ మంచి విజయం సాధించింది. విదేశాల్లో సైతం సిరీస్‌కి మంచి రెస్పాన్స్ వస్తోంది. తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న సోనాక్షి సిన్హా క్షమాపణలు చెప్పింది. 'నాకు మనీషా కోయిరాలా అంటే ఎంతో ఇష్టం. హీరామండి సిరీస్ చూసిన తర్వాత ఆమెకి క్షమాపణలు చెప్పాను. కొన్ని సన్నివేశాల్లో భాగంగా మనీషాతో దురుసుగా ప్రవర్తించాల్సి వచ్చింది. సిరీస్ చూసిన తర్వాత అలాంటి నటితో వాటిని ఎలా చేయగలిగాను అనిపించింది. అందుకే సారీ చెప్పాను. ఆమె ఎంతో గొప్ప నటి. సహ నటిని ప్రోత్సహిస్తారు. షూటింగ్ ఎంతో గొప్పసాగా సాగింది. అంత గొప్ప నటితో కలిసి పనిచేసే అవ కాశం రావడం అదృష్టంగా భావిస్తున్నా. మళ్లీ ఆమెతో కలిసి పనిచేసే రోజు ఎప్పుడు వస్తుందా? అని ఎదురు చూస్తున్నా. సంజయ్ సినిమాల్లో నటించడం పెద్ద కష్టం కాదు. అన్నీ ఆయన ముందే చెప్పేస్తారు. భన్సాలీ మెచ్చుకోవడం ఎప్పటికీ మర్చిపోలేను. నా కెరీర్‌లో గొప్ప ప్రశంసగా మిగిలిపోతుంది. మంచి పాత్ర ఇచ్చినందుకు ఎప్పటికీ రుణపడే ఉంటాను' అని అన్నారు. హీరా మండిలో సోనాక్షి సిన్హా ద్యూయల్ రోల్‌లో మెప్పించిన సంగతి తెలిసిందే. ఆమె ఆహార్యం, నటన ప్రతీది ప్రేక్ష కుల్ని ఎంతగానో ఆకట్టుకుంది. తొలి సారి నెగిటివ్ పాత్ర పోషించింది. ఆ పాత్ర ఆమెకి ఇంత గొప్ప పేరు తీసు కొచ్చింది. ఇదే సిరీస్ లో వాళ్లతో పాటు అతిది రావు హైదరీ, రిచా చద్దా, షర్మిన్ సెగల్, సంజీదా షేక్ కీలక పాత్రలు పోషించిన సంగతి తెలిసిందే.



# అక్కడ ముగిసిన వార్.. మరి ఇక్కడ



**సినిమా వేరు..రాజకీయం వేరు అని ఇండస్ట్రీకి చెందిన ప్రతీ ఒక్కరూ భావిస్తారు. అదే పాజిటివ్ ఎనర్జీతో అంతా ముందుకెళ్తున్నారు. నిన్న మొన్నటివరకూ మెగా ఫ్యామిలీ హీరోలంతా ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న సంగతి తెలిసిందే. రామ్ చరణ్..వరుణ్ తేజ్..సాయితేజ్..వైష్ణవ్ తేజ్ ఇలా అంతా జనసేనకు మద్దతుగా ప్రచారం చేసారు. మెగాస్టార్ చిరంజీవి నేరుగా పిఠాపురం వచ్చి ప్రచారం చేయలేదు గానీ తమ్ముడికి సంపూర్ణ మద్దతు ప్రకటించారు. అలాగే కూటమి తరువున పోటీ చేస్తోన్న వారందర్నీ గెలిపించాలని సోషల్ మీడియా వేదికగా వీడియోలు కూడా రిలీజ్ చేసారు.**

వీళ్లందరికీ కాంట్రాస్ట్ గా ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ మాత్రం నంద్యాల వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థికి మద్దతు ప్రకటించారు. తన స్నేహితులు కావడంతోనే పార్టీలతో సంబంధం లేకుండా తన సహకారాన్ని అందించారు. ఇలా చేయడంతో మెగా-అల్లు అభిమానుల మధ్య ఎలాంటి వైరం తలెత్తిందో తెలిసిందే. అభిమానుల మధ్య సోషల్ మీడియాలో పెద్ద యుద్ధమే జరిగింది. అయితే ఇదంతా ముగిసిన గతం. తాజాగా ఈ హీరోలంతా మళ్లీ మ్యాకప్‌లు వేసుకుని షూటింగ్‌లకు బయల్దేరారు. చరణ్ గేమ్ ఛేంజర్ షూటింగ్ లో పాల్గొంటున్నాడు. ఆర్సీ 16 కూడా వచ్చే నెల నుంచి పట్టాలెక్కించనున్న నేపథ్యంలో గేమ్ ఛేంజర్ తన పోర్షన్ జూన్ కల్లా పూర్తి చేయాలని ముందుకు కదిలాడు. చిరంజీవి కూడా ఎన్నికలు సహా ఎండలు ఎక్కువగా ఉండటంతో ఇన్ని రోజులు బ్రేక్ తీసుకున్నారు. ఆయన కూడా విశ్వంభర షూట్ లో బిజీ అయ్యారు. సాయితేజ్..వైష్ణవ్ తేజ్ ఇద్దరు కొత్త ప్రాజెక్ట్ పనుల్లో బిజీ అయ్యారు. వరుణ్ తేజ్ 'మట్కా' షూటింగ్‌ని తిరిగి ప్రారంభించాడు. ఇక అల్లు అర్జున్ కూడా 'పుష్ప-2' షూట్‌లో బిజీ అయ్యాడు. ఈ సినిమా షూట్ కూడా డిలే అవ్వడంతో వీలైనంత త్వరగా పూర్తి చేయాలని పరుగు మొదలు పెట్టాడు. ఇలా మెగా హీరోలంతా మళ్లీ బ్యాక్ టూ పెవిలియన్ అనిపించారు. పొలిటికల్ వార్ కి ముగింపు పలికి షూటింగ్ అనే కొత్త వార్‌లోకి దిగారు. రాజకీయాల్లో విమర్శలు-ప్రతివిమర్శలు సహజం. వాటిని సీరియస్‌గా తీసుకునే అవకాశం లేదు. ఎందుకంటే సినిమా వేరు..రాజకీయం వేరు అని ఇండస్ట్రీకి చెందిన ప్రతీ ఒక్కరూ భావిస్తారు. అదే పాజిటివ్ ఎనర్జీతో అంతా ముందుకెళ్తున్నారు.

ఇక ఎవరికి వారు సినిమా బిజీలో ఉన్నారు. తమ తమ షూటింగ్‌లతో వారి షెడ్యూల్స్‌తో నెక్స్‌ట్ ప్రాజెక్ట్స్‌తో ఇలా రక రకాల పనులతో యమ బిజీ అయిపోయారు. మరి పవన్ ను దాదాపు చాలా కాలం పాటు సినిమాలకు బ్రేక్ ఇచ్చారన్న విషయం తెలుస్తుంది. మరి ఆయన కూడా తాను ఒప్పుకున్న ప్రాజెక్ట్‌లను పూర్తి చేసే పనిలో పడ్డారు. మరి ఎన్నికల్లో ఆశించిన విధంగా ఫలితాలు వస్తాయా రాదా అన్న విషయాన్ని పక్కన పెడితే సినిమాలు పరంగా మాత్రం వీరంతా బిజీ అనే చెప్పాలి. ఒకవేళ ఆశించిన విధంగా పార్టీ పగ్గాలు దక్కించుకుంటే తదుపరి కార్యక్రమం ఎలా ఉండాలి. సినిమాలను రాజకీయాలను పవన్ ఏ విధంగా బ్యాలెన్స్ చేస్తారో వేచి చూడాలి మరి.

## కూటమి గెలిస్తే పవన్ హోదాపై ఫ్యాన్స్ రియాక్షన్

కూటమి అధికారంలోకి వస్తే పవన్ కళ్యాణ్ మంత్రి వర్గ విస్తరణలో ఏ శాఖ బాధ్యతలు తీసుకుంటారు అనే చర్చ నడుస్తోంది. కూటమి గెలిస్తే పవన్ హోదాపై ఫ్యాన్స్ రియాక్షన్ ఏపీ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు జూన్ 4న వెలువడనున్నాయి. ఈ సారి ఎన్నికలలో



కూటమి అధికారంలోకి వస్తుందని అందులో ఉన్న పార్టీల నాయకులు బలంగా నమ్ముతున్నారు. అదే సమయంలో మళ్ళీ అధికారం తమదే అని వైసీపీ నాయకులు విశ్వసిస్తున్నారు. పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ జనసేన పార్టీకి కూడా ఈ ఎన్నికలు చాలా కీలకంగా మారాయి. పవన్ ఫ్యాన్స్ అందరూ ఈ సారి జనసేన ప్రభావం బలంగా ఉండబోతోందని నమ్ముతున్నారు. కూటమి అధికారంలోకి వస్తే పవన్ కళ్యాణ్ మంత్రి వర్గ విస్తరణలో ఏ శాఖ బాధ్యతలు తీసుకుంటారు అనే చర్చ నడుస్తోంది. కొంతమంది ఉప ముఖ్యమంత్రి హోదాలో పవన్ కళ్యాణ్ ఉంటాడని అంటున్నారు. హోం మంత్రి పదవి అయితే పవన్ కళ్యాణ్ కి కరెక్ట్ గా సెట్ అవుతుందని మరికొంత మంది ఫ్యాన్స్ పోస్టులు పెడుతున్నారు. హోం మంత్రి హోదాలో ఉంటే పోలీస్ వ్యవస్థని సక్రమంగా బాధ్యతలు నిర్వహించేలా పవన్ కళ్యాణ్ చేయగలడని అంటున్నారు. పవన్ కళ్యాణ్ కనీసం రెండేళ్లయిన ముఖ్యమంత్రిగా ఉండాలని అభిమానులు ఆశిస్తున్నారు. అయితే ఇది జరగడానికి అవకాశాలు చాలా తక్కువ ఉన్నాయి. పవన్ కళ్యాణ్ కి కూడా ముఖ్యమంత్రిగా ఉండాలనే ఆలోచన లేనట్లు కనిపిస్తోంది. రాజకీయాల సంగతి ఇలా ఉంటే ప్రస్తుతం పవన్ కళ్యాణ్ చేతిలో మూడు పెద్ద ప్రాజెక్ట్స్ ఉన్నాయి. అందులో రెండు పాన్ ఇండియా సినిమాలే కావడం విశేషం. సుజిత్ దర్శకత్వంలో ఓజీ మూవీ ఆల్ మోస్ట్ కంప్లీట్ అయిపొయింది. పవన్ కళ్యాణ్ కొన్ని రోజులు కాల్ షీట్స్ ఇస్తే మిగిలిన భాగం షూట్ చేసేసి సెప్టెంబర్ లో రిలీజ్ చేయాలని అనుకుంటున్నారు. అలాగే హరీష్ శంకర్ దర్శకత్వంలో ఉస్తాద్ భగత్ సింగ్ మూవీ కూడా ఒక షెడ్యూల్ కంప్లీట్ అయ్యి ఆగింది. హరిహర వీరమల్లు మూవీ కూడా కంప్లీట్ చేయాల్సి ఉంది. ఒక వేళ కూటమి అధికారంలోకి వస్తే ఇప్పట్లో పవన్ కళ్యాణ్ సినిమాలపై ఫోకస్ పెట్టకపోవచ్చనే మాట వినిపిస్తోంది. ప్రభుత్వంలో భాగం అవుతారు కాబట్టి అడ్మినిస్ట్రేషన్ పరంగా అన్ని విషయాలు తెలుసుకొని తరువాత ఈ ఏడాది ఆఖరులో వీలుబట్టి డేట్స్ కేటాయించే ఛాన్స్ ఉంటుంది. ఎన్నికల ఫలితాల తర్వాత పవన్ కళ్యాణ్ చేయబోయే సినిమాల భవితవ్యం ఆధారపడి ఉందనే మాట వినిపిస్తోంది.

# సినిమా ధియేటర్ల మూత సినీ పరిశ్రమ దీనస్థితిని తెలియజేస్తోందా

**వినోదంతోపాటు విజ్ఞానాన్ని, సంగీత జ్ఞానాన్ని, ఆహ్లాదకరమైన కుటుంబ వ్యవస్థ రూపాన్ని, సామాన్యుల మనస్సుల్లో సజీవ శిల్పంగా నిల్పిన సినిమా పరిశ్రమ ఒకనాటి మాట. మారుతున్న జనరేషన్కు అనుకూలంగా కొత్త సాంకేతికతను జోడించడం ప్రారంభించాక అసహజం, అతిశయోక్తి చోటు చేసుకుని ప్రేక్షకులకు ఈ రంగం దూరమయింది. ఏ టెక్నాలజీ అందుబాటులో లేని కాలంలోనే లవకుశ, మాయాబజార్ లాంటి సినిమాలు ధియేటర్లలో రజితోత్సవాలు, శతదినోత్సవాలు జరువుకున్న రోజులవి.**

దియేటర్ బయట 20 రూలకు దొరికే వాటర్ బాటిల్ వందరూపాయలు, 25 రూ దొరికే చిప్స్ ప్యాకెట్ 200 రూలు యాభై రూపాయల్లో దొరికే డ్రింకులన్నీ రెండు వందలకు పైగా, ఇంకా సమోసాలు లాంటివి ఏవి తినాలాన్నా, ఏవి కొనాలన్నా ధరల నియంత్రణ లేక ప్రేక్షకుల జేబులు ఖాళీ అవుతాయని భయపడి సినిమాలు చూడ్డం మానేశారు. ఒక ఫ్యామిలీ సినిమా చూడాలంటే వేలు ఖర్చుపెట్టాల్సి వస్తోంది. సినిమా ఆడే వారంలోనే ఎక్కువ బ్లాక్రేటుకు టిక్కెట్లు కొనాల్సివస్తోంది.

పల్లెటూర్లలోని జనం పట్టణాలకు బండ్లు కట్టించుకుని వచ్చి మరీ నాటి దేవదాసు లాంటి సినిమాలను చూసేవారు. నాడు అతి తక్కువ నెలవారీ జీతాలకు పనిచేసే యాక్టర్లు, దర్శకులు కూడా ఒక సినిమా నిర్మాణం మహా యజ్ఞంగా భావించి సహజత్వం కోసం సంవత్సరాలు నిరీక్షించేవారు. నాటి నిర్మాతలు దర్శకులు, కథలు, నటీనటులు, పాటలు, చిత్రీకరణలపట్ల రాజీ పడకుండా అసభ్యతకు, అశ్లీలతకు తావులేకుండా అత్యంత అంకితభావంతో పాటెనా, కథెనా సంవత్సరాల తరబడి గుర్తుంచుకునేలా శ్రద్ధతీసుకునేవారు. కాలం మారి క్రమేణా సినిమాలో హీరో, హీరోయిన్ల ప్రాధాన్యత పెరిగి కథ మొదలు మిగతా చిన్న యాక్టర్లు, చిత్రీకరణ కూడా వారి కనుసన్నల్లోనే ఉండాలనుకోవడం, సినిమా ఖర్చులో మూడొంతులు హీరో, హీరోయిన్ల రెమ్యునరేషన్కే ఇవ్వాల్సి రావడంతో ఒక వంతు ఖర్చుతో మిగతా సినిమాను మమ అనిపించి ప్రేక్షకుల సహనానికి పరీక్ష పెడుతున్నారు. బాహుబలి లాంటి కొద్ది సినిమాలతో అంతర్జాతీయ ఖ్యాతితోపాటు ఆర్థిక లబ్ధికూడా చేకూరినా అన్నీ ఆస్థాయిలో ఆడక నిర్మాతలు నష్టాలు చవిచూస్తున్నారు. విపరీతంగా పెరిగిపోయిన కరెంటు, వర్కర్స్ మెయింటినెన్స్, అవుట్డోర్ ఖర్చులు భరించలేక సినిమా నిర్మాణాలు ఆగిపోతే ఖాళీగా ఉన్న ధియేటర్ల ఖర్చు భారమై కూల్చి కమరిషయల్ కాంప్లెక్సులుగా మార్చుకుంటున్నారు.



ఇంకా కొంతమంది ఒకే ధియేటర్లో మల్టీ స్క్రీన్స్ పెట్టి చుట్టూ కమరిషయల్ కాంప్లెక్స్‌లో వ్యాపారం చేస్తున్నారు. దీంతో ధియేటర్ బయట 20 రూలకు దొరికే వాటర్ బాటిల్ వందరూపాయలు, 25 రూ దొరికే చిప్స్ ప్యాకెట్ 200 రూలు యాభై రూపాయల్లో దొరికే డ్రింకులన్నీ రెండు వందలకు పైగా, ఇంకా సమోసాలు లాంటివి ఏవి తినాలాన్నా, ఏవి కొనాలన్నా ధరల నియంత్రణ లేక ప్రేక్షకుల జేబులు ఖాళీ అవుతాయని భయపడి సినిమాలు చూడ్డం మానేశారు. ఒక ఫ్యామిలీ సినిమా చూడాలంటే వేలు ఖర్చుపెట్టాల్సి వస్తోంది. సినిమా ఆడే వారంలోనే ఎక్కువ బ్లాక్రేటుకు టిక్కెట్లు కొనాల్సి వస్తోంది.అందుకే పెద్దపెద్ద స్క్రీన్లు ఉన్న టి.వి.లు కొనుక్కుని ఒ.టి.టిలో డబ్బులు కట్టి కావాలనుకున్న సినిమాను ఇంట్లోనే చూస్తూ సామాన్యులు కూడా ధియేటర్ల ముఖం చూడడం మానేశారు. దీంతో నేడు సింగిల్ స్క్రీన్ ధియేటర్లకు వెళ్ళేవాళ్ళు తగ్గిపోయి తెలంగాణా రాష్ట్రంలో ఏకంగా 10 రోజులపాటు సినిమా ధియేటర్లను మూసివేసే పరిస్థితి వచ్చింది. ఒకప్పటి వినోదం నేడు అన్నిట్లో విపరీతమై ప్రేక్షకులను ధియేటర్లకు రప్పించడంకోసం భాషలోను, వేషంలోను నాగరికం నగ్నరూపమై నాట్యం చేస్తున్నా ఆదరణ లేదు. కొన్ని ఇతర భాషాచిత్రాలు సహజత్వానికి దగ్గరగా ఉండి సక్సెస్ సాధించినవి తెచ్చి తెలుగులోకి డబ్బింగ్ చేసుకున్నా రిపీట్ ఆడియన్స్ లేక లాభాలు రావడంలేదు. సరైన కథలు లేక స్వాతంత్ర్యపు కాలంనాటి ఏవో ఇతివృాఎత్తాలను కథలుగా తీసుకుని కొంత పాతరంగు పూసుకున్నా సహజత్వానికి దగ్గరగా లేక చతికిలబడుతున్నాయి. కుటుంబ బాంధవ్యాలకు బాగా విలువ ఉన్న నాటి కాలంలో కుటుంబ కథా చిత్రాలకు విపరీతమైన ఆదరణ ఉండేది. 90 సంవత్సరాలు పూర్తిచేసు కుంటున్న తెలుగుచిత్ర పరిశ్రమ సాంకేతికతలో సహేతుకత లోపించ దంవల్ల కుదేలెపోయింది. జనంలో మానసికంగా వచ్చిన మార్పుతో సినిమాలకు ఆదరణ తగ్గి నేడు ఎప్పుడో బలగం లాంటి కుటుంబ నేపథ్యమున్న సినిమాలు వస్తే కొత్తగా వింతగా చూస్తున్నారు. నటీనటులు రెమ్యునరేషన్ తగ్గించుకొని, సినిమా నిర్మాణ ఖర్చును నియంత్రణ చేసుకుని కథాబలమున్న, సంగీత ప్రాధాన్యత ఉన్న సినిమాలు తీస్తే ప్రేక్షకులు ఎప్పుడూ ఆదరిస్తారు. 1951లో వచ్చిన మల్లీశ్వరి, దేవదాసు, పాతాళ భైరవి, తర్వాత కాలంలో వచ్చిన తెనాలి రామకృష్ణ, మాయాబజార్, నర్తనశాల, గుండమ్మకథ, ఆ తర్వాత తరంలో శంకరాభరణం, సాగర సంగమం, లాంటి ఎన్నో వందల సినిమాలు నేటికీ ప్రేక్షకాదరణ పొందుతున్నవే. రాజకీయ నటుల జీవితాలు సినిమా కథల్లో బలవంతపు బయోపిక్లై, మరోపక్క సినిమా రంగంవారు తమ ఉనికికోసం రాజకీయాల్లో కలగావులగమై వీటిల్లోనే చట్టాలు, న్యాయాలు భాగమై, ఒకరినొకరు విమర్శించుకుంటున్న కారణం కూడా వాస్తవాలకు, అవాస్తవాలకు హద్దులు చెరిగిపోయి అదికూడా కొంత సినిమారంగం విలువ తగ్గడానికి కారణమవుతోంది. లక్షలాది మంది కార్మికులకు జీవనాధారమై, కోట్లాది రూపాయలు ఖర్చుపెట్టి తీస్తున్న సినిమాలు ధియేటర్లలో పట్టుమని పదిరోజులు కూడా ఆడక పోవడానికి కారణాలు ఇప్పటికైనా నిర్మాతలు, దర్శకులు, నటీనటులు, సాంకేతిక నిపుణులు విశ్లేషించుకోకపోతే భవిష్యత్తులో ఇప్పటికే కుదెలెపోయిన నాటకరంగానికి నకలుగా మిగులుతుంది సినీ పరిశ్రమ.

–జోస్యుల వేణుగోపాల్,
9440436806

PRINTED & PUBLISHED BY NUKARAPU PADMAJA ON BEHALF OF SPR PUBLICATIONS PVT.LTD, SURYA SOUDHA, PLOT NO.185, M.C.H NO:258/1/185,SIDDIVINAYAKA NAGAR, NEAR AYYAPPA SOCIETY, MADHAPUR, HYDERABAD-500081. PRINTED AT SPR PRINTING PRESS, SURYA SOUDHA, PLOT NO.185, M.C.H NO:258/1/185,SIDDIVINAYAKA NAGAR, NEAR AYYAPPA SOCIETY, MADHAPUR, HYDERABAD-500081, TELANGANA, PUBLISHED AT SPR PUBLICATIONS PVT.LTD, SURYA SOUDHA, PLOT NO.185, M.C.H NO:258/1/185,SIDDIVINAYAKA NAGAR,NEAR AYYAPPA SOCIETY, MADHAPUR, HYDERABAD-500081. EDITOR : NUKARAPU PADMAJA. Fax No:040-30473232 RNI Registration No. APTEL/2007/22044.